thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 165 | కరీంనగర్ శనివారం, 23 ఆగష్టు 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## సామాన్యుల సంపద ధనికుల జేబుల్లోకి : ఖర్గే

దేశంలో గుత్తాధిపత్యం కారణంగా సామాన్యుల సంపద ధనికుల జేబుల్లోకి వెళ్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే పేర్కొన్నారు. ఖర్గే కీలక వ్యాఖ్యలు చేశారు. 'ఎన్నికల సంస్థలతో సహా అన్నింటిలోనూ కేంద్రం జోక్యం చేసుకుంటోంది. అన్నిచోట్లా తన ఆధిపత్యాన్ని నెలకొల్పు తోంది. ఎలక్ట్రానిక్ టెక్నాలజీ కారణంగా ఎన్నికల్లో మోసాలు జరుగుతున్నాయి. ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాలు ఈవీఎంలను వదిలి బ్యాలెట్ వైపు మొగ్గు చూపుతు న్నాయి. ప్రపంచంలో ఎక్కడా ఈవీఎంలు అందుబాటులో లేవు. 140 కోట్ల మంది ప్రజలు ప్రజాస్వామ్యాన్ని నమ్ముతున్నారు. త్వరలోనే ఈ దేశ యువత మేలుకొని బ్యాలెట్‌లకు మద్దతుగా ఈవీఎంలకు వ్యతిరేకంగా తమ గొంతు వినిపిస్తారు' అని ఖర్గే పేర్కొన్నారు.




హైదరాబాద్ : కూకట్‌పల్లిలో బాలిక(11 ఏళ్లు) హత్య కేసును పోలీసులు ఛేదించారు. బాలిక హత్య చేసిన వ్యక్తిని పోలీసులు గుర్తించారు. కేసుకు సంబంధించిన వివరాలను గురువారం నాడు పోలీసులు మీడియాకు వెల్లడించారు. అమ్మాయిని 10వ తరగతి చదువుతున్న అబ్బాయి హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని పూర్తి వివరాలు రాబట్టారు. నిందితుడు తాను బాలికను ఎందుకు చంపాననే వివరాలను పోలీసులకు పూసగుచ్చినట్లు వివరించాడు. బాధితుల ఇంటి పక్కన బిల్డింగ్‌లో ఉంటున్న ఈ అబ్బాయి.. దొంగతనం కోసం బాలిక ఇంటికి వెళ్లినట్లు పోలీసులు తెలిపారు. అయితే చోరీ సమయంలో తనను బాలిక చూడటంతో.. ఆమె నిందితుడు దాడి చేశాడు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన అమ్మాయి ప్రాణాలు కోల్పోయింది. కూకట్‌పల్లిలో తమ కూతురుతో నివాసం ఉంటుంటున్న దంపతులు.. ఎప్పటిలాగే తమ తమ విధులకు వెళ్లిపోయారు. ఇంట్లో కూతురు మాత్రమే ఉంది. అయితే, మధ్యాహ్నం భోజనం కోసం చిన్నారి తండ్రి ఇంటికి వచ్చాడు. తలుపు ఓపెన్ చేసి చూడగా షాక్ అయ్యాడు. రక్తపు మడులో తన బిడ్డ పడి ఉండటం చూసి గట్టిగా అరిచాడు. స్థానికులు వచ్చి చూశారు. పోలీసులకు సమాచారం అందించగా.. ఘటనా స్థలానికి చేరుకున్నారు. బాలిక మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని.. దర్యాప్తు చేపట్టారు. బాలిక శరీరంపై 20 కత్తిపోట్లు గుర్తించిన పోలీసులు.. నిందితులు ఎవరనేది తేల్చడానికి ప్రత్యేక బృందాలతో తీవ్రంగా గాలించారు. అయితే, ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో కేసు మిస్టరీగా మారింది. ఈ క్రమంలో లభించిన ఒక ఎవిడెన్స్‌తో నిందితుడిని గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. చిన్నారి హత్యపై గత ఐదు రోజులుగా అనేక ప్రచారాలు జరిగాయి. చివరకు అమ్మాయిని చంపేసింది.. ఒక మైనర్ బాలుడు అని తెలడం స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది.




## గుడ్ న్యూస్..

### వైద్య ఆరోగ్యశాఖలో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల

హైదరాబాద్, ఆగస్టు22 : తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైంది. 1623 స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టుల భర్తీకి రేవంత్ ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలోని హాస్పిటల్‌లో 1616, ఆర్టీసీ హాస్పిటల్‌లో 7 పోస్టులు భర్తీ చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆయా దరఖాస్తులకు సెప్టెంబర్ 8వ తేదీ నుంచి 22వ తేదీ వరకూ గడువు విధించింది తెలంగాణ ప్రభుత్వం. ఈ పోస్టుల భర్తీతో తెలంగాణ వైద్య విధాన పరిషత్‌లోని హాస్పిటళ్లలో స్పెషలిస్ట్ డాక్టర్ల సంఖ్య పెరుగనున్నాయి. జిల్లా, ఏరియా హాస్పిటళ్లు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో వైద్య సేవలు మరింత మెరుగవనున్నాయి. పల్లెలకు స్పెషాలిటీ వైద్య సేవలు చేరువ అవనున్నాయి. ఆరోగ్యశాఖలో ఇప్పటికే సుమారు 8 వేల పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసింది. మరో 7 వేల పోస్టులకు భర్తీ ప్రక్రియ కొనసాగుతోంది.




## ఆయనకు రాజకీయంగా మెచ్యూరిటీ రాలేదు

హైదరాబాద్ : బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌తోపాటు ఆ పార్టీ ఎమ్మెల్యే కేటీఆర్‌పై కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి. జగ్గారెడ్డి మరోసారి మండిపడ్డారు. శుక్రవారం గాంధీభవన్‌లో జగ్గారెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. పదేళ్లు మంత్రిగా పని చేసిన కేటీఆర్‌కి రాజకీయంగా మెచ్యూరిటీ రాలేదని ఎద్దేవా చేశారు. కేసీఆర్ దీక్ష.. కాంగ్రెస్ పార్టీ చేసిన డిజైన్ అని అభివర్ణించారు. కేసీఆర్ జాక్‌పాట్ కొట్టాడు. కానీ మా వాళ్ళు కొట్ట లేక పోయారన్నారు. అన్నం లేకుండా కేసీఆర్ ఉండగలడా? అంటూ ఈ సందర్భంగా ఆయన సందేహం వ్యక్తం చేశారు. బాధ్యతాయుతంగా మాట్లాడాల్సిన కేటీఆర్ నోరు జారుతున్నాడంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమయంలో కేటీఆర్ అమ్మమ్మ, తాతయ్య ఉండి ఉంటే.. అతడి చెంపపై కొట్టేవారన్నారు. కేసీఆర్ కుటుంబమంతా డ్రామా ఆర్టిస్టులని ఎద్దేవా చేశారు. తన ప్రశ్నలకు సమాధానం చెప్పే పరిజ్ఞానం కేటీఆర్‌కి ఉందా? అంటూ సందేహం వ్యక్తం చేశారు. కేసీఆర్ కుటుంబానికి క్యారెక్టర్ లేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఇవ్వక పోతే మీరెవరో ప్రజలకు కూడా తెలియక పోయేదని వ్యంగ్యంగా అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు నీకు చిల్లర పార్టీ అయిందా? అంటూ కేటీఆర్‌పై నిప్పులు చెరిగారు. నీ కుటుంబమంతా.. సోనియా గాంధీ ఇంటికి వెళ్లినప్పుడు చిల్లర పార్టీ అనిపించ లేదా? అంటూ కేటీఆర్‌కు ఈ సందర్భంగా జగ్గారెడ్డి చురకలంటించారు.



# కాళేశ్వరం కేసు..
## కేసీఆర్, హరీష్ రావుకు.....
## దిమ్మతిరిగే షాక్ ఇచ్చిన హైకోర్టు!

హైదరాబాద్ : భారత రాష్ట్ర సమితి అధికారంలో ఉన్నప్పుడు కాళేశ్వరం ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారు. భారత రాష్ట్ర సమితి అధికారంలో ఉన్నప్పుడే కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా కీలకమైన మేడిగడ్డలో రెండు ఫిల్లర్లు కుంగిపోయాయి. అప్పట్లో ఈ వంతెన మీదుగా రాకపోకలను నిలిపివేశారు. ఆ తర్వాత మేడిగడ్డ విషయంలో కేంద్ర అధికారులు విచారణ సాగించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ఒక కమిషన్ ను కూడా ఏర్పాటు చేసింది. ఇటీవల ఆ కమిషన్ నివేదిక ఇచ్చింది. ఆ నివేదిక మీడియాకు లీక్ అయింది. ఇక అప్పటి నుంచి కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి నాయకుల మధ్య వాగ్వాదం జరుగుతూనే ఉంది. కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్ పై స్టే ఇవ్వాలని కెసిఆర్, హరీష్ రావు హైకోర్టుకు వెళ్లారు. హైకోర్టు ఎదుట కెసిఆర్, హరీష్ రావు తరఫున న్యాయవాదులు తమ వాదన వినిపించారు.. అసెంబ్లీలో కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్ ను ప్రవేశపెట్టకుండా ఉండాలని హైకోర్టును విన్నవించారు.. ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు కేసిఆర్, హరీష్ రావుకు వ్యతిరేకంగా తీర్పు ఇచ్చింది. ఇటువంటి స్థితిలో తాము మధ్యంతర ఉత్తరంలో ఇవ్వలేమని స్పష్టం చేసింది. నివేదికను శాసనసభలో ప్రవేశపెట్టడానికి ఇంకా 6 నెలల సమయం ఉందని.. అలాంటప్పుడు స్టే ఇవ్వాలని ఎలా అడుగుతారని పేర్కొంది. గులాబీ దళపతి, నీటిపారుదల శాఖ మాజీమంత్రి ప్రస్తుతం ఎమ్మెల్యేలుగా కొనసాగుతున్న నేపథ్యంలో.. అసెంబ్లీలో చర్చించిన తర్వాతే తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. అంతేకాదు తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేస్తామని ప్రకటించింది. హైకోర్టు వ్యతిరేకంగా తీర్పు ఇచ్చిన నేపథ్యంలో సుప్రీం కోర్టును ఆశ్రయించే యోచనలో కెసిఆర్, హరీష్ రావు ఉన్నట్టు సమా చారం.

ఒకవేళ సుప్రీంకోర్టులో కూడా వారికి వ్యతిరేకంగా తీర్పు వస్తే.. అప్పుడు ఏం జరుగుతుందనేది చూడాల్సి ఉంది.. మరోవైపు కాళేశ్వరం విషయంలో ఇటీవల కాలంలో భారత రాష్ట్ర సమితి ప్రజెంటేషన్ల మీద ప్రజెంటేషన్లు ఇచ్చింది. కాళేశ్వరంలో ఏ తప్పు జరగలేదని.. అడ్డగోలుగా ఎటువంటి నిర్మాణం చేపట్టలేదని.. ప్రతిదీ కూడా ఇంజనీర్ల ద్వారానే నిర్మించినట్టు ప్రజెంటేషన్లో హరీష్ రావు చెప్పుకొచ్చారు. అయితే ఇప్పుడు హైకోర్టు వ్యతిరేకంగా తీర్పు ఇచ్చిన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సోషల్ మీడియా వేదికగా విమర్శలు చేస్తున్నారు. కాళేశ్వరం విషయంలో తప్పించుకోవాలని చూస్తున్నప్పటికీ హైకోర్టు తలంటిందని.. ఇప్పటికైనా హరీష్ రావు, కెసిఆర్ వాస్తవాలు తెలుసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు గుర్తు చేస్తున్నారు..

# ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో కొత్త శకం?

## అమెరికా నుండి దూరమవుతున్న వాణిజ్య భాగస్వాములు

## భారతదేశం, చైనా, కెనడాకు అదృష్టం..



## బిలియన్ డాలర్ల ఒప్పందాలు..

ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఒక పెద్ద మార్పు వైపు కదులుతోంది. అమెరికా యొక్క అత్యంత ముఖ్యమైన ఏడు వాణిజ్య భాగస్వాములు తమ ఎగుమతులను అమెరికా పోర్టుల నుండి మళ్లించి, కెనడా వైపు మళ్లిస్తున్నాయి. సైనిక పరికరాల కోసం లోహాలు, ఆసుపత్రుల కోసం అవసరమైన మందులు మరియు మనం ప్రతిరోజూ తాగే కాఫీ వంటి వస్తువులు అన్నీ ఇప్పుడు కెనడా పోర్టుల వైపు వెళ్తున్నాయి. గత సంవత్సరంలో మాత్రమే, ఈ దేశాలు కెనడాతో బిలియన్ డాలర్ల విలువైన వాణిజ్య ఒప్పందాలపై సంతకాలు చేసి, కెనడాను ఉత్తర అమెరికాలో ఒక కొత్త వాణిజ్య కేంద్రంగా మారుస్తున్నాయి.

**మార్పుకు కారణం: అమెరికా యొక్క వాణిజ్య విధానాలు...** ట్రంప్ యొక్క 'అమెరికా ఫస్ట్' విధానం మరియు అస్థిరమైన వాణిజ్య విధానాలు చాలా దేశాలను ఒంటరి చేశాయి. ముఖ్యంగా, రష్యా నుండి ముడి చమురు కొనుగోలు చేసినందుకు భారతదేశం వంటి దేశాలపై అమెరికా కఠినమైన పన్నులు విధించింది. ఈ అస్థిరమైన వాణిజ్య విధానాలు విదేశీ సరఫరాదారులను అమెరికాతో వాణిజ్యం చేయడానికి వెనకాడేలా చేశాయి. దీని ఫలితంగా, కెనడా తన స్థానాన్ని తెలివిగా ఉపయోగించుకుని, ఈ దేశాలతో స్థిరమైన మరియు నమ్మదగిన వాణిజ్య సంబంధాలను ఏర్పరచుకుంటుంది.

**కెనడా యొక్క వ్యూహాత్మక చర్య మరియు అమెరికా యొక్క సవాళ్లు...** కెనడా, ఈ దేశాలతో ప్రత్యేక వాణిజ్య ఒప్పందాలను ఏర్పాటు చేసి, అదనపు పన్నులను తగ్గిస్తోంది. ఇది అమెరికా మార్కెట్ కంటే కెనడాలో తమ వస్తువులను తక్కువ ధరకు విక్రయించడానికి మరియు తద్వారా ఎక్కువ లాభం పొందడానికి ఆ దేశాలకు అవకాశం ఇస్తోంది. ముఖ్యంగా, అమెరికా వాణిజ్య ఆంక్షల వల్ల భారతదేశం మరియు చైనా తమ ఎగుమతి అవకాశాలను కోల్పోతున్న సమయంలో, కెనడా ఒక కొత్త మార్కెట్‌గా ఉద్భవించింది. దీని ఫలితంగా, అమెరికా ప్రస్తుతం పెరుగుతున్న వస్తువుల ధరలు, దుకాణాలలో ఖాళీగా ఉన్న అల్మారాలు మరియు దాని పారిశ్రామిక నాయకత్వం నెమ్మదిగా తగ్గుతున్న సవాళ్లను ఎదుర్కొంటోంది.

**భవిష్యత్తు కోసం మార్గం...** ఒక దేశం ప్రస్తుత రాజకీయాలలో మునిగిపోయినప్పుడు, దాని పోటీదారులు భవిష్యత్తు కోసం మార్గాన్ని ఏర్పాటు చేస్తారు. ఇది సహజం. అమెరికా యొక్క అహంకారం మరియు అంతర్గత కలహాలు దాని ప్రపంచ నాయకత్వానికి ఒక పెద్ద ముప్పుగా మారుతున్నాయి. కెనడా ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని, అమెరికాతో పోటీపడి, తనను తాను ప్రపంచ వాణిజ్య కేంద్రంగా స్థాపించుకుంటుంది. ఈ మార్పును అమెరికా గుర్తించి, తన విధానాలను పునఃపరిశీలించకపోతే, దాని ప్రపంచ అగ్రరాజ్య హోదా ప్రమాదంలో పడవచ్చు. ఈ వాణిజ్య మార్పులు, ప్రపంచ ఆర్థిక కేంద్రం అమెరికా నుండి దూరంగా వెళ్లి, భారతదేశం, చైనా వంటి ఆసియా దేశాలు మరియు కెనడా వంటి స్థిరమైన పాశ్చాత్య దేశాల వైపు మళ్లుతున్నాయని సూచిస్తున్నాయి.



# 50 గంటల అరెస్టుతో ఉద్యోగాలే పోతుంటే..

## 50 గంటల అరెస్ట్‌తో ఉద్యోగాలే పోతుంటే.. పీఎం, సీఎంలకు ఊరటా?: ప్రధాని మోదీ

తప్పు చేస్తే సీఎం, ప్రధానినైనా తొలగించే బిల్లును విపక్షాలు వ్యతిరేకిస్తుండటంపై ప్రధాని మోదీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్జేడీ, కాంగ్రెస్ నేతలు ఉంటే జైల్లో.. లేకపోతే బెయిల్‌పై ఉన్నారని ఎద్దేవా చేశారు. అందుకే అవినీతికి వ్యతిరేకంగా పోరాడడానికి ప్రవేశపెడుతున్న బిల్లును వ్యతిరేకిస్తున్నారని విమర్శించారు. 50 గంటలు జైలు శిక్ష అనుభవిస్తే ఒక ప్రభుత్వ ఉద్యోగి తన ఉద్యోగాన్ని కోల్పోతున్నప్పుడు.. జైలు శిక్ష అనుభవించిన ఒక ముఖ్యమంత్రి, ప్రధాన మంత్రి తమ స్థానం నుంచి దిగిపోకుండా ఎలా ఉంటారని మోదీ ప్రశ్నించారు. బిహార్‌లోని గయాజీలో జరిగిన బహిరంగ సభలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. "కొంతకాలం క్రితం కొందరు నేతలు జైళ్ల నుంచి ఫైళ్లపై సంతకాలు చేయడం, ప్రభుత్వ ఆదేశాలు ఇవ్వడం మనం చూశాం. అవినీతికి పాల్పడే నేతలే పరిపాలన చేస్తే.. ఇక దేశంలో అవినీతిని ఎలా తొలగించగలుగుతాం?" అని మోదీ ప్రశ్నించారు. ఇకపై క్రిమినల్ నేతలకు అటువంటి అవకాశం ఇవ్వబోమని అన్నారు. అవినీతికి వ్యతిరేకంగా పోరాడడానికి ఎన్డీఏ ప్రభుత్వం తీసుకువస్తున్న చట్టానికి ఎవరూ అతీతులు కారని.. ప్రధాని కూడా దీని పరిధిలోకి వస్తారని పేర్కొన్నారు. తీవ్రమైన నేరారోపణలతో అరెస్టయి వరుసగా 30 రోజులపాటు నిర్బంధంలో ఉంటే ప్రధానమంత్రినైనా, కేంద్ర మంత్రినైనా పదవి నుంచి తొలగించేందుకు వీలు కల్పించే బిల్లును అమిత్ షా ఇటీవల లోక్‌సభలో ప్రవేశపెట్టారు. అనంతరం వాటిని సంయుక్త పార్లమెంటరీ కమిటీ పరిశీలనకు పంపారు. తీవ్ర నేరారోపణకు గురై అరెస్టయినప్పుడు కేంద్ర మంత్రిని, రాష్ట్ర లేదా కేంద్రపాలిత ప్రాంత ముఖ్యమంత్రిని, రాష్ట్ర మంత్రిని పదవి నుంచి తొలగించేందుకు ఈ బిల్లు అనుమతిస్తుంది. కనీసం అయిదేళ్ల శిక్ష పడే నేరానికి పాల్పడి, అరెస్టయి, నెల రోజులు నిర్బంధంలో ఉంటే 31వ రోజున వారి పదవి పోయేలా నిబంధనను ఈ బిల్లులో చేర్చారు. వారంతట వారు రాజీనామా చేయకపోయినా కొత్త నిబంధన ప్రకారం పదవిని కోల్పోతారు.



# గోడ దూకి.. పార్లమెంట్ ప్రాంగణంలోకి చొరబాటుదారుడు

దిల్లీ: దేశ రాజధాని దిల్లీలో పార్లమెంట్ భవనం వద్ద భద్రతాపరమైన ఉల్లంఘన చోటుచేసుకుంది. అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండే ఆ ప్రాంతంలో ఒక చొరబాటుదారుడు చెట్టు ఎక్కి, గోడ దూకి పార్లమెంట్ ప్రాంగణంలోకి ప్రవేశించాడు. శుక్రవారం ఉదయం 6.30 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. రైలు భవన్ వైపు నుంచి గోడ దూకి కొత్త పార్లమెంట్ భవనానికి చెందిన గరుడ గేట్ వద్దకు చేరుకున్నాడని అధికారులు తెలిపారు. ఆ చొరబాటుదారుడిని భద్రతా సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం అతడిని విచారిస్తున్నారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ముగిసిన మరుసటిరోజే ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. జులై 21న ఈ సమావేశాలు ప్రారంభమయ్యాయి 2023లో పార్లమెంట్ శీతాకాల సమావేశాల వేళ లోక్‌సభలోకి ఇద్దరు దుండగులు దూసుకొచ్చిన సంగతి తెలిసిందే. పార్లమెంట్‌పై ఉగ్రదాడి జరిగి 22 ఏళ్లు అయిన డిసెంబరు 13న ఆ ఘటన చోటుచేసుకోవడం అప్పట్లో తీవ్ర కలకలం రేపింది. లోక్‌సభలోని పబ్లిక్ గ్యాలరీ వద్ద కూర్చొన్న ఇద్దరు యువకులు సభలోకి దూకి గందరగోళం సృష్టించారు. రంగుల పొగను వదిలి అందరినీ భయభ్రాంతులకు గురిచేశారు. అదే సమయంలో పార్లమెంట్ వెలుపల కూడా ఇద్దరు వ్యక్తులు ఇదేరకమైన నిరసనను చేపట్టారు. ఈ ఘటన తర్వాత పార్లమెంట్‌లో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. గతేడాది ఆగస్టులో కూడా ఈతరహా ఉల్లంఘన చోటుచేసుకుంది. ఓ యువకుడు పార్లమెంట్ గోడ దూకి లోపలికి చొరబడేందుకు యత్నించాడు. నిందితుడిని ఉత్తరప్రదేశ్‌కు చెందిన మనీశ్‌గా పోలీసులు గుర్తించారు. అప్పుడు ఆ నిందితుడి వద్ద ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభించలేదు. అతడి మానసిక పరిస్థితి సరిగా లేదని అప్పట్లో పోలీసులు వెల్లడించారు.

**ఉత్తర్‌ప్రదేశ్ వ్యక్తిగా గుర్తింపు..** తాజా ఘటనలో పేర్కొన్న నిందితుడిది ఉత్తర్‌ప్రదేశ్. అతడి పేరు రామా అని అధికారులు వెల్లడించారు. 20 ఏళ్ల ఆ వ్యక్తి మానసిక పరిస్థితి సరిగాలేదని ప్రాథమికంగా భావిస్తున్నారు. అయితే అతడు ఏ ఉద్దేశంతో ఇలాంటి చర్యకు పాల్పడ్డాడో తెలుసుకునేందుకు ఐబీ, దిల్లీ పోలీసులకు చెందిన ప్రత్యేక విభాగం అతడిని ప్రశ్నిస్తోంది.

# అందుకే యూరియా ఆలస్యమైంది



సిద్దిపేట, ఆగస్టు 22: ఆపరేషన్ సింధూర్ వల్ల యూరియా రావడం ఆలస్యమైందని బీజేపీ సీనియర్ నేత, మెదక్ ఎంపీ ఎం. రఘునందన్ రావు వెల్లడించారు. శుక్రవారం సిద్దిపేటలోని వివిఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఎంపీ రఘునందన్ రావు మీడియాతో మాట్లాడుతూ.. కొంత మంది కావాలని యూరియా కొరత పేరిట చెప్పులను లైన్‌లో పెట్టించి మరి రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. 50 వేల మెట్రిక్ టన్నుల యూరియాను వారం రోజుల్లో తెలంగాణకు తీసుకు వస్తామని ఆయన హామీ ఇచ్చారు. రైతులకు యూరియా ఇచ్చేది బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు కాదని కేంద్ర ప్రభుత్వం మాత్రమే అని ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు గుర్తు చేశారు. రైతులందరికి సరిపడే యూరియాను వారం రోజుల్లో అందిస్తామన్నారు. కొంత మంది యూరియాను కృత్రిమ కొరత సృష్టిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా అధికారులకు ఆయన ఆదేశించారు. రాజకీయ నాయకుల తప్పుడు ఆరోపణలను నమ్మవద్దని.. అలాగే ఆందోళన చెంద వద్దంటూ రైతులకు సూచించారు. ఇక ఫ్లెక్సీల కోసం దిగజారి రాజకీయం తాము చేయమని స్పష్టం చేశారు. ఇలాంటి తప్పుడు పనులు చేసే వారికి వచ్చే ఎన్నికల్లో డిపాజిట్ సైతం రాదని మెదక్ ఎంపీ రఘునందన్ రావు జోస్యం చెప్పారు. రాష్ట్రాల మధ్య వివక్ష చూపుతున్నారంటూ ప్రధాని మోదీపై కొంతమంది దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. రాష్ట్రాల్లో ఎవరు అధికారంలో ఉన్నా కేంద్ర ప్రభుత్వం సమ దృష్టితో.. సమన్యాయం చేస్తుందని తెలిపారు. ఒక్కొక్క గ్రామ పంచాయతీ భవనానికి రూ. 20 లక్షలు, అంగన్వాడీ కేంద్రానికి రూ. 10 లక్షలు నిధులను కేంద్రం విడుదల చేస్తుందని చెప్పారు. సిద్దిపేట జిల్లాలోని గజ్వేల్, దుబ్బాక, సిద్దిపేట నియోజక వర్గాల్లో 26 అంగన్వాడీ కేంద్రాలకు రూ. 2. 8 కోట్లు కేటాయించారని వివరించారు. కాంగ్రెస్ నాయకులు పనుల జాతర పేరిట కొబ్బరి కాయలు కొడుతున్నారంటూ ఎద్దేవా చేశారు. కేంద్రం ఇచ్చే నిధులను వారు ఎలా ఖర్చు చేస్తారని ప్రశ్నించారు. వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. మెదక్ జిల్లాలోని 27 అంగన్వాడీ కేంద్రాలకు రూ. 2. 10 కోటలు నిధులు మంజూరు చేశామని వివరించారు. మెదక్ లోక్ సభ నియోజకవర్గ పరిధిలో 56 అంగన్వాడీ కేంద్రాలకు రూ. 4. 6 కోట్ల నిధులు కేంద్రం విడుదల చేసిందని గుర్తు చేశారు. పనుల జాతర పేరిట రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించే పనుల్లో 75 శాతం నిధులు కేంద్రం ఇచ్చిందని.. మిగిలిన 25 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందని ఎంపీ రఘునందన్ రావు తెలిపారు.



# కుక్కలకు వీధుల్లో ఆహారం పెట్టొద్దు

వీధి కుక్కల బెడదకు సంబంధించి సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు వెలువరించింది. వీధులు లేదా బహిరంగ ప్రదేశాల్లో వీటికి ఆహారం అందించడం చట్టవిరుద్ధమని స్పష్టం చేసింది. వీధి కుక్కలకు నిర్దేశిత ప్రాంతాల్లోనే ఆహారం అందించాలని, ఇందుకోసం అధికారులు ప్రతి వార్డులో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటుచేయాలని పేర్కొంది. ఆ ప్రాంతాల్లో మాత్రమే ఆహారం అందించాలని సూచిస్తూ నోటీసు బోర్డులు ఏర్పాటుచేయాలని వెల్లడించింది. ఎట్టి పరిస్థితుల్లోనూ వీధుల్లో కుక్కలకు ఆహారం ఇవ్వకూడదని, ఈ ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. నియంత్రణ లేకుండా ఆహారం ఇవ్వడం వల్ల అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుంటున్నాయని వచ్చిన నివేదికలను పరిగణనలోకి తీసుకొని ఈ ఆదేశాలు జారీచేస్తున్నట్లు చెప్పింది. సామాన్య పౌరులు వీధుల్లో నడిచేటప్పుడు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇటువంటి పద్ధతికి స్వస్తి పలకాలని అభిప్రాయపడింది.

**కోర్టులు చేతులు కట్టేసుకోవాలా?...** దిల్లీ ఎన్‌సీఆర్ ప్రాంతం నుంచి వీధి కుక్కలన్నింటినీ తరలించాలంటూ ఆగస్టు 11న సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. వీటి దాడులు పెరిగిపోవడంపై ఆందోళన వ్యక్తంచేసిన ద్విసభ్య ధర్మాసనం దిల్లీలో అవి ఎక్కడా కనిపించడానికి వీల్లేదని, వీటిని షెల్టర్లకు తరలించాలని తీర్పు చెప్పింది. ఈ ఆదేశాలపై తీవ్ర అభ్యంతరాలు, నిరసనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి.అంజరియాతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారించింది. ఈసందర్భంగా రేబిస్ లక్షణాలు లేదా విపరీత ప్రవర్తన కలిగిన కుక్కలు మినహా ఇప్పటివరకు షెల్టర్లకు తరలించిన వాటిని విడుదల చేయాలని ఆదేశించింది. వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ చేసిన తర్వాత వాటిని ఎక్కడ నుంచి తీసుకొచ్చారో అక్కడే విడిచిపెట్టాలని పేర్కొంది. ఇందుకు సంబంధించి ఆగస్టు 11న ఇచ్చిన తీర్పును సవరించిన న్యాయస్థానం.. తదుపరి విచారణ ఎనిమిది వారాలకు వాయిదా వేసింది.



# రైతులను రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్నారు

భీమదేవరపల్లి: గౌరవెల్లి ప్రాజెక్టుకు భూసేకరణ జరుగుతోందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం మల్లారంలో ఆయన పర్యటించారు. అంగన్వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. వీర్లగడ్డ తండాలో పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. హనుమకొండ జిల్లాలో భూసేకరణకు రూ.25 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. ఎన్‌జీటీ కేసుకు సంబంధించి ప్రభుత్వం రూ.10 కోట్లు చెల్లించిందని తెలిపారు. గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తిచేసి ఈ ప్రాంత రైతులకు నీరందిస్తామని పేర్కొన్నారు. రైతులను రెచ్చగొట్టేలా భారత రాష్ట్ర సమితి వ్యవహరిస్తోందని విమర్శించారు. 42 శాతం రిజర్వేషన్లతో స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేసి రిజర్వేషన్లు సాధించుకోవాలన్నారు.



# శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద

నిజామాబాద్: జిల్లాలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతోంది. దీంతో 16 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు ఇన్‌ఫ్లో 80 వేల క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో 78,812 క్యూసెక్కులుగా ఉంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు 16 గేట్ల ద్వారా 49,280 క్యూసెక్కులు, కాకతీయ కాలువ ద్వారా 6,500 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 1,500 క్యూసెక్కులు, ఇందిరమ్మ వరద కాలువ ద్వారా 20 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు కాగా.. ప్రస్తుతం 1090.8 అడుగులకు చేరుకుంది. పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 79.65 టీఎంసీలుగా నమోదైంది.

## అరెస్టులతో వైఫల్యాలు కప్పిపుచ్చుకోవాలని కాంగ్రెస్ యత్నం: బండి సంజయ్



హైదరాబాద్: భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అరెస్టును కేంద్ర మంత్రి బండి సంజయ్ ఖండించారు. చేవెళ్లలో పార్టీ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తుంటే ఎందుకు అరెస్టు చేశారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా భారత రాష్ట్ర సమితి బాటలోనే నడుస్తోందని మండిపడ్డారు. అరెస్టులతో వైఫల్యాలు కప్పిపుచ్చుకోవాలని ప్రభుత్వం యత్నిస్తోందని విమర్శించారు. తక్షణమే రామచందర్‌రావు, కార్యకర్తలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

భాజపా నాయకులను అక్రమంగా అరెస్టు చేశారని ఆ పార్టీ ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. అరెస్టు చేసిన నాయకులు, కార్యకర్తలను విడుదల చేయాలన్నారు. చేయాల్సింది అరెస్టులు కాదు.. సమస్యల పరిష్కారమని చెప్పారు. నిరంకుశ విధానాలు మానకపోతే ప్రజాక్షేత్రంలో మట్టి కరిపించడం ఖాయమన్నారు. జీహెచ్‌ఎంసీలో సమస్యల పరిష్కారం కోరుతూ భాజపా నేడు సచివాలయం ముట్టడికి పిలుపునిచ్చింది. దీంతో పలువురు నేతలను పోలీసులు అరెస్టు చేశారు. మొయినాబాద్ వద్ద ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావును హైదరాబాద్‌కు వస్తుండగా అరెస్టు చేశారు.

## బనకచర్ల అంశం చర్చకు రాలేదు: రాహుల్ బొజ్జా



హైదరాబాద్: గోదావరి– కావేరి నదుల అనుసంధానంపై ఎన్‌డబ్ల్యూడీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన సంప్రదింపుల భేటీ ముగిసింది. మరోమారు సమావేశం నిర్వహిస్తామని సీడబ్ల్యూసీ ఛైర్మన్ అతుల్ జైన్ వెల్లడించారు. నదుల అనుసంధానంపై రాష్ట్ర అభిప్రాయాలు వివరించినట్లు తెలంగాణ నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా పేర్కొన్నారు. తెలంగాణ నుంచి వెళ్తున్న నీటిలో సగం అంటే.. 74 టీఎంసీలు కోరినట్లు తెలిపారు.

" ఏపీ నాలుగు ఇంట్రా లింక్‌లను ప్రతిపాదించింది. తెలంగాణ సమ్మతి లేకుండా ఇంట్రా లింకులు ఆమోదించవద్దని కోరాం. బనకచర్ల లింక్ అంశం అంతగా చర్చకు రాలేదు. ఈ ప్రాజెక్టుపై రాష్ట్ర అభిప్రాయాలను గతంలోనే చెప్పాం." అని రాహుల్ బొజ్జా వివరించారు.

## కేక్ కట్ చేయాల్సిన బాలుడు తలకొరివి పెట్టడం కలచివేసింది: జస్టిస్ నగేశ్ భీమపాక

హైదరాబాద్: జీహెచ్‌ఎంసీలో లైసెన్స్ తీసుకున్న కేబుళ్లు తప్ప ఏవీ ఉంచవద్దని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. రామంతాపూర్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా నిర్వహించిన ఊరేగింపు రథానికి కేబుల్ వైరు తగిలి ఐదుగురు మృతి చెందిన సంగతి తెలిసిందే. దీంతో విద్యుత్ స్తంభాలపై కేబుల్ వైర్లను యుద్ధప్రాతిపదికన తొలగించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలో భారతి ఎయిర్‌టెల్ సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ నగేశ్ భీమపాక మరోసారి విచారణ జరిపారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడటంపై న్యాయమూర్తి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రామంతాపూర్ ఘటనను ఆయన ప్రస్తావించారు. బర్త్‌డే రోజే తండ్రికి తలకొరివి పెట్టిన బాలుడి ఘటనపై ఉద్వేగభరితంగా మాట్లాడారు. కేక్ కట్ చేయాల్సిన 9 ఏళ్ల బాలుడు తలకొరివి పెట్టడం కలచివేసిందని జస్టిస్ నగేశ్ భీమపాక అన్నారు. విద్యుత్ ప్రమాదంపై ఎవరికి వారే చేతులు దులిపేసుకుంటే ఎలా?అని ఆగ్రహం వ్యక్తం చేశారు. "ప్రజల ప్రాణాలకు బాధ్యులెవరు?పసిహృదయం పగిలిపోయింది.. దీనికి అందరం బాధ్యులమే. సమాజం సిగ్గుతో తలదించుకోవాలి. చలన రహిత చట్టాలతో ప్రజల ప్రాణాలను ఎలా కాపాడగలం?"అని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. వైర్ల బరువుతో స్తంభాలు ఒరిగిపోతున్నాయన్న పిటిషనర్ల వాదనపై జస్టిస్ నగేశ్ భీమపాక ఆగ్రహం వ్యక్తం చేశారు. మామూళ్లతో కొందరు ఉద్యోగుల జేబులు బరువెక్కుతున్నాయన్నారు. ఒకరినొకరు నిందించుకోవద్దని.. ఇలాంటివి పునరావృతం కానివ్వొద్దని సూచించారు. స్తంభాలపై అన్ని వైర్లు నలుపు రంగులో ఉన్నందున గుర్తుపట్టలేకపోయామని పిటిషనర్ తరపు న్యాయవాది పేర్కొనగా.. కరెన్సీ నోట్లపై ఉన్న గాంధీని మాత్రం బాగానే గుర్తుపడతారని న్యాయమూర్తి చురకలంటించారు.



# చంద్రయాన్ విజయోత్సవం - భారతావనికి గర్వ కిరీటం

## - అంతరిక్ష విజ్ఞాన విజయ గాథలో స్వదేశీ స్ఫూర్తి

### జాతీయ అంతరిక్ష దినోత్సవం - భారత అంతరిక్ష యాత్రలో సువర్ణ ఘట్టం - ఆగస్టు 23...జాతీయ అంతరిక్ష దినోత్సవం




భారతదేశం శాస్త్రసాంకేతిక రంగంలో సాధించిన విజయాలలో అంతరిక్ష పరిశోధనకు ఒక ప్రత్యేక గౌరవ స్థానం ఉంది. ప్రపంచం లోని అగ్రరాజ్యాల సరసన నిలబడి, స్వంత ఉపగ్రహాలను ప్రయోగించి, చంద్రుడి వైపు దూసుకెళ్లిన భారత్, 2023 ఆగస్టు 23న ఒక అపూర్వ ఘట్టాన్ని సృష్టించింది. ఆ రోజు చంద్రయాన్-3 విజయవంతంగా చంద్రుడి దక్షిణ ధ్రువంపై దిగింది. ఇది భారత అంతరిక్ష పరిశోధన చరిత్రలో మాత్రమే కాకుండా, ప్రపంచ అంతరిక్ష చరిత్రలోనూ కొత్త అధ్యాయాన్ని ప్రారంభించిన ఘనత. ఈ సంఘటనకు గుర్తుగా భారత ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఆగస్టు 23న "జాతీయ అంతరిక్ష దినోత్సవం" గా జరుపుకోవాలని నిర్ణయించింది. ల భారత అంతరిక్ష పరిశోధన ప్రయాణం 1962లో విక్రమ్ సారాభాయ్ దూరదృష్టితో ప్రారంభమైంది. 1975లో తొలి ఉపగ్రహం ఆర్యభటను కక్ష్యలో ప్రవేశపెట్టడం ద్వారా భారత్ అంతరిక్ష శాస్త్రంలో తన అడుగులు వేసింది.


అప్పటి నుంచి ఇస్రో (ISRO) వందలాది ఉపగ్రహాలను ప్రయోగిస్తూ వాతావరణ అంచనాలు, టెలి కమ్యూనికేషన్, రిమోట్ సెన్సింగ్, వ్యవసాయం, విపత్తు నిర్వహణ వంటి రంగాల్లో అపారమైన సహకారం అందిస్తోంది. 2013లో మంగళ యాన్ మిషన్ విజయంతో అమెరికా, రష్యా, యూరప్ తరువాత మంగళ గ్రహాన్ని చేరుకున్న నాలుగో దేశంగా భారత్ నిలిచింది. ఈ మిషన్ కేవలం 450 కోట్ల రూపాయల వ్యయంతో పూర్తయి, ప్రపంచాన్ని ఆశ్చర్య పరిచింది. 2023లో చంద్రయాన్-3 మిషన్ ద్వారా భారత్ మరొక మైలురాయిని చేరుకుంది. అమెరికా, రష్యా, చైనా తరువాత చంద్రుడి మీద దిగిన నాలుగో దేశం భారత్. కానీ చంద్రుడి దక్షిణ ధ్రువంలో విజయవంతంగా ల్యాండింగ్ చేసిన ప్రపంచంలోనే మొదటి దేశం భారత్ కావడం ఈ విజయానికి అపూర్వతను తెచ్చింది. 3.84 లక్షల కిలోమీటర్ల దూరంలో ఉన్న చంద్రునిపై "విక్రం ల్యాండర్" క్షణాల్లో సాఫల్యంగా దిగడం, "ప్రజ్ఞాన్ రోవర్" పరిశోధనలకు శ్రీకారం చుట్టడం, చంద్రుని ఉపరితలంలో సల్ఫర్, అల్యూమినియం, కాల్షియం, ఇనుము వంటి మూలకాల జాడలు గుర్తించడం వంటి విజయాలు ప్రపంచాన్ని భారత ప్రతిభ వైపు మరల్చాయి. ఇది కేవలం 615 కోట్ల రూపాయల వ్యయంతో పూర్తవడం, అమెరికా లేదా రష్యా మిషన్ల ఖర్చుతో పోలిస్తే చాలా తక్కువ కావడం ఇస్రో సామర్థ్యానికి నిదర్శనం. ఈ విజయాన్ని గుర్తు చేసుకోవడమే కాక, దేశ భవిష్యత్తు తరాలకు ప్రేరణనివ్వడం కోసం ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినోత్సవం జరుపుకోవడం నిర్ణయాత్మకం. ఈ దినోత్సవం శాస్త్రవేత్తల అంకితభావానికి గౌరవం మాత్రమే కాదు, దేశవ్యాప్తంగా విద్యార్థుల్లో శాస్త్రాసక్తిని పెంపొందించే అవకాశం కూడా. పాఠశాలలు, కళాశాలల్లో శాస్త్ర ప్రదర్శనలు, వ్యాసరచన పోటీలు, ఖగోళ పరిశీలన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా యువతకు పరిశోధనా తపన కలిగించవచ్చు. అంతరిక్ష సాంకేతికత కేవలం శాస్త్ర ప్రగతికే పరిమితం కాదుబీ అది సామాజిక -ఆర్థిక అభివృద్ధికి మూల స్తంభం. ఉపగ్రహాల సహాయంతో గ్రామీణ ప్రాంతాల్లో టెలి మెడిసిన్, ఆన్‌లైన్ విద్య, వాతావరణ హెచ్చరికలు అందుబాటులోకి వచ్చాయి.

వ్యవసాయ రంగంలో రిమోట్ సెన్సింగ్ ద్వారా పంటల స్థితి, నీటి వనరుల వినియోగం సమర్థవంతంగా జరుగుతోంది. భవిష్యత్తులో గగన యాన్ మిషన్ ద్వారా భారతీయ వ్యోమగాములు అంతరిక్షంలోకి అడుగుపెట్ట బోతున్నారు. అలాగే శుక్రయాన్, అదిత్య-ఎల్1 (సూర్య పరిశోధన), మరికొన్ని మార్స్, వెనస్ మిషన్లు కూడా రూపుదిద్దు కుంటున్నాయి. అందువల్ల జాతీయ అంతరిక్ష దినోత్సవం ఒక జ్ఞాపక దినం మాత్రమే కాదు, అది భారత శాస్త్ర స్ఫూర్తికి ప్రతీక, భవిష్యత్ తరాలకు ఒక దిక్సూచి. విక్రమ్ సారాభాయ్ ప్రారంభించిన యాత్రను ఏపీజే అబ్దుల్ కలాం వంటి మహానుభావులు కొనసాగించారు. ఇప్పుడు ఈ వారసత్వాన్ని ఇస్రో శాస్త్రవేత్తలు కొత్త ఎత్తులకు తీసుకెళ్తున్నారు. ఆగస్టు 23 మన జ్ఞాపకాల్లో ఎప్పటికీ నిలిచిపోయే "భారత అంతరిక్ష గౌరవ దినం".

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# సమాజ సంస్కర్త సాహితీ యోధుడు..తత్త్వవేత్త, శతగ్రంథకర్త బి.ఎస్. రాములు

## ఆగస్టు 23... బి ఎస్ రాములు జన్మ దినం సందర్భంగా



తెలంగాణ సాహిత్య-సామాజిక వేదికల్లో నాలుగు దశాబ్దాలకు పైగా ఆలోచన, కార్యాచరణ, రచనలతో మార్గదర్శకుడైన బి.ఎస్. రాములు (జననం: ఆగస్టు 23, 1949బీ జాగిత్యాల, కరీంనగర్) తన జీవన ప్రయాణాన్ని కార్మిక కుటుంబపు కష్టాలనుంచి ప్రారంభించి ప్రజల పక్షాన నిలిచిన తత్త్వవేత్తగా, శతాధిక గ్రంథాల రచయితగా నిలిచారు. చిన్న వయసులోనే తండ్రిని కోల్పోయి 1955లో బీడీలు చుట్టి కుటుంబాన్ని నిలబెట్టిన తల్లి, గ్రామీణ కళారూపాల కథల పఠనం, పాఠశాల ఉపాధ్యాయుల ప్రోత్సాహంఇవన్నీ ఆయనలో కథా ప్రాణం పెంచాయి. 1960లో జాగిత్యాల మల్టీ పర్పస్ హైస్కూల్లో వేలాది విద్యార్థుల మధ్య క్రమశిక్షణతో చదువుకొని 1967లో ప్రథమ శ్రేణితో ఇంటర్మీడియట్ పూర్తిచేశారు. ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహ సంస్కృత%-%ఆంధ్ర కాలేజీలో 1970%-%74 మధ్య బి.ఓ.ఎల్., బి.ఓ.ఎల్. సాధించారు. ఆర్థిక ఇబ్బందుల మధ్య పగలు బీడి కంపెనీలో పని, పత్రిక ఏజెన్సీ నిర్వహణ, రాత్రిళ్లు చదువు అనే క్రమశిక్షణ ఆయన జీవితాంతం వెంటాడింది. 1975లో సామాజిక సంక్షేమ విభాగంలో హాస్టల్ వార్డెన్‌గా చేరి 20 పాయింట్ల కార్యక్రమంలో 25 సీట్ల హాస్టల్స్‌ను 100 సీట్లకు విస్తరించే లక్ష్యంతో మానేరు డ్యాం పరిసరాల్లో సైకిల్‌పై తిరుగుతూ విద్యార్థులను చేర్పించారు. ఆయన ప్రోత్సాహంతో పెరిగిన విద్యార్థుల్లో చాలా మంది సమాజంలో ఉన్నత స్థానాలకు ఎదిగారు. ఈ దశలో ఆయన జీవన త్రివేణిపరిశీలన, పఠనం, సంస్థాగత జీవితంసమాంతరంగా ప్రవహించాయి. యౌవనంలో ఆర్‌ఎస్సెస్ శాఖస్థాయి సేవా కార్యాచరణలో పాలుపంచుకున్న ఆయన, విప్లవ రచయితల వేదిక (విరసం) వైపు అడుగులు వేసి 1979 నుండి కవిత్వం, పాట కన్నా కథ రచననే ప్రధాన ఆయుధంగా ఎంచుకున్నారు. తొలి నవల బతుకు పోరు (1982) ఐదు ముద్రణలు పొందింది. దానిపై నలభై సమీక్షలు వెలువడగా, రెండు ఎమ్.ఫిల్. పరిశోధనలు నమోదయ్యాయి. ఈ నవల ఆంగ్లంలోకీ కూడా అనువదించ బడింది. తర్వాత చూపు (2013), జీవనయానం (2017) వంటి నవలలు వెలిశాయి. ఆయన కలం నుంచి 175 కథలు వెలువడగా, వాటిలో కొన్ని భద్రపద్యాయి. అయినప్పటికీ 15 కథా సంపుటాలు వెలుగులోకి వచ్చాయి. ఆయన సాహిత్య సృజన సంఖ్యా పరిమితి మాత్రమే కాక, రూపం-విషయాల ప్రయోగాలకు సాక్ష్యాలు. ప్రజా జీవన శ్రమ, వంచన, నిరసనలకు ఆధునిక కథలో నాడీ, న్యాయాన్ని ఇచ్చిన రచయితగా విమర్శకులు గుర్తించారు. తత్త్వవిచారణలోనూ ఆయన దృఢంగా నిలిచారు. గతితర్క తత్త్వదర్శన భూమికలో ద్వంద్వ-ప్రక్రియాత్మక తత్త్వాన్ని తెలుగులో వ్యవస్థీకరించడానికి ప్రయత్నించారు. బౌద్ధం%-%సోషలిజం%-%మార్క్సిజం%-%అంబేద్కరిజం వంటి గ్రంథాలలో తూర్పు దార్శనికత, పాశ్చాత్య విప్లవ సిద్ధాంతం, భారతీయ సామాజిక న్యాయ వాదాల మధ్య సంభాషణను సృష్టించారు. ఆయన తత్త్వ దృక్కోణం "సిద్ధాంతం ప్రజానుభవాన్ని దాటి కొనసాగుబీ అనుభవం సిద్ధాంతాన్ని తగల కూడదు." ఇదే ఆయన రచనలో నైతిక బలం, విశ్లేషణాత్మక భాషా పటిమ. సాహిత్యం-సమాజ ఉద్యమం మిళితమయ్యే స్థలాలను ఆయన నిర్మించారు. 1990లో స్థాపించిన విశాల సాహితీ అకాడమీ ద్వారా 190 పుస్తకాలను ప్రచురించి వందలాది రచయితలకు పురస్కారాలు అందించారు. 1996లో ప్రవహించేపాటుఆంధ్రప్రదేశ్ దళిత గేయాలు సంపుటితో గేయ ప్రతిఘటనను సాహిత్యంలో స్థిరపరిచారు. 1997 నుండి కరీంనగర్ కథలు నాలుగు సంపుటాలు, 2003లో భారతీయ సాహిత్యంతెలుగు కథలు వంటి సంకలనాల వరకు ఆయన సంపాదకత్వం ఒక చరిత్ర. గ్రంథాలయంలా నిలిచింది. వరవర రావు, గూడ అంజయ్య, గద్దర్, వంగపండు తదితరులతో కలిసి ఛలో ఢిల్లీ సాంస్కృతిక-రాజకీయ యాత్రలో పూర్తి కర్తగా పనిచేశారు. తెలంగాణ విద్యార్థి ఉద్యమంలో బుక్‌లెట్ల ప్రచారం, విశ్వ విద్యాలయాల్లో పుస్తకాల విస్తరణ వంటి కొత్త ప్రయోగాలు చేశారు. ఉద్యమ భావజాలానికి తెలంగాణ తల్లి రూపకల్పన, డబుల్ బెడ్రూం ఇండ్ల పథకం, గురుకుల పాఠశాలల మోడల్ వంటి ఐడియాల రూపకల్పనలలో తన ఆలోచనను అందించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2016 అక్టోబర్ 22-23 తేదీల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన రాష్ట్ర బీసీ కమిషన్‌కు తొలి చైర్మన్‌గా నియమితులయ్యారు. మూడు సంవత్సరాల కాలానికి వకులాభరణం కృష్ణమోహన్, డా. అంజనేయగౌడ్, జులురు గౌరీశంకర్ సభ్యులుగా ఉన్న ఈ కమిషన్ పని రాష్ట్ర బీసీల సామాజిక స్థితిగతుల అధ్యయనం, విధాన సిఫారసులు చేయడం. "దేశ రాజ్యాంగం చట్రంలో బీసీ%-%ఎస్సీ%-%ఎస్టి సామాజిక పురోగతే రచయిత కర్తవ్య విస్తరణ" అని ఆయన స్వయంగా నిర్వచించారు. ఆయన రచనల విస్తీర్ణం సంఖ్యల్లోనూ ప్రతిఫలిస్తుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ పుస్తక గృహాల కేటలాగుల్లోనే నలభైకి పైగా రచనలు లభ్యమవుతుండగా, 15 కథా సంపుటాలు, మూడు ప్రచురిత నవలలు, 175 కథలు, 190 సంపాదిత గ్రంథాలుఇవి అన్నీ ఆయన శ్రమకు ప్రతీకలు. ఆంగ్ల సంకలనాల్లోనూ ఆయన కథలు చోటు చేసుకున్నాయి. గోల్డ్ నగెట్స్: సెలెక్టెడ్ పోస్ట్-ఇండిపెండెన్స్ తెలుగు షార్ట్ స్టోరీస్లో ఆయన "Moonlight in the Forest" స్థానం పొందింది. ఆయన రచన మూడు అంచెల్లో విస్తరించిందితత్త్వ, విప్లవ, ఆధునిక. తత్త్వంలో ద్వంద్వతర్కం, బౌద్ధ%-%అంబేద్కర్ సిద్ధాంతాల సంగమం కనిపిస్తే, విప్లవంలో కూలి కార్మికుల శ్రమ, బానిసత్వం, ప్రతిఘటనకు వాణిని ఇచ్చారు. తిరుగుబాటు కథల వంటి రచనల్లో కాకతీయ కాల్వ పనుల్లో బంధి కూలీల వాస్తవం ప్రతిధ్వనిస్తుంది. ఆధునికతలో ఆయన రూప ప్రయోగాలకు ఆసక్తి చూపి ప్రాంతీయ భాషల పలుకుబడిని కథన శిల్పంతో కలిపారు. సంస్థాగత నాయకత్వంలోనూ ఆయన బీసీ వేదికల ఐక్యతకు సిద్ధాంత కార్మికుడిగా నిలిచారు. రచయిత-కళాకార-బుద్ధి జీవుల వేదికలు, దళిత-బీసీ-ఎస్సీ-ఎస్టి ఆందోళనల మధ్య సంభాషణ వాతావరణం, సాహిత్య శిబిరాలు ఇవన్నీ ఆయన రచనను రాజకీయ సాక్ష్యంగా మలిచాయి. "సాహిత్యం వినోదమో పరమార్థమో కాదుబీ సమాజపట్ల బాధ్యత గల సాధనం" అనే ఆయన మాటలు రచయితల కొత్త తరానికి ధర్మ శాస్త్రంలా నిలిచాయి. ఈ సమస్త ప్రయాణానికి పూర్వాపరాలు స్పష్టంగా కనిపిస్తాయి... బడుగు కుటుంబపు కష్టాలు, పాఠశాల సమానత్వం, ఉద్యోగ అనిశ్చితి, గ్రామాల కోసం సైకిల్‌పై తిరిగిన వార్డెన్, ఉద్యమాల్లో పుస్తకాలతో ప్రవక్తలయిన రచయిత, రాష్ట్ర కమిషన్ చైర్మన్‌గా విధాన రూపకల్పన. రెండు వేల విద్యార్థుల మధ్య పెరిగిన ఓ బాలుడు, 100 సీట్ల హాస్టల్ నింపిన వార్డెన్, 175 కథలు, 15 సంపుటాలు, 40కి పైగా గ్రంథాలు, 190 సంపాదిత రచనలుఇన్ని సంఖ్యలు చివరికి ఒకే వాక్యంగా ఒదుగుతాయి: బి.ఎస్. రాములు తెలుగు భాషలో సామాజిక న్యాయానికి శబ్ద శరీరాన్ని ఇచ్చిన తత్త్వవేత్త, రచయిత, నాయకుడు. ఈ రోజు పుస్తకం పట్టే ప్రతి యువకుడికీ ఆయన జీవితం ఒక కార్యాచరణ పథకయిచదువు, చైతన్యం, చురుకుదనం అనే మూడు 'చ'లు. ఇదే ఆయన వారసత్వం, ఇదే ఆయన సాహిత్య ముద్ర, ఇదే ప్రజా తత్త్వానికి ఆధునిక రూపం. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# 'ఉగ్ర'పాముకు పాక్ 'డిజిటల్' పాలు..!



అమెరికా అండదండలు పెరగడంతో పాకిస్థాన్ నిర్భయంగా ఉగ్ర పాములను పెంచి పోషిస్తోంది. ఎఫ్ఏటీఎఫ్‌కు కూడా భయపడకుండా జైషే మహమ్మద్ సంస్థ తన నెట్‌వర్క్‌కు ఓ కొత్తరకం హవాలా మార్గంలో డబ్బులు పంపుతున్నట్లు తేలింది. దీంతో ఉగ్ర విద్యార్థులకు శిక్షణ, భారత్ దాడుల్లో దెబ్బతిన్న క్యాంపస్‌ల పునరుద్ధరణకు పాల్పడుతూ కార్యకలాపాలను విస్తరిస్తోంది.

**అబద్ధాలు చెప్పి గ్రేజాబితా బయటకు..** ఆంక్షల ముప్పును తప్పించుకుంటూనే టెర్రరిజాన్ని పెంచే పనిలో పడింది పాకిస్థాన్. వాస్తవానికి ఎఫ్ఏటీఎఫ్ గ్రేలిస్టు నుంచి బయటపడేందుకు 2019లో పాక్ ప్రభుత్వం నేషనల్ యాక్షన్ ప్లాన్‌ను అమలుచేస్తున్నట్లు ప్రకటించింది. దీని ప్రకారం జైషేకు నిధులు అందకుండా మర్కజ్, మసూద్ అజర్, రవూఫ్ అస్ఘర్, తాల్హాఅల్ షఫీల బ్యాంక్ ఖాతాలను నియంత్రిస్తున్నట్లు ప్రకటించింది. వారు నిధులు బదిలీ చేయకుండా ఆంక్షలు విధించామని చెప్పుకొంది. దీంతో ఎఫ్ఏటీఎఫ్ గ్రే లిస్ట్ నుంచి బయటపడింది. అయితే ఇక్కడే ఓ ట్విస్ట్ ఉంది. పాక్ ఇంటెలిజెన్స్ సంస్థ ఐఎస్ఐ, జైషే కలిసి నిధుల కోసం కొత్త మార్గాన్ని తెరిచాయి. ఇందుకోసం ప్రత్యేకంగా పాకిస్థానీ డిజిటల్ వాలెట్లు ఈజీపైసా, సదాపే వంటి వాటిని వాడటం మొదలుపెట్టాయి.

**ఆపరేషన్ సిందూర్ తర్వాత భారీగా విస్తరణ...** భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టి మర్కజ్ సుభానల్లాతోపాటు నాలుగు ఇతర శిక్షణ కేంద్రాలను ధ్వంసం చేసింది. వీటిల్లో మర్కజ్ బిలాల్, మర్కజ్ అబ్బాస్, మహమోన జోయా, సర్గాల్ ఉన్నాయి. ఆ తర్వాత పాక్ ప్రభుత్వమే వీటిని పునర్ నిర్మించేందుకు నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించింది. మరోవైపు జైషే కూడా వీటికోసం ఆన్‌లైన్‌లో నిధులను సమీకరించే పనిలో పడినట్లు ఇంటెలిజెన్స్ వర్గాలు గుర్తించాయి. ఈజీపైసా అనే వాలెట్ ద్వారా 391 కోట్ల పాకిస్థానీ రూపాయిలను సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకొంది. పాక్ మొత్తం మీద 313 ఉగ్ర శిక్షణ కేంద్రాలను ఏర్పాటుచేసేందుకు ఈ సొమ్మును వినియోగించనుంది. వస్తున్న చందాల మొత్తాన్ని మసూద్ అజార్ కుటుంబం నియంత్రిస్తున్న వాలెట్లకు మళ్లిస్తున్నారు. దీంతో జైషేకు నిధులను ఆపేశామని పాక్ ఎఫ్ఏటీఎఫ్ వద్ద చెప్పుకొనే అవకాశం కలుగుతోంది. నిధుల సమీకరణ కోసం జైషే తన కేడర్‌ను రంగంలోకి దించింది. వారు పోస్టర్లు, వీడియోలు, మసూద్ అజార్ పేరిట లేఖలను ఆన్‌లైన్‌లో పోస్టు చేస్తున్నారు. దీనిలో జైషే 313 కొత్త మర్కజ్‌లు నిర్మిస్తోందని.. ఒక్కో దానికి 1.25 కోట్ల పాకిస్థానీ రూపాయలు అవసరమని సానుభూతిపరులను కోరినట్లు గుర్తించారు.

**డిజిటల్ వాలెట్ల మార్గంలో..** నిధుల సేకరణకు డిజిటల్ వాలెట్లను వాడుతున్నారు. సదాపేలో తల్హా అల్ షఫీ పేరిట ఖాతా తెరిచారు. దీనికి హరిపుర్ జిల్లా కమాండర్ అఫ్తాబ్ అహ్మద్ ఫోన్ నెంబర్ వాడారు. ఈజీపే వాలెట్‌ను మసూద్ అజార్ కుమారుడు అబ్దుల్లా పేరిట నిర్వహిస్తున్నారు. మరో ఈజీపే వాలెట్‌ను ఖైబర్ ప్రావిన్స్ జైషే కమాండర్ సయ్యద్ సఫ్దార్ పేరిట ఉంది. ఇవేకాకుండా ఆ ఉగ్ర సంస్థల సభ్యుల పేరిట మరో 250 వాలెట్లు కూడా చురుగ్గా పనిచేస్తున్నట్లు ఇంటెలిజెన్స్ వర్గాలు గుర్తించాయి.

**కోట్లల్లో సొమ్ము..** మసూద్ అజార్ కుటుంబం 7-8 డిజిటల్ వాలెట్లను నిర్వహిస్తున్నట్లు ఇంటెలిజెన్స్ వర్గాలు భావిస్తున్నాయి. వాటిని ప్రతి 3 లేదా 4 నెలలకు మార్చేస్తున్నారు. వాటిల్లోని భారీ మొత్తాలను కొత్త ఖాతాలకు బదిలీ చేస్తున్నారు. తొలుత ఓ ఖాతాలోకి భారీ మొత్తాన్ని చేర్చి.. అక్కడి నుంచి నిధులు డ్రా చేయడం కోసం 10 నుంచి 15 ఖాతాలకు చిన్న మొత్తాల్లో పంపిస్తున్నారు. జైషే సగటున నెలకు 30 కొత్త వాలెట్లను యాక్టివేట్ చేస్తుండటంతో.. నిధులు ఎక్కడి నుంచి వచ్చాయి.. ఎటు వెళ్లాయో గుర్తించడం ఇబ్బందికరంగా మారింది. ఆ సంస్థ 80 శాతం నిధులు వీటి ద్వారానే వస్తున్నాయి.

ఈ సొమ్మును ఆయుధాల కొనుగోళ్లు, శిక్షణ కేంద్రాల ఏర్పాటు, కమ్యూనికేషన్ల నిర్వహణ, విలాసవంతమైన కార్ల కొనుగోలు, మసూద్ కుటుంబ నిర్వహణకు వాడుతున్నారు. గల్ఫ్ దేశాల నుంచి వీటిల్లోకి అత్యధికంగా సొమ్ము వస్తున్నట్లు తెలుస్తోంది. ఈజీపైసా జైషే నిధులకు మార్గంగా మారింది. ఈ క్రమంలో పాక్ ఎఫ్ఏటీఎఫ్ నిబంధనలు పాటిస్తున్నట్లు చెబుతున్నా.. జైషే డిజిటల్ హవాలా మాత్రం నిరంతరాయంగా సాగుతోంది.

# టారిఫ్‌ల వేళ.. రష్యా కంపెనీలకు భారత్ ఆహ్వానం




భౌగోళిక రాజకీయ సవాళ్లను ఎదుర్కొనేందుకు రష్యా, భారత్‌లు నూతన మార్గాలు అన్వేషించి ముందుకుసాగాలని విదేశాంగ శాఖ మంత్రి జై శంకర్ పేర్కొన్నారు.

ఇందులోభాగంగా భారత్‌లోని కంపెనీల్లో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించిన ఆయన, తద్వారా వ్యాపారాన్ని మరింత విస్తృత పరచుకోవాలని పిలుపునిచ్చారు. రష్యా నుంచి చమురు కొనుగోలు ఆపాలని అమెరికా ఒత్తిడి తెస్తున్న వేళ మాస్కోలో కీలక పర్యటన చేపట్టిన జైశంకర్.. ఇరుదేశాలు సృజనాత్మకంగా ముందుకుసాగాలన్నారు. పాశ్చాత్య దేశాల ఆంక్షలు ఎదుర్కొంటున్న రష్యా నుంచి చమురు కొనుగోళ్లు నిలిపేయాలని.. లేదంటే అధిక పన్నులు విధిస్తామని భారత్‌పై అమెరికా బెదిరింపులకు దిగుతున్న విషయం తెలిసిందే. ఈక్రమంలో రష్యాలో పర్యటిస్తున్న జైశంకర్.. రష్యా ఫస్ట్ డిప్యూటీ ప్రైమ్ మినిస్టర్ డెనిస్ మంటురోవ్‌తో భేటీ అయ్యారు. వాణిజ్యం, ఆర్థిక, సాంకేతిక, సాంస్కృతిక అంశాలపై చర్చలు జరిపారు. ఈ ఏడాది చివరలో భారత్‌లో పుతిన్ పర్యటనకు సంసిద్ధత లక్ష్యంతో విదేశాంగ మంత్రి పర్యటన కొనసాగుతోంది. ఈసందర్భంగా ఇరుదేశాలు ద్వైపాక్షిక వాణిజ్యాన్ని మరింత విస్తరించుకోవడంతోపాటు వివిధ అంశాల్లో సహకరించుకోవాలని జైశంకర్ పిలుపునిచ్చారు. ఎక్కువగా, విభిన్నంగా చేయడమే ఇరువురి వాణిజ్యసూత్రంగా ఉండాలని అభిప్రాయపడ్డారు.

భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోన్న ఆర్థికవ్యవస్థ అని గుర్తుచేసిన ఆయన.. మేక్ ఇన్ ఇండియా వంటి కార్యక్రమాలతో విదేశీ వాణిజ్యానికి కొత్త ద్వారాలు తెరిచిందన్నారు. భారత్‌లో రష్యా కంపెనీల వ్యాపార విస్తరణకు ఇది మరింత దోహదం చేస్తుందన్నారు.

# సరిహద్దుపై నేపాల్ అభ్యంతరం.. ఖండించిన భారత్



భారత్- చైనాల మధ్య వివాదాలు పరిష్కరించుకునే దిశగా ఇరుదేశాలు అడుగులు వేస్తున్నాయి. ఈక్రమంలో లిపులేఖ్ ప్రాంతం మీదుగా వాణిజ్య సరిహద్దులను తిరిగి ప్రారంభించాలని నిర్ణయించుకున్నాయి. దీనిపై నేపాల్ అభ్యంతరం తెలిపింది. కాగా, భారత విదేశాంగ శాఖ దీనిపై స్పందిస్తూ ఈవిషయంలో నేపాల్ వాదనలు అసమగ్రంగా ఉన్నాయని స్పష్టంచేసింది. మహాకాళి నదికి తూర్పున ఉన్న లింపియాధుర, లిపులేఖ్, కాలాపాణిలు తమ దేశంలో భాగమని నేపాల్ విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి లోక్ బహదూర్ ఛెత్రి పేర్కొన్నారు. తమ మ్యాప్‌లోను ఇదే స్పష్టమవుతుందని వాదించారు. ఇప్పటికే ఈవిషయాన్ని చైనా ప్రభుత్వానికి కూడా తెలియజేశామన్నారు. భారత్- నేపాల్‌ల మధ్య ఉన్న సరిహద్దు సమస్యను దౌత్యపరమైన చర్చలతో పరిష్కరించుకునేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. నేపాల్ వాదనలపై భారత విదేశాంగ శాఖ ప్రతినిధి జైశ్వాల్ తీవ్రంగా స్పందించారు. 'లిపులేఖ్ ద్వారా భారత్- చైనాల మధ్య సరిహద్దు వాణిజ్యం తిరిగి ప్రారంభించడంపై నేపాల్ అభ్యంతరం చెప్పడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఈవిషయంలో మా వైఖరి స్థిరంగా, చాలా స్పష్టంగా ఉంది. లిపులేఖ్ ద్వారా మా వాణిజ్యం 1954లో ప్రారంభమై.. కొన్ని దశాబ్దాల పాటు సాగింది. ఆ తర్వాత పలు కారణాల వల్ల ఇటీవల దానికి అంతరాయం కలిగింది. ఇప్పుడు తిరిగి దాన్ని ప్రారంభించాలని ఇరుదేశాలు నిర్ణయించుకున్నాయి' అని పేర్కొన్నారు. నేపాల్ ప్రాదేశిక వాదనలను సమర్థించలేమన్నారు. దాని వాదనలపై ఎలాంటి చరిత్రాత్మక ఆధారాలు లేవన్నారు. కృత్రిమంగా చేపట్టిన సరిహద్దు మార్పులను తాము అంగీకరించబోమని ఉద్ఘాటించారు. ఈ సమస్యను దౌత్యపరమైన చర్చల ద్వారా పరిష్కరించుకునేందుకు భారత్ సిద్ధంగా ఉందని స్పష్టంచేశారు. వివాదాల పరిష్కారం కోసం చైనా విదేశాంగ మంత్రి వాంగ్‌యీ భారత్‌లో పర్యటించిన సంగతి తెలిసిందే. ఈసందర్భంగా ఆయన ప్రధాని నరేంద్ర మోదీ, విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌లతో భేటీ అయ్యారు. ఇరుదేశాల మధ్య నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్చలు జరిపారు. అనంతరం లిపులేఖ్, షిప్కి లా, నాథు లా మార్గాల ద్వారా వాణిజ్యాన్ని తిరిగి ప్రారంభించాలని, ఇందుకు ఇరుదేశాలు అంగీకరించాయంటూ ఓ ఉమ్మడి ప్రకటనను విడుదల చేశారు. పులేఖ్, కాలాపానీ, లింపుయాదురా ప్రాంతాలను తమ భూభాగాలుగా పేర్కొంటూ నేపాల్ 2020లో సరికొత్త మ్యాప్‌ను విడుదల చేసిన సంగతి తెలిసిందే. నాటి కేపీ శర్మ వోలీ ప్రభుత్వం దీనిపై తీర్మానం చేయడంతో పాటు.. పార్లమెంటులో ఆమోదముద్ర కూడా వేసింది. అయితే భారత్ దీనిపై అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ.. నేపాల్ వాటిని బేఖాతరు చేసింది.

చురకలు

## సంపాదకీయం

# భారత్-రష్యా వ్యూహాత్మక బంధం.. కొత్త దిశలో ప్రయాణం


ప్రస్తుత ప్రపంచ వాణిజ్యం, రాజకీయ పరిణామాలు భారత్, రష్యా దేశాల మధ్య ఉన్న సంబంధాలను మరింత బలపరిచే దిశగా సాగుతున్నాయి. ముఖ్యంగా అమెరికా విధించిన అదనపు సుంకాల నేపథ్యంలో ఈ రెండు దేశాల బంధం కొత్త పుంతలు తొక్కుతోంది. భారత్‌పై అమెరికా ఒత్తిడి పెరుగుతున్నప్పటికీ రష్యా మాత్రం భారతదేశానికి అండగా నిలబడుతూ తమ స్నేహాన్ని మరోసారి చాటుకుంది.

**–అమెరికా సుంకాల ప్రభావం: రష్యా మద్దతు...** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై విధించిన అదనపు సుంకాలు అంతర్జాతీయ స్థాయిలో పెద్ద చర్చకు దారితీశాయి. రష్యా నుంచి భారతదేశం చమురు దిగుమతులు పెంచుకోవడమే ఈ సుంకాల నిర్ణయానికి ప్రధాన కారణమని వైట్ హౌస్ ప్రకటించింది. ఈ ఆరోపణలను రష్యా ఉపమిషన్ చీఫ్ రోమన్ బబుష్కిన్ ఖండించారు. భారత్‌పై అమెరికా ఒత్తిడి తీసుకురావడం అన్యాయమని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. అమెరికా చర్యల వల్ల భారత ఎగుమతులకు ఇబ్బందులు ఎదురైనా రష్యా మార్కెట్ ఎప్పుడూ తెరిచే ఉంటుందని బబుష్కిన్ ధైర్యం చెప్పారు. ఇది ఆర్థికంగానే కాకుండా, రాజకీయంగా కూడా ఇరుదేశాల మధ్య ఉన్న గాఢమైన నమ్మకాన్ని, స్నేహాన్ని స్పష్టం చేస్తుంది. రష్యా ఈ సంక్లిష్ట పరిస్థితిని భారత్‌తో తమ సంబంధాలను మరింత పటిష్టం చేసుకోవడానికి ఒక అవకాశంగా మలచుకుంది.

**– పెరుగుతున్న ఆర్థిక బంధం...** గత ఏడేళ్లలో భారత్ నుంచి రష్యాకు ఎగుమతులు ఏడు రెట్లు పెరగడం ఇరుదేశాల ఆర్థిక బంధానికి బలమైన నిదర్శనం. అమెరికా సుంకాల వల్ల భారత టెక్స్‌టైల్స్, లెదర్, సముద్ర ఉత్పత్తులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉన్నప్పటికీ, రష్యా ఈ ఎగుమతులకు ప్రత్యామ్నాయ మార్కెట్‌గా నిలబడుతోంది. ఈ పరిణామం భారత్ తన ఆర్థిక వృద్ధికి అమెరికాపై మాత్రమే ఆధారపడాల్సిన అవసరం లేదని, రష్యా వంటి విశ్వసనీయ భాగస్వామి ఉన్నారని సూచిస్తుంది. ఇంధన రంగంలో కూడా భారత్-రష్యా సహకారం గణనీయంగా పెరుగుతోంది. రష్యా నుండి చమురు దిగుమతులు పెరగడం భారత ఇంధన భద్రతకు దోహదపడుతుంది. పాశ్చాత్య దేశాల 'నియో-కలోనియల్ విధానాలు'కు వ్యతిరేకంగా భారత్-రష్యా సంబంధాలు నిజమైన వ్యూహాత్మక భాగస్వామ్యమని రోమన్ బబుష్కిన్ వ్యాఖ్యానించారు. ఈ భాగస్వామ్యం కేవలం వాణిజ్యం, ఇంధన రంగాలకే పరిమితం కాకుండా రక్షణ, సాంకేతిక రంగాల్లో కూడా బలంగా కొనసాగుతోంది.

**– రాజకీయ సమన్వయం: అంతర్జాతీయ వేదికపై నూతన శక్తి...** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య జరిగిన ఫోన్ సంభాషణ ఇరుదేశాల మధ్య ఉన్న సన్నిహిత రాజకీయ బంధాన్ని సూచిస్తుంది. పాశ్చాత్య దేశాల ఒత్తిడి ఎంత పెరిగినా భారత్-రష్యా సంబంధాలు అచంచలంగా కొనసాగుతాయని రష్యా నమ్మకం వ్యక్తం చేసింది. ఈ పరస్పర నమ్మకం, గౌరవం ఈ సంబంధాలను మరింత బలోపేతం చేస్తుంది. ఈ పరిణామాలు అంతర్జాతీయ వేదికపై భారత్-రష్యా ఒక బలమైన కూటమిగా ఎదిగేందుకు మార్గం సుగమం చేస్తున్నాయి. భవిష్యత్తులో ఈ రెండు దేశాల ఆర్థిక, రాజకీయ సహకారం కొత్త దిశలో సాగుతూ అంతర్జాతీయ స్థాయిలో వాటి ప్రభావం మరింత పెరుగుతుందని స్పష్టంగా తెలుస్తుంది. అమెరికా సుంకాల నిర్ణయం భారత్-అమెరికా సంబంధాలపై ఒత్తిడి పెట్టినా అది రష్యా-భారత్ బంధాన్ని మరింత బలోపేతం చేసి, నూతన శక్తికి దారితీసిందని చెప్పవచ్చు.

# ఆంధ్రులకు గర్వకారణం..'ఆంధ్రకేసరి' ప్రకాశం - ఆగస్టు 23... టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి



టంగుటూరి ప్రకాశం పంతులు సుప్రసిద్ధ స్వాతంత్ర్య సమర యోధులు, ఆంధ్ర రాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రి. నిరుపేద కుటుంబంలో పుట్టి, వారాలు చేసుకుంటూ చదువుకుని, ఆంధ్ర రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి అయిన కృషీవలుడు. 1940, 50లలోని ఆంధ్ర రాజకీయాల్లో ప్రముఖంగా వెలుగొందిన వ్యక్తుల్లో ప్రకాశం ఒకరు. మద్రాసులో సైమన్ కమిషన్ వ్యతిరేక ప్రదర్శనలో తుపాకికెదురుగా గుండెనుంచి ఆంధ్రకేసరి అని పేరు పొందినవారు. ప్రత్యేకాంధ్ర రాష్ట్ర సాధనలో నిర్ణాయక పాత్ర పోషించారు. టంగుటూరి ప్రకాశం 1872 ఆగష్టు 23 న ఇప్పటి ప్రకాశం జిల్లా వినోద రాయుని పాలెము గ్రామంలో నియోగి బ్రాహ్మణులైన సుబ్బమ్మ, గోపాల కృష్ణయ్య దంపతులకు జన్మించారు. పదకొండో యేట తండ్రి మరణించడంతో, పిల్లలను తీసుకుని తల్లి ఒంగోలు చేరింది. ఒంగోలులో ఆమె భోజనశాల నడప వలసి వచ్చింది. ఆ రోజుల్లో ఇలాంటి వృత్తి చేసే వారిని సమాజంలో చాలా తేలికగా చూసేవారు. పూటకూళ్ళ వ్యాపారం చేసే తల్లి సంపాదన చాలక, ప్రకాశం ధనికుల ఇళ్ళల్లో వారాలకు కుదిరారు. పిన్న వయసులోనే ప్రకాశం నాటకాలు వేసేవారు. వల్లూరులో ప్రకాశం ప్రాథమిక విద్య సాగింది. అల్లరి చిల్లరి సావాసాల వల్లా, నాటకాల వ్యాపకం వల్లా, ప్రకాశానికి మెట్రిక్ పాస్ అవడం కష్టమయ్యింది. మిషను పాఠశాల ఉపాధ్యాయుడైన ఇమ్మానేని హనుమంతరావు నాయుడు చలవతో ప్రకాశం ఫీజు లేకుండా ప్రీ మెట్రిక్ లో చదివారు. నాయుడు రాజమండ్రికి నివాసం మారుస్తూ, ప్రకాశాన్ని తనతో తీసుకువెళ్ళి, అక్కడ ఎఫ్.ఏ.లో చేర్పించారు. తరువాత మద్రాసుకు పంపించి, న్యాయశాస్త్రం చదివించారు. ప్రకాశం 1890లో తన అక్క కూతురైన హనుమాయమ్మను పెళ్ళి చేసుకున్నారు. ఆ తరువాత కొద్దికాలం పాటు ఒంగోలులో న్యాయవాద వృత్తి చేసి, 1894లో మళ్ళీ రాజమండ్రి చేరారు. వృత్తిలో పేరూ, పుష్కలంగా సంపద సంపాదించారు. తన 35వ ఏట రాజమండ్రి పురపాలక సంఘానికి అధ్యక్షుడయ్యారు. అప్పట్లో ప్రకాశం సెకండ్ గ్రేడ్ ప్లీడరు. కనుక పై స్థాయి కోర్టులలో వాదించడానికి అర్హత లేదు. బారిస్టరులకు మాత్రమే ఆ అర్హత ఉండేది. ఒకసారి ప్రకాశం ప్రతిభ గమనించిన ఒక బారిస్టరు ప్రకాశాన్ని కూడా బారిస్టరు అవమని ప్రోత్సహించారు. ఆ సలహా నచ్చి, ప్రకాశం 1904లో సాంప్రదాయాలను పక్కనపెట్టి, ఇంగ్లాండు వెళ్ళారు. వెళ్ళే ముందు మహాత్మా గాంధీ లాగానే మద్యం, మాంసం, పొగాకు ముట్టనని తల్లికి మాట ఇచ్చి ఒప్పించారు. దీక్షగా చదివి బారిస్టరు అయ్యారు. ప్రకాశం మద్రాసు హైకోర్టులో ప్రాక్టీసు ప్రారంభించారు. అప్పట్లో మద్రాసులో ప్రసిద్ధి చెందిన బారిష్టరులందరూ ఆంగ్లేయులు లేదా తమిళులు. పేరుపొందిన తెలుగు బారిష్టరులలో ఈయనే ప్రప్రథముడు. ప్రకాశం జాతీయోద్యమం పట్ల ఆకర్షితులయ్యారు. అప్పటికి ఇంకా భారత రాజకీయ రంగంలో గాంధీజీ ప్రవేశించనే లేదు. ప్రకాశం సత్యాగ్రహోద్యమంలో ముమ్మరంగా పాల్గొన్నారు. పలుమార్లు జైలుకు వెళ్లారు. గాంధీజీని సైతం లెక్క చేయని ఆంధ్ర నాయకులలో మొదటి వారు ప్రకాశం. 1908లో ప్రముఖ జాతీయ నాయకుడు బిపిన్ చంద్రపాల్ మద్రాసుకు వచ్చారు. ఆయన సభకు అధ్యక్షత వహించుటకు ప్రముఖులు భయ పడ్డారు. పిడుగులు కురిసినట్లు, వడగండ్ల వానలా చేసిన, బిపిన్ పాల్ గంభీరోపన్యాసం మద్రాసు ప్రజల్లో నూతన చైతన్యం కల్గించింది. ఆనాటి నుండి ప్రకాశం తన జీవితాన్ని దేశసేవకు అంకితం చేశారు. జాతీయ భావాలను ప్రచారం చేయటానికి మద్రాసులో 'స్వరాజ్య' పత్రికను 1921 అక్టోబర్ 29న దినపత్రికగా ప్రారంభించారు. ఖాసా సుబ్బారావు, కోటంరాజు పున్నయ్య, జి.వి. కృపానిధి మున్నగు గొప్ప పాత్రికేయులు 'స్వరాజ్య' లో పని చేశారు."స్వరాజ్య" పన్నెండేళ్ళు నడిచింది. లక్షల్లో అప్పులు చేశారు ప్రకాశం. తన బంగళాలను అమ్మి అప్పులు తీర్చారు. ప్రభుత్వాన్ని నిశితంగా విమర్శించే వారాయన. "గాలితో నైనా పోట్లాడే స్వభావం కలవాడు ప్రకాశం"అన్నారు అయ్యదేవర కాళేశ్వరరావు. 1929లో సైమన్ కమీషన్ మద్రాసుకు వచ్చింది. మద్రాసులో అతనిని బహిష్కరించటం వద్దన్నారు గాంధీజీ. గాంధీగారి ఆదేశం ప్రకాశంగారికి నచ్చలేదు. రాజాజీ తప్పుకున్నారు. ప్రకాశం పంతులు, దుర్గాబాయ్, రంగయ్య నాయుడు, వేలాది ప్రజలతో వూరేగింపు వెళ్తూ 'సైమన్ గోబ్యాక్' అని గర్జించారు. బ్రిటీష్ తొత్తులైన సైనికులు తుపాకులతో కాలుస్తాం అని కేకలు వేశారు. ఒక అజ్ఞాత దేశభక్తుడు తుపాకి గుళ్లకు బలి అయ్యాడన్న వార్త దావానలంలా వ్యాపించింది. ప్రకాశం సింహంలా ముందు కురికారు. చొక్కా గుండీలు విప్పి"రండిరా యిదె కాల్చు కొండిరా"అని గుండె చూపిన వేళ...తుపాకులు తలలు వంచాయి. అంతటితో ప్రకాశం పేరు దేశమంతటా మార్మోగింది. 1937లో కాంగ్రెసు అధికారం లోకి వచ్చినపుడు, రాజాజీ మంత్రి వర్గంలో ఆయన రెవిన్యూ మంత్రిగా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. 1945లో జైలు నుండి విడుదలైన తర్వాత రాష్ట్రమంతటా పర్యటించారు. 1946లో మద్రాసు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఎన్నికై, 13 నెలలపాటు ఆ పదవిలో కొనసాగారు. ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారు. స్వంత పార్టీలోని అంతర్గత రాజకీయాలకు ఆయన ప్రభుత్వం బలయ్యాక, పార్టీ నుండి బయటకు వచ్చి, స్వంతంగా ప్రజాపార్టీని స్థాపించారు. సామాన్య ప్రజల సంక్షేమార్థమై ప్రకాశం, తన వ్యక్తిగత భద్రతను, జవహర్ లాల్ నెహ్రూ చేసిన హెచ్చరికలనూ, లెక్కచేయకుండా 1948లో నిజాం పాలనలో ఉన్న హైదరాబాదు రాష్ట్రాన్ని సందర్శించారు. నిజాం సహాయ సహకారాలతో సామాన్య ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న రజాకార్ల నాయకుడు ఖాసిం రిజ్వీని కలిసి, రిజ్వీ తన అదృష్టాన్ని చాలా దూరం లాగుతున్నాడని హెచ్చరిక చేశారు. ప్రకాశం ధైర్యానికి మెచ్చుకోలుగా రజాకార్లు ఆయనకు గౌరవ వందనం సమర్పించారు. 1953 అక్టోబర్ 1 న ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినప్పుడు దానికి తొలి ముఖ్యమంత్రిగా ప్రకాశం నియమితులు అయినారు. రాష్ట్రావతరణ మొదటి వార్షికోత్సవ సమయంలో 2000 మంది ఖైదీలకు క్షమాభిక్ష, తిరుపతిలో శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయం స్థాపన, సేద్యపు నీటి ప్రాజెక్టుల నిర్మాణం, విజయవాడ వద్ద కృష్ణా నదిపై బారేజి నిర్మాణం వీటిలో ప్రముఖమైనవి. ప్రకాశం లక్షలార్జించినా, చివరికి ఏమీ దాచుకోలేదు. చరమ దశలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకాశంకు నెలకు రు.750/- గౌరవభృతి సొంత వాడకానికి ఒక కారు ఇచ్చింది. దానిలో పెట్రోల్ పోయించు కోలేని దయనీయ స్థితి ఆయనది. ఆంధ్రజాతికి తిరుగులేని నాయకుడుగా వెలిగిన ప్రకాశం తెలుగు ప్రజల హృదయాలలో సుస్థిర స్థానాన్ని పొంది, 1957 మే నెల 20వ తేదీన దివంగతు లయ్యారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**


# నిజాం వ్యతిరేక పోరాట యోధుడు కందిబండ రంగారావు - ఆగస్టు 23...కందిబండ రంగారావు వర్ధంతి



కందిబండ రంగారావు

కందిబండ రంగారావు నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తీవ్ర పోరాటం చేసిన కరుడుగట్టిన స్వాతంత్ర్య సమర యోధుడు. ఖమ్మం జిల్లా లోని వైరా మండలం, సిరిపురం (కనకగిరి) గ్రామంలో 1907, సెప్టెంబర్ 26న రంగారావు జన్మించారు. చేయని హత్యకు మరణ శిక్ష విధించబడి, మృత్యువు అంచుల్లోకి వెళ్లి చివరి క్షణంలో, అదృష్ట వశాత్తూ, తల రాత మార్చబడి, తిరిగి స్వేచ్ఛా వాయువులు పీల్చిన అరుదైన స్వాతంత్ర్య సమర యోధుడు కందిబండ రంగారావు. నిజాం పాలనలో ఒక ముస్లిం హత్య కేసులో ఇరుక్కున్న ఆయనకు ఉరిశిక్ష పడే ప్రమాదం నుంచి మరొక ముస్లిం అది కూడా ఒక యువతి, హతుని భార్య మానవత్వంతో సాక్ష్యం చెప్పి, ప్రాణ భిక్ష పెట్టిన అరుదైన సంఘటన ప్రత్యేకంగా చెప్పుకోదగ్గ విశేషం. రంగారావు 1927లో నిజాం కళాశాల నుండి బి.ఏ. డిగ్రీ పూర్తిచేశారు. అలా రంగారావు ఖమ్మం జిల్లాలో ప్రప్రథమ పట్ట భద్రుడుగా గుర్తింపు పొందారు. ప్రజాసేవ చేయాలని భావించి, అందుకు అనువైనదిగా ఎంచి సిరిపురం గ్రామంలోనే స్థిరపడ్డారు. వంశపారం పర్యంగా వస్తున్న గ్రామాధికారి వృత్తిలో, గ్రామ కరణంగా అధికారిక విధులను నిర్వర్తిస్తూండే వారు. గ్రామ సర్పంచ్‌గా వైరా పంచాయతీ సమితి ఉపాధ్యక్షులుగా, తెలంగాణ గ్రామాధికారుల సంఘం అధ్యక్షులుగా ఆయన పనిచేసారు. 1969లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో రంగారావు మాత్రమే కాదు. ఆయనతో పాటు కుటుంబ సభ్యులంతా పాల్గొని పోలీసుల లాఠీ దెబ్బలు తినటమే కాకుండా జైలు శిక్షలను కూడా అనుభవించారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా రంగారావు తీవ్ర పోరాటం చేసారు. ఆ సమయంలో ఉప్పల మడక గ్రామానికి చెందిన ఇబ్రహిం అనే ముస్లిం వ్యక్తిని హత్య చేసారనే ఆరోపణ చోటు చేసుకుంది. అందుకు ఆయన అరెస్టయ్యారు. నేరం చేశారని ఆఖరుకు రంగారావును ఉరికూడా తీస్తారని వార్త దావానంలా వ్యాపించింది. ఆ వార్తను నమ్మిన ఆయన కుటుంబ సభ్యులు చేసేది లేక, ఉరి శిక్ష ఖాయమని నమ్మి, అంత్య క్రియలకు కూడా సిద్ధపడ్డారు. ఆయన పార్థివ శరీరాన్ని తీసుకొద్దామని వరంగల్ సెంట్రల్ జైలుకు వెళ్లినప్పుడు ఆయనను ఉరి తీయ లేదని, ఆయన బ్రతికే ఉన్నారని తెలిసింది. ఉరి తీయడానికి తీసుకెళ్లే ముందు నిజాం ప్రభుత్వంలో హెూంశాఖ కార్య దర్శిగా పనిచేస్తున్న ఆయన క్లాస్‌మేట్ డా.అహ్మద్ తన మిత్రుడిని ఉరి తీయ కుండా అడ్డుకున్నట్టు తెలుసు కుని సంతోషించారు. హత్య కేసులో, విచారణలో హతుని భార్య తన భర్తను రంగారావు హత్య చేయ లేదని సాక్ష్యం ఇవ్వడంతో బతికి బయట పడ్డారు. ఆరునెలల తర్వాత వరంగల్ సెంట్రల్ జైలు నుండి రంగారావు విడుదల అయినారు. రంగారావు తన స్వగ్రామమైన సిరిపురంలో 1987, ఆగష్టు 23వ తేదీన మరణించారు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# తొలి తెలుగు క్రైస్తవ కవి పురుషోత్తమ చౌదరి - ఆగస్టు 23...పురుషోత్తమ చౌదరి వర్ధంతి



ఆంధ్రక్రైస్తవ సంకీర్తనా పితా మహులు, తెలుగు క్రైస్తవ సంఘ పితామహుడు అని పిలువబడే కవిశేఖరుడు చౌదరి పురుషోత్తం పేరు వినని, ఆయన పాట గానం చేయని తెలుగు క్రైస్తవులు ఉండరంటే అతిశయోక్తి కాదేమో. ప్రముఖ వాగ్గేకారుల, ముఖ్యంగా త్యాగ రాయ కృతులతో గేయకవిత శిఖరాయమాన ప్రాభవాన్ని సంతరించుకొన్న 19వ శతాబ్దిలో, హిందూ దేవుళ్ళనే కీర్తించేందుకు కృతులుగాని, కీర్తనలు గాని కోకొల్లలుగా జన బాహుళ్యానికి అందుబాటులోకి వచ్చిన తరుణంలో 19వ శతాబ్ది పూర్వార్ధం లోనే మొట్ట మొదటి సారిగా అన్య మతానికి చెందిన దేవుని కీర్తించేందుకు కీర్తనలను రచించిన కవి పురుషోత్తమ చౌదరి. 19వ శతాబ్దిలో క్రైస్తవ మతాన్ని స్వీకరించి, మనసా, వాచా, కర్మణా, క్రైస్తవ మత ప్రచారార్థం రచనలు చేసిన తొలి తెలుగు క్రైస్తవ కవి పురుషో త్తమ చౌదరి. అనేక క్రైస్తవ పద్య కృతులను, కీర్తనలను రచించి ఆంధ్ర క్రైస్తవ సార్వభౌముడు'గా ఖ్యాతి నొందారు. పురుషోత్తం చౌదరి (సెప్టెంబరు 5, 1803 – ఆగష్టు 23, 1890) తెలుగు క్రైస్తవ పదకవితా పితామహుడు. తొలి తెలుగు క్రైస్తవ వాగ్గేయకారులు. సి.పి. బ్రౌన్, త్యాగరాజుకు సమకాలి కులు. తాను రాసిన కీర్తనలను స్వయంగా గానం చేస్తూ ప్రజా బాహుళ్యానికి అందించారు. శ్రీకాకుళం జిల్లా తెంబూరు (పాతపట్నం) శివారు మదనా పురం (తెంబూరు (పాతపట్నం) లో 1803, సెప్టెంబరు 5 న బెంగాలీ బ్రాహ్మణ కుటుంబానికి చెందిన సుభద్రాదేవి, కూర్మా నాథ చౌదరి దంపతులకు జన్మించారు. తల్లి వీరి పూర్వీకులు పశ్చిమ బెంగాలు నుండి ఒరిస్సా ప్రాంతానికి వచ్చి స్థిరపడిన బెంగాల్ బ్రాహ్మణులు. తమ మతాచారాల ప్రకారం పురుషోత్తమ చౌదరికి ఏడు సంవత్సరాలప్పుడే ఉపనయన సంస్కారం జరిపి, గాయత్రీ మంత్రాన్ని ఉపదేశించారు. పురుషోత్తం చౌదరి బాల్యం నుండే మతనిష్ఠ కలిగి ఉండేవారు. నిరంతర విగ్రహారాధన, తీర్థ యాత్రలతో పాటు భుజాలపై వైష్ణవ మత సూచకాలైన శంఖు చక్రాల్ని కూడ కాల్పించు కొన్నారు. 1823 లో తన మేనమామ కుమార్తె యైన రాధామణి దేవిని వివాహం చేసికొన్నారు. సంస్కృతం, ఒరియా, తెలుగు భాషల్లో ప్రావీణ్యతను సంపాదించి, 20 సంవత్సరాలకే కవిత్వం రాయడం ఆరంభిం చారు. క్రైస్తవ్యాన్ని స్వీకరించక మునుపు చాలా హిందూ మత సంబంధిత భక్తి రచనల్ని చేశారు. ఆయన తన అన్న గారి పాఠశాలలో పనిచేస్తుండే వారు. అప్పుడే క్రైస్తవ్యం పట్ల ఆసక్తి కలిగి, దాని గురించి తెలుసుకోవాలనే తపనతో అన్వేషిం చడం మొదలు పెట్టారు. అదే సమయంలో ఆధునిక ప్రేషిత పితామహుడు ( %ఖీష్ప్రవతీ శీట ఎశీసవతీఅ ఎఱంంఱశీఅం% ) గా పేరుగాంచిన విలియమ్ కేరీ తెలుగులో వ్రాసిన కరపత్రం ( %ఱఖ్రుష్% ) ఒకటి పురుషోత్తంకు చేతికి అందింది. అది చదివిన పురుషోత్తంకు క్రీస్తు గురించి మరి యెక్కువగా తెలుసుకోవాలని పించింది. దైవ సంకల్పం ప్రకారం మిషనరీ హెలెన్ నాట్, విలియమ్ డాసన్ మొదలైన క్రైస్తవ ప్రముఖులతో పరిచయం కలిగటం, అప్పటికే రెవ. ప్రిచెట్ (1818) తెలుగు లో అనువదించిన నూతన నిబంధన తన చేతికందటంతో ఆయన ఆశ నెరవేరింది. పురుషోత్తం చౌదరి దాన్ని బాగా చదివారు. 1829 లో విశాఖ పట్నంలో క్రైస్తవ సాహిత్యాన్ని అధ్యయనం చేశారు. 1833 అక్టోబరు 6 వ తేదీన క్రీస్తుని అనుసరించాలని నిర్ణయించు కొన్నారు. 1833లో 'కులాచార పరీక్ష' అనే పత్రికను రాసి, కుల వ్యవస్థను ఖండించారు. 1833 అక్టోబరులో కటక్‌లో 'బాప్తిస్మం' తీసుకొని, క్రైస్తవ మత ప్రచారం ప్రారంభించారు. 18 రోజులు కాలినడకన పాటలు పాడు కుంటూ ప్రచారం చేస్తూ మద్రాసు వెళ్లారు. 1833 అక్టోబరు 6 వ తేదీన అదే రోజు తన తోటి క్రైస్తవులతో కలిసి ఆరాధిస్తూ..."మా యేసుక్రీస్తుని %-% మరుగు గల్గెనురా, నా యాత్మ ఘన రక్ష %-% నగము నెక్కెనురా"...అనే కీర్తనను పాడారు. అది తెలుగులో వెలువడిన మొట్టమొదటి క్రైస్తవ గీతం. పురుషోత్తం క్రైస్తవుడవ్వడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల నుండి ఎంతో వ్యతిరేక తను, మరెన్నో అవరోధాలను ఎదుర్కోవలసి వచ్చింది. కాని ఈ శోధనలన్నీ తనలో నిరాశను కలిగించడానికి బదులుగా తాను పొందిన రక్షణాను భవాన్ని ఇతరులకు ప్రకటించాలనే తృష్ణను పెంచాయి. 1836 ఏప్రిల్ 3 వ తేదీన ఆయన భార్య రాధామణి దేవి కూడా క్రైస్తవ్యాన్ని స్వీకరించారు. ఆ సంవత్సరమే చౌదరిని మిషనరీగా అభిషేకించారు. అనేక శ్రమలకు, తిరస్కారాలకు గురైనప్పటికీ, విశ్వాసంలో వెనుకడుగు వేయక, వేలకొలది మైళ్ళు కాలినడకను ప్రయాణిం చి, ఆంధ్ర దేశంలో అధికభాగం పర్యటిస్తూ విస్తృత సేవ చేసి, తెలుగు క్రైస్తవ సంఘ పితా మహుడయ్యారు. చౌదరి విరచిత ఆణిముత్యాల లాంటి పాటలన్నీ కేవలం భక్తిపూరిత మైనవే కాకుండా, సాహితీ సంపదతో తుల తూగు తుంటాయి. కేవలం కీర్తనల్ని మాత్రమే గాక " క్రైస్తవ నీతి ప్రకాశం, సత్య వేద సార సంగ్రహం, "కులాచార పరీక్ష" ఇత్యాది ఎన్నో గ్రంథాల్ని కూడా రచించారు. ఆయన రచనల్లో ఎక్కువగా విగ్రహారా ధనని ఖండించారు. ఆయన వ్రాసిన ప్రతి పాట స్వీయ జీవితానుభవ లోతుల్లో నుండి పెల్లుబికినదే. అందుకే అవి ఈ నాటికీ తెలుగు క్రైస్తవ సాహిత్యంలో సజీవ సంకీర్తన లుగా నిలిచి పోయాయి. 1882 లో కనుచూపు పూర్తిగా మందగించిన సమయంలో తన కుమార్తెను పిలిపించుకొని, "సకలేంద్రియములారా %-% చాలు మీ పనిదీరె" అనే పాటను పాడి, ఆమెచే వ్రాయించారు. చివరకు 1890, ఆగష్టు 23 న తన 87 వ యేట ప్రభువుని చేరుకొన్నారు. చౌదరి కవి ఎన్నో కీర్తనలు రచించారు. పద్య కావ్యాల రచనలలో పద్య కృతులు ఐదు లభిస్తున్నాయి. వాటిలో రెండు శతకాలు – ఒకటి 'యేసు నాయక శతకము'బీ రెండవది 'యేసు క్రీస్తు ప్రభు శతకము'. ఇక, 'పంచ చామర పన్నములు' పంచ చామర ఛందస్సులో మకుట సహితంగా యెహెూవాను దలతున్" అన్న కీర్తనను పొందు పరిచాడు కవి. సాగిన అర్థశతి. 'పంచ రత్నములు' ఐదు సీస పద్యాల సంకలనం. క్రైస్తవ నీతి ప్రకాశము, 'సత్యవేద సార సంగ్రహము' అనేవి పద్య కావ్యాలు, వీటిలో క్రీ.శ. 1845లో వెలువడిన 'యేసు నాయక శతకము' తెలుగు శతక వాఙ్మయంలో మొట్ట మొదటి క్రైస్తవ శతకం. ప్రస్తుతం చౌదరి రాసిన కీర్తన వినిపించని చర్చి, క్రైస్తవుల ఇళ్లు లేవు. 1933లో చౌదరి శతజయంతి ఉత్సవాలు ఆంధ్రా – ఒరిస్సాలో ఘనంగా నిర్వహించారు. పురుషోత్తమ చౌదరి స్వహస్తాలతో శ్రీకాకుళం చిన్న బజారులోని తెలుగు బాప్టిస్టు చర్చిని దాదాపు 150 ఏళ్ల క్రితం నిర్మించారు. ఆయన భార్య శ్రీకాకుళంలోనే మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

చురకలు



# కొరవడిన వైవిధ్యం.. కొన్నింటికే ప్రాధాన్యం

జగిత్యాల : గతంలో ప్రతి రైతు తమ ఇంటి అవసరాలకు కావాల్సిన బియ్యంతోపాటు పప్పు దినుసులు, ఉల్లి, వెల్లుల్లి, పసుపు, అల్లం, కూరగాయలను తమ తోటలోనే పండించుకునేవారు. ఇంటి అవసరాలకు పండించేవాటికి ప్రత్యేకంగా కొంతభూమిని కేటాయించుకునేవారు. ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మారింది. ఎక్కువమంది రైతులు ఆయా పంటలను పండించడంలేదు. కొనుగోలు చేయడానికే ఆసక్తి చూపుతున్నారు.

**ఇవీ కారణాలు** రాష్ట్ర ప్రభుత్వం వరి ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తుండటం ఆరుతడి పంటలకు వన్యప్రాణుల బెడద, మార్కెట్‌లో తక్కువ ధర పలకడం, మేలైన వంగడాలు అందుబాటులోకి రాకపోవడం, చీడపీడల తీవ్రత, కూలీల కొరత సాగునీటి లభ్యత పెరగడం వరి సాగు మొగ్గుకు మరో కారణం. సన్నాలకు ప్రభుత్వం క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ అందిస్తుండటం ప్రోత్సాహంగా మారింది.

**ప్రోత్సహిస్తేనే ఇతర పంటలవైపు..**



గతంలో ఇచ్చినట్లుగా మక్క, వేరుసెనగ, నువ్వులు, పెసర, మినుము, కూరగాయల విత్తనాలను 50 శాతం రాయితీపై అందించడం
కూలీల కొరత నేపథ్యంలో వ్యవసాయ పనులను ఉపాధిహామీ పథకానికి అనుసంధానించడం ఆరుతడి సాగుకు ఉపకరించే యంత్రాలు, పరికరాలు, పనిముట్లను రాయితీపై అందజేయడం. ఉత్పత్తులను కనీస మద్దతు ధరకు మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయడం
అన్ని పంటలకు బిందుసేద్య పరికరాలు, కూరగాయల సాగుకు పాలీహౌజులు, షెడ్‌నెట్లు తదితరాల రాయితీని పునరుద్ధరించడం
పంట పరిహారం అందేలా కమతం వారీగా బీమా అమలు చేయడం
ఆయిల్‌పామ్ సాగు రైతులకు రుణ మంజూరు, జిల్లాలో క్రషింగ్ యూనిట్ను అందుబాటులోకి తేవడం .

# అంచనాకు మించి వరి సాగు

ఎల్లారెడ్డిపేట : మెట్ట ప్రాంతమైన రాజన్న సిరిసిల్ల జిల్లాలో గొట్టపు బావులు, బావులు (ఓపెన్ వెల్స్) వ్యవసాయానికి ప్రధాన జీవనాధారం. జూన్ 1 నుంచి ఆగస్టు 18 వరకు 470.0 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. ఈ సీజన్ మొదట్లో వర్షాభావ పరిస్థితులతో పంటల సాగు మందకొడిగా ప్రారంభమైనప్పటికీ ఇటీవల కురిసిన భారీ వర్షాలతో ఊపందుకుంది. ఇప్పటి వరకు వివిధ రకాల పంటల సాగు విస్తీర్ణం 2,36,305 ఎకరాలకు చేరుకుంది. ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో వరి అంచనాకు మించి సాగు కాగా.. మొత్తంగా 90 శాతానికిపైగా పంటల సాగు పూర్తయినట్లు వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.

**కొనసాగుతున్న నాట్లు**

జిల్లాలో ఈ ఏడాది అధికంగా వర్షాలు కురవకపోవడం, సాగునీరు సమృద్ధిగా లభించకపోవడం వంటి కారణాల వల్ల ఆయా మండలాల్లో వరి నాట్లు వేసే ప్రక్రియ ఇంకా కొనసాగుతూనే ఉంది. రుద్రంగి మండలంలో లోటు వర్షపాతం నమోదవగా ముస్తాబాద్, ఇల్లంతకుంట



మండలాల్లో మాత్రమే అధికంగా వర్షాలు పడ్డాయి. మిగతా 10 మండలాల్లో సాధారణానికి మించలేదు. ముదిరిన నారును వినియోగిస్తే దిగుబడి తగ్గిపోయే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో డ్రమ్‌సీడర్, నేరుగా వెదజల్లే పద్ధతులు పాటిస్తే మేలు చేకూరనుంది. డ్రమ్ సీడర్‌తో నేరుగా వరి విత్తడం ప్రత్యేకత. కూలీల కొరతను అధిగమించేందుకు ఈ పరికరం ఎంతగానో ఉపయోగపడుతుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. పెట్టుబడి వ్యయం తగ్గుతుందని.. ఏ వరి రకమైనా 7 నుంచి 10 రోజులు ముందుగానే కోతకు వస్తోందని పేర్కొంటున్నారు. విత్తనాలను వెదజల్లే పద్ధతిలో కూడా ఖర్చులు ఆదా అవుతాయి. విత్తనాలను వెదజల్లిన కొద్దిరోజులపాటు ఖచ్చితమైన నీటి యాజమాన్య చర్యలు తీసుకుంటే సరిపోతుంది. నాట్లు ఆలస్యంగా వేసే రైతులు 100 నుంచి 120 రోజుల పంటకాలం ఉండే విత్తనాలను డ్రమ్‌సీడర్‌తోనూ, నేరుగా వెదజల్లితే మంచి దిగుబడులను పొందొచ్చని ఎల్లారెడ్డిపేట మండల వ్యవసాయాధికారి రాజశేఖర్ పేర్కొన్నారు. మరోవైపు నాట్లు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ ఏడాది వరిసాగు విస్తీర్ణం మరింత పెరగనుంది.

# వర్షాలకు 'తారు'మారు!

ఖమ్మం : చింతకాని మండలం రామకృష్ణాపురం అడ్డరోడ్డు వద్ద ఓ మోరీ సమీపంలో ఖమ్మం- బోనకల్లు ప్రధాన రహదారిపై గొయ్యి ఏర్పడింది. ఇటీవల కురిసిన వర్షాలకు రెండు రోజుల పాటు మోరీ పైనుంచి రెండడుగుల మేర వరద నీరు ప్రవహించింది. ఈ మార్గంలో నిత్యం వందలాది కార్లు, బస్సులు, లారీలు, ద్విచక్రవాహనాలు తిరుగుతుంటాయి. మలుపు ఉండటంతో వాహనదారులకు రాత్రిపూట గొయ్యి కనిపించటం లేదు. రెండు రోజుల్లో గొయ్యిని పూడ్చి రహదారికి మరమ్మతులు చేపడతామని ఆర్అండ్‌బీ ఏఈ లక్ష్మీనారాయణ తెలిపారు.

ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు రహదారులు దెబ్బతిన్నాయి. వరద ప్రవాహంతో తారులేచిపోయి.. కంకర తేలి గుంతలు ఏర్పడ్డాయి. పల్లె రహదారులు చిత్తడిగా మారాయి. పంచాయతీ రహదారుల కంటే ఆర్అండ్‌బీ రోడ్లు తీవ్రంగా దెబ్బతినటంతో అధికారులు తాత్కాలిక, శాశ్వత మరమ్మతుల నిమిత్తం పభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. **కంకర తేలి.. గుంతలు ఏర్పడి** ఖమ్మం జిల్లా బోనకల్లు, మధిర, కూసుమంచి, భద్రాద్రి జిల్లా గుండాల, చర్ల, భద్రాచలం తదితర మండలాల్లో వర్షాలు దంచికొట్టాయి. పురపాలికలు, నగరపాలికల్లో వరద ప్రవాహానికి తోడు, మురుగు నిలిచినచోట గుంతలు ఏర్పడ్డాయి. ప్రధానంగా భద్రాద్రి జిల్లాలో ఆర్అండ్‌బీ శాఖ పరిధిలోని రోడ్లకు తీవ్రనష్టం వాటిల్లింది. ఆర్అండ్‌బీ రోడ్ల పొడవు 1,615 కి.మీ. ఉండగా.. 173.28 కి.మీ. మేర ఛిద్రమయ్యాయి. బయ్యారం–తాడ్వాయి, మొండికుంట–రామచంద్రాపురం, పెద్దనల్లబెల్లి–సీఆర్పీఎఫ్ బేస్‌క్యాంప్, మణుగూరు–నెల్లిపాక, చిన్నరావిగూడెం రహదారులు వర్షాలకు దెబ్బతిన్నాయి.

# మంజూరు సరే.. నిర్మాణం ఎప్పుడు?



పెద్దపల్లి : కన్నాల వద్ద ఆర్వోబీల నిర్మాణం చేయాలని పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ ఇటీవల దక్షిణ మధ్య రైల్వే జోన్ జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవకు వినతి పత్రం అందజేశారు. 2020–21లోనే కన్నాలతోపాటు పలు ఆర్వోబీల నిర్మాణానికి మంజూరు చేశామని కానీ తమ వాటా చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిరాకరించడంతో పనులు ముందుకు సాగడం లేదన్నారు. నూరుశాతం రైల్వే నిధులతో త్వరలో పనులు చేపట్టనున్నట్లు ఎంపీకి పంపించిన ప్రత్యుత్తరంలో రైల్వే జీఎం పేర్కొన్నారు.

నిత్యం రద్దీగా ఉండే కాజీపేట–బల్లార్షా సెక్షన్‌లో లెవల్‌క్రాసింగ్(రైల్వేగేటు) లేకుండా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆర్వోబీ లేదా ఆర్‌యూపీల నిర్మాణానికి రైల్వేమంత్రిత్వశాఖ గతంలో విధానపరమైన నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా జమ్మికుంట నుంచి పెద్దంపేట వరకు ఉన్న లెవల్ క్రాసింగ్‌లను విడతలవారీగా ఎత్తివేయ నున్నట్లు ప్రకటించారు. ఈ క్రమంలో ఓదెల, ఉప్పురపల్లి, హరిపురం, కొత్తపల్లిలలో అండర్‌పాస్‌ల నిర్మాణం పూర్తయ్యాయి. సైదాబాద్, పొత్కపల్లి, ఓదెల(స్టేషన్ వద్ద), కొలనూరు, పెద్దపల్లిలో మూడు(కూనా రం రోడ్డు, చీకురాయి రోడ్డు, గౌరెడ్డిపేటరోడ్డు), కన్నాల, కుందనపల్లి, పెద్దంపేటల వద్ద కూడా ఆర్వోబీలు మంజూరయ్యాయి. కానీ వీటిలో పెద్దపల్లిలోని కూనారం రోడ్డులో మాత్రమే ఆర్వోబీ నిర్మాణం జరుగుతుంది. ఇక్కడ కూడా ఏళ్లు గడిచినా.. పూర్తి స్థాయిలో భూసేకరణ జరగకపోవడంతో పనులు నిలిచిపోయాయి.

**ఎంపీ చొరవతో తెరపైకి..** 2020–21 ఆర్థిక సంవత్సరంలో ఉమ్మడి జిల్లాలో పలు ఆర్వోబీలు, ఆర్‌యూపీలు మంజూరయ్యాయి. వీటి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వ వాటా చెల్లించాల్సి ఉంటుంది. కానీ స్థానిక నాయకులు చొరవ తీసుకోకపోవడంతో దస్త్రాలు ముందుకు కదలడం లేదు. ఈ క్రమంలో పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ కన్నాల ఆర్వోబీ ఆవశ్యకతను రైల్వే అధికారులు దృష్టికి తీసుకువెళ్లడంతో రైల్వే పైవంతెనల మంజూరు అంశం తెరపైకి వచ్చింది. జిల్లాలో ప్రసిద్ధి చెందిన దేవునపల్లి లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు కూడా అందుగుపల్లి వద్ద రైల్వేగేటు అడ్డుగా ఉంది. ఇక్కడ ఆర్‌యూపీ నిర్మించాలని స్థానిక నాయకులు గతంలో ప్రతిపాదించగా ఆర్వోబీ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాలని రైల్వేశాఖ కోరింది. అయిదేళ్ల క్రితం రెండోసారి పంపించిన ప్రతిపాదనలు పత్రాలకే పరిమితమయ్యాయి. దీంతోపాటు మంజూరైన ప్రాజెక్టులకు కూడా మోక్షం లభించడం లేదు. ఎంపీ మరోసారి వీటిపై దృష్టిపెడితే ప్రక్రియ ముందుకు సాగుతుందని ప్రజలు కోరుతున్నారు.

# చేనేత.. పన్నువెత తీరేనా?



సిరిసిల్ల : ఉమ్మడి జిల్లాలో వేలాది కుటుంబాల చేనేత వస్త్రోత్పత్తులే జీవనాధారం. వీటి విక్రయాలపై అయిదు శాతం జీఎస్టీ విధించడం ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎనిమిదేళ్లుగా ఈ రంగంపై ప్రభావం చూపుతోంది. దీనిని ఎత్తివేయాలని ప్రభుత్వం, చేనేత సంఘాల నుంచి వినతులు వెళ్తూనే ఉన్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక చేనేత, జౌళిశాఖల, ఉమ్మడి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మరోసారి ప్రధాని మోదీ, కేంద్ర, చేనేత, జౌళిశాఖల మంత్రి గిరిరాజ్‌సింగ్‌లకు లేఖ రాశారు. కేంద్రం బుధవారం నిర్వహించే జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో తీసుకోబోయే నిర్ణయంపై అందరూ ఉత్కంఠతో ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో 31 చేనేత సహకార సంఘాలు ఉన్నాయి. వీటిలో 1524 మంది కార్మికులు పూర్తిగా కాటన్ వస్త్రోత్పత్తులు నేస్తున్నారు. ప్రభుత్వం టెస్కో నుంచి ఏటా పాఠశాలల ఏకరూప దుస్తులు, సంక్షేమ శాఖలకు సంబంధించిన ఆర్డర్లు పూర్తిస్థాయిలో చేనేత సహకార సంఘాలకే ఇస్తోంది. వీటితోపాటు కేస్మేట్, బెడ్‌షీట్లు, లుంగీలు, తువ్వాళ్లు వంటికి ఎక్కువగా నేస్తున్నారు. ప్రభుత్వ ఆర్డర్లు మినహా మిగతా ఉత్పత్తులను టెస్కో దుకాణాల ద్వారా విక్రయిస్తు న్నారు. ఉమ్మడి జిల్లాలో కరీంనగర్, వేములవాడ, జగిత్యాల, మెట్పల్లి, గోదావరిఖనిలో దుకాణాలు ఉన్నాయి. ఈ ఉత్పత్తులకు విస్తృతం చేసేందుకు చేనేత లక్ష్మి పథకాన్ని తీసుకొచ్చారు. వీటిలో వస్త్రాల కొనుగోలుపై 30 శాతం రాయితీ ఉంది. కాగా అయిదు శాతం జీఎస్టీ విధించడంతో కొనుగోలు దారులకు రాయితీ కన్నా జీఎస్టీయే ఎక్కువ ప్రభావం చూపుతోంది. ఇదే ప్రైవేటులో అయితే అన్నికలిపి ధర తక్కువ ఉండటంతో అటువైపే మొగ్గు చూపుతున్నారు. **ఏటా రూ.2.88 కోట్ల వ్యాపారం**

ఉమ్మడి జిల్లాలో టెస్కో ఔట్లెట్ల ద్వారా ఏటా రూ.2.88 కోట్ల వస్త్ర వ్యాపారం జరుగుతోంది. గతంలో ఇది రూ.3.5 కోట్ల మేరకు ఉండేది. దీనిలో వేములవాడ టెస్కో నుంచే రూ.1.3 కోట్ల వ్యాపారం జరుగుతోంది. రాష్ట్రంలో హైదరాబాద్‌లోని అబిడ్స్ తర్వాత వేములవాడ రెండోస్థానంలో నిలుస్తోంది. జీఎస్టీ అమల్లోకి వచ్చాక సగటున 20 శాతం విక్రయాలు తగ్గి వ్యాపారంపై ప్రభావం చూపుతున్నాయని వ్యాపారవర్గాలు చెబుతున్నాయి. చేనేత వస్త్ర విక్రయశాలను కొత్త జిల్లాల పరిధిలోనూ విస్తరించాలని ఇటీవల ప్రభుత్వం ఒక ప్రతిపాదన తీసుకొచ్చింది. ఇది అమలైతే కరీంనగర్ టెస్కో డివిజన్ పరిధిలోని పది విక్రయశాలలు ఏర్పాటుకు అవకాశం ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం స్పందించి జీఎస్టీని మినహాయింపు ప్రకటనపైనే చేనేత కుటుంబాలు ఆశగా చూస్తున్నాయి.

# నిధులున్నా.. పనులు చేయరా?



కరీంనగర్ : భూగర్భ మురుగు నీటి శుద్ధి కేంద్రం ఉన్నా పూర్తిస్థాయిలో వినియోగించుకునే పరిస్థితి లేదు. కొన్ని ఇళ్లకే కనెక్షన్లు ఇచ్చి వదిలేశారు. నగరవ్యాప్తంగా కొత్తగా స్మార్ట్‌సిటీ, సీఎంఏ నిధులతో రోడ్లు వేసే సమయంలో రోడ్డు నుంచి ఇళ్ల వరకు పైపులు వేశారు. తరువాత ఇన్‌స్పెక్షన్ ఛాంబర్ నిర్మించి ఇంటి నుంచి కనెక్షన్ ఇవ్వాలి. భూగర్భ మురుగు కాలువ పనులు (యూజీడీ) కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోనే ఉన్నాయి. 2008లో పాత 50 డివిజన్ల పరిధిలో పనులు ప్రారంభించి పూర్తి చేశారు. సుమారు 300 కిలోమీటర్ల పొడవున పైపులైన్లు, ట్రంక్‌లైన్లు, మ్యాన్‌హోల్, ఇన్‌స్పెక్షన్ ఛాంబర్లు నిర్మించారు. గోపాల్‌చెరువు దగ్గర 10 ఎకరాల స్థలంలో 38 ఎంఎల్‌డీల సామర్థ్యంతో మురుగు శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. నగరంలోని అయిదారు డివిజన్ల నుంచి 5 వేల కనెక్షన్ల ద్వారా రెండు ఎంఎల్‌డీల మురుగు తీసుకొని శుద్ధి చేస్తున్నారు. **అనుసంధానం చేస్తేనే..**

నగరంలోని మురుగునీటిని తరలించి శుద్ధి చేసేందుకు ఇంటింటికీ కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంది. మొత్తం 45 వేల కనెక్షన్లు ఇచ్చేలా ప్రణాళిక సిద్ధం చేయగా ఇప్పటివరకు 8,685 మాత్రమే ఇచ్చారు. స్మార్ట్‌సిటీలో 10 వేల కనెక్షన్లు ఇవ్వడానికి అవకాశముంది. అమృత్ 2.0 ప్రాజెక్టులో భాగంగా ఈ పనులకు రూ.77 కోట్లతో టెండర్లు పిలిచారు. ఇందులో రూ.55 కోట్లతో 24 వేలు ఇన్‌స్పెక్షన్ ఛాంబర్లు నిర్మించి అనుసంధానం చేసుకోవడానికి వీలుంది. వీటిలో ఇప్పటివరకు ఎలాంటి పనులు జరగడం లేదు. గడువు మరో ఏడాది మాత్రమే ఉంది. అప్పటిలోగా నిధులు వినియోగించుకోకపోతే వెనక్కి వెళ్లే అవకాశం ఉంది. **35 కిలోమీటర్ల ఛాంబర్లు** నగరవ్యాప్తంగా కొత్తగా 35 కిలోమీటర్ల మేర రహదారులు నిర్మించి ఇన్‌స్పెక్షన్ ఛాంబర్లు ఏర్పాటు చేశారు. వీటికి ఇంటింటా కనెక్షన్లు ఇస్తే మురుగునీరంతా నేరుగా ఎస్టీపీలోకి వెళ్తుంది. కొన్ని నెలల కిందట నగరంలోని కోతిరాంపూర్, కమాన్, సిరిసిల్ల రోడ్డు, మల్కాపూర్ రోడ్డు, ఆదర్శనగర్ నుంచి మంచిర్యాల చౌరస్తా మీదుగా ఇందిరానగర్ ట్రంకు లైను శుభ్రం చేశారు. వీటిలో నుంచి టాయిలెట్, మల వ్యర్థాలు, వసతి గృహాలు, అపార్ట్‌మెంట్లు, కలెక్టరేట్, సీపీ కార్యాలయాలు, బస్టాండ్, ఇతర కార్యాలయాల్లోంచి వచ్చే మురుగు పంపించవచ్చు. రోడ్డు పగలకొట్టకుండా పనులు చేసుకోవడానికి వీలుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు భూగర్భ మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని పక్కాగా పని చేసేలా చర్యలు చేపట్టాలి.

# 45 వసంతాలు.. అభివృద్ధికి మీనమేషాలు

మంథని : మంథని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పడి 45 ఏళ్లు కావస్తున్నా అభివృద్ధికి నోచుకోవడం లేదు. స్థానిక జూనియర్ కళాశాల ఆవరణలో 1981 నవంబరు 16న బీఏ, బీకాం కోర్సులతో కళాశాలను ప్రారంభించారు. 22 సంవత్సరాల తదుపరి మంథని మండలం మల్లెపల్లి గ్రామశివారులో డిగ్రీ కళాశాలకు సొంత భవనం నిర్మించారు.

**పీజీకి దూర ప్రాంతాలకే**

కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ, బ్యాంకింగ్, ఫైనాన్స్ సర్వీసెస్ బీమా (బీఎఫ్ఎస్ఐ) కోర్సులు ఉన్నాయి. ముత్తారం, మంథని, కమాన్‌పూర్, మల్హర్, మహదేవ్‌పూర్, తాడిచెర్ల, కాటారం ప్రాంతాల నుంచి విద్యార్థులు వస్తారు. పీజీ కోర్సులు అందుబాటులో లేకపోవడంతో ఏటా 25 మంది విద్యార్థులు డిగ్రీ పూర్తి చేసుకొని కరీంనగర్, హైదరాబాద్ తదితర నగరాలకు వెళ్తున్నారు. పెద్దపల్లి, గోదావరిఖని డిగ్రీ కళాశాలల్లో పీజీ కోర్సులు ఉన్నప్పటికీ వసతి సమస్యతో దూర



ప్రాంతాలకు వెళ్లి వ్యయప్రయాసాలు పడుతున్నారు.

**న్యాక్ గుర్తింపు ఉన్నా.. నిధులు సున్నా**

12 తరగతి గదులు అవసరం ఉండగా 7 గదులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. గ్రంథాలయం, ప్రయోగశాల ఒకే గదిలో నిర్వహిస్తున్నారు. కళాశాలకు 2016లో న్యాక్ బీ, 2022లో బిం గ్రేడు గుర్తింపు లభించింది. బిం గుర్తింపు లభిస్తే కళాశాల అభివృద్ధికి రూ.2 కోట్ల వరకు నిధులు మంజూరు కావాలి. కానీ నిబంధనలు మార్చటంతో ప్రస్తుతం ఏ గ్రేడ్ కళాశాలలకు మాత్రమే నిధులు ఇస్తున్నారు. 2018లో రూ.30 లక్షలతో తెలంగాణ స్కిల్స్ నాలెడ్జ్ సెంటర్(టీఎస్‌కేసీ) పేరిట హాలు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. భవనం శ్లాబ్ వరకు నిర్మించి వదిలివేశారు.

**ఏటా తగ్గుతున్న విద్యార్థులు**

బస్సు దిగి కళాశాలకు వెళ్లడానికి విద్యార్థులకు బురద రోడ్డే దిక్కయింది. సాయంత్రం వేళలో బస్సులు ఆపకపోవటంతో విద్యార్థులు 3 కి.మీల దూరంలోని మంథనికి నడుచుకుంటూ వచ్చిన సందర్భాలున్నాయి. బాలికలకు వసతిగృహం అందుబాటులో లేకపోవడంతో దూర ప్రాంత విద్యార్థినులు కళాశాలలో చేరటానికి వెనకంజ వేస్తున్నారు. ప్రారంభంలో 300 పైగా విద్యార్థులు ఉండగా ఆ సంఖ్య తగ్గుతోంది. గతేడాది 140 పైగా ఉండగా.. ప్రస్తుతం 125 మంది విద్యార్థులు చదువుతున్నారు. నైట్‌వాచ్‌మెన్, స్వీపర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

# నీరేది ?.. ఖాళీగా 30 శాతం చెరువులు

భువనగిరి : భారీ వర్షాలు కురిశాయి. ప్రధాన వాగులు పొంగి పొర్లుతున్నాయి. విచిత్రమేమిటంటే పెద్ద చెరువులు నీరులేక వట్టిపోయి కనిస్తున్నాయి. తుర్కపల్లి, బొమ్మలరామారం, మోత్కూరు, అడ్డగూడూరు, గుండాల మండలాల్లో గంటల వ్యవధిలోనే 10 నుంచి 16 సెం.మీ వర్షం ఏకధాటిగా కురవడంతో పరిస్థితిలో కొంత మార్పు వచ్చింది. కొన్ని మండలాల్లో సగం చెరువులు నిండగా.. మరికొన్ని ఖాళీగా ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 1155 చెరువులు ఉండగా 470 చెరువుల్లో 0–25 శాతం మాత్రమే నీరుంది. 196 చెరువులు మాత్రమే అలుగు పోస్తున్నాయి. 178 చెరువుల్లో 75 నుంచి 100 శాతం నీరు చేరింది. చౌటుప్పల్ మండలంలో 145, నారాయణపురంలో 134, ఆత్మకూరు(ఎం)లో 84 అధిక శాతం వర్షపాతం నమోదైనా.. పెద్దగా ప్రభావం కనిపించలేదు. చౌటుప్పల్, నారాయణపురం మండలాల్లో కలిపి 100 ఎకరాల ఆయకట్టు ఉన్న చెరువులు 15 ఉండగా ఇంకా 10 చెరువుల్లో నీరు చేరలేదు. భువనగిరి మండలం వడపర్తి కత్వ గేటును భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి సోమవారం ఎత్తారు. దీంతో భువనగిరి, బీబీనగర్ చెరువుల్లోకి నీరు వచ్చే అవకాశం ఉంది. భువనగిరి పెద్ద చెరువు, బస్వాపూర్, రాజాపేట మండలం జాల, బీబీనగర్ చెరువులు ఇంకా సగానికిపైగా ఖాళీగా ఉన్నాయి. మూసీ పరివాహక ప్రాంతాలు ఉన్న భువనగిరి నియోజకవర్గంలో పరిస్థితి కొంత మెరుగ్గానే ఉంది. ఆలేరు నియోజకవర్గంలో 512 చెరువులు ఉండగా.. 266 చెరువుల్లో నీటి మట్టాలు 0–25 శాతం లోపే ఉన్నాయి. 22 మాత్రమే అలుగు పోస్తున్నాయి. తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని మోత్కూరు, అడ్డగుడూరు మండలాల్లో



చెరువుల పరిస్థితి ఆశాజనకంగా ఉంది. రామన్నపేటలో 77 చెరువులకు 45 చెరువుల్లో 25 శాతం కూడా నీరు చేరలేదు. చౌటుప్పల్, లక్కారంలోని చెరువుల్లోకి చుక్క నీరు చేరలేదు. భారీ వర్షాలు కురిసి వాగులు పారితే మల్కాపురం, కైతాపురం, లక్కారం, చౌటుప్పల్ వరకు గొలుసు చెరువులు నిండి అలుగు పోస్తాయి. ఇప్పటి వరకు ఆ పరిస్థితి లేదు. వానాకాలంలోనూ చౌటుప్పల్‌లో మూడు వార్డుల పరిధిలో ట్యాంకర్లతో ఇంటింటికీ నీటిని పురపాలిక ద్వారా సరఫరా చేస్తున్నారు. రాజపేట మండలంలో అతి పెద్ద చెరువులైన కుర్రారం ఊర చెరువు, పాముకుంట వెంకటాద్రి చెరువు, రాజపేట గోపాల్ చెరువు, సింగారం రెడ్డి చెరువు, బొందుగుల, నెమిల గ్రామాల్లోని ఊర చెరువుల పరిస్థితి దయనీయంగా ఉంది.

చురకలు



# ఇంటి నెంబర్‌తో భూముల రిజిస్ట్రేషన్లు!

చొప్పదండి : జిల్లాలోని ఆబాదీ, గ్రామకంఠం భూములకు సంబంధించిన భూముల రిజిస్ట్రేషన్ల నిమిత్తం జిల్లా పాలనాధికారి ఇటీవల సమగ్ర ఉత్తర్వులు జారీ చేశారు. ఇంటి నంబర్లతో చేసే రిజిస్ట్రేషన్లపై విధివిధానాలు రూపొందించి జిల్లాలోని అన్ని మండలాల ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు, పురపాలికలకు మార్గదర్శకాలు ఇచ్చారు. కానీ క్షేత్రస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు ఈ ఉత్తర్వులను పాటించడంలేదు. రిజిస్ట్రేషన్ కోసం ఇవ్వాల్సిన నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) ఇవ్వకుండా నానా సాకులు చెబుతూ కాలయాపన చేస్తున్నారు. రిజిస్ట్రేషన్ చేసుకోవాలనుకునే వారు పంచాయతీ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది.

**ఆ భూములపై అస్పష్టత**

చాలా గ్రామాల్లో సర్వే నంబర్లకు చెందిన భూముల్లో దశాబ్దాల క్రితం నిర్మించిన ఇళ్లకు ఎలాంటి రిజిస్ట్రేషన్లు, ధ్రువపత్రాలు లేకపోవడంతో ప్రస్తుతం ఉన్న ఇంటి నంబర్‌తో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చూస్తున్నారు. సర్వే నంబర్ కలిగిన భూములకు ఎన్‌వోసీ ఇవ్వకూడదని పలువురు పంచాయతీ కార్యదర్శులు వెనకడుగు వేస్తున్నారు. భూమిని ఎలా కొలవాలని కూడా తేల్చుకోలేకపోతున్నారు. రిజిస్ట్రేషన్లకు పంచాయతీ కార్యదర్శి ఎన్‌వోసీ తప్పనిసరి చేయడంతో ఈ ప్రక్రియ ముందుకు సాగడంలేదు. సర్వే నంబర్ లేకపోయినా చాలా ఏళ్లుగా నివాసముంటున్న వారి భూమిని మోఖాపై విచారణ చేసి ఎన్‌వోసీలు



ఇవ్వాల్సి ఉన్నా, ఆ దిశగానూ చర్యలు తీసుకోడంలేదు. సర్వే నంబర్ గల భూములపై స్పష్టత లేకపోవడంతో ముందుకు రావడం లేదని పంచాయతీ కార్యదర్శులు చెబుతున్నారు.

**పురపాలికల్లో మొదలు కాని ప్రక్రియ** జిల్లాలోని కరీంనగర్ కార్పొరేషన్, జమ్మికుంట, హుజూరాబాద్, చొప్పదండి పురపాలక సంఘాల్లోని టౌన్ ప్లానింగ్ అధికారులు మోకాపై విచారణ చేసి ఎన్‌వోసీ ఇవ్వాలని ఆదేశాలు ఉన్నా పట్టించుకోవ డంలేదు. ప్రజలు వెళ్లి కార్యాలయాల్లో అడిగితే టౌన్‌ప్లానింగ్ అధికారికి ఇళ్ల అనుమతులు, ఇళ్లకు సంబంధించిన ఫిర్యాదుల పరిష్కారానికే సమయం సరిపోవడంలేదని సంబంధిత అధికారులు చెబుతున్నారు. పురపాలికల్లో యాజమాన్య ధ్రువీకరణ పత్రం ఇవ్వకూడదని పురపాలక శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి ఆదేశాలున్నాయి. దాంతో ఎవరి ఉత్తర్వులు పాటించాలో తెలియక ఎన్‌వోసీలు ఇవ్వడంలేదని వాపోతున్నారు.

# కష్టం తీరేదెలా 'నానో'య్..!

గరిడేపల్లి : జిల్లాలో ఎక్కడ చూసినా యూరియా కష్టాలే. అధికారులు నిల్వలు పుష్కలంగా ఉన్నాయంటూ ప్రకటనలు చేస్తున్నా.. క్షేత్రస్థాయిలో జనం ఎగబడుతున్నారు. ఇదే అదనుగా అటు ప్రభుత్వ పరంగా సరఫరా చేసే, ప్రైవేటు దుకాణంలో కొనుగోలు చేసే యూరియాకు లింకులు తప్పడం లేదు. ఇదేమంటే అవి తీసుకుంటేనే యూరియా ఇస్తామంటూ మెలిక పెడుతున్నారు. ప్రభుత్వం సరఫరా చేసే యూరియాకు ద్రావణం రూపంలో బాటిల్స్ ఇస్తుండగా.. ప్రైవేటు దుకాణాల వారు పిలకల గుళికలను ఘన రూపంలో ప్యాకెట్లు ఇస్తున్నారు. సహకార సంఘాలకు నాలుగు రోజుల క్రితం యూరియా సరఫరా చేశారు. వారికి నానో యూరియా ఇచ్చారు. దాన్నే రైతులకు అంటగడుతున్నారు. మూడు యూరియా బస్తాలు కావాలంటే ఒక నానో యూరియా బాటిల్ తీసుకోవాల్సిందేనని కరాఖండిగా చెబుతున్నారు. ఇదే విషయం మంగళవారం పొనుగోడు సొసైటీ వద్దకు వచ్చిన కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు సైతం రైతులు మొరపెట్టుకున్నారు. తమకు నానో యూరియా(నానో యూరియా 500 మిల్లీలీటర్లు రూ.240) తక్కువ ధరకు వచ్చినా పిచికారీ చేయడానికి రూ.500 ఖర్చవుతుందని, అది అదనపు భారమని చెప్పినా.. మార్క్‌ఫెడ్ నుంచి



ప్రభుత్వమే సరఫరా చేస్తున్నందున అలవాటు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. చివరకు ఐదు బస్తాలకు ఒక బాటిల్ ఇవ్వండని రైతులు కోరగా అలాగే పంపిణీ చేయించాలని ఏవోకు సూచించారు. ప్రస్తుతం జిల్లాలో బఫర్ స్టాక్ 700 మెట్రిక్ టన్నులు ఉండగా సహకార సంఘాలు, ప్రైవేటు డీలర్ల వద్ద 3,300 మెట్రిక్ టన్నులు ఉందని జేడీఏ జి.శ్రీధర్‌రెడ్డి తెలిపారు. నానో యూరియా 5,100 లీటర్లు (10,200 బాటిల్స్) ఉందన్నారు.

ప్రైవేటు ఫర్టిలైజర్ దుకాణాలలో యూరియా కావాలంటే పిలక గుళికలు ఒక ప్యాకెట్ తీసుకోవాల్సిందే. అలా తీసుకుంటామంటే యూరియా ఉందంటున్నారు. వద్దంటే లేదని చెబుతున్నారని రైతులు పేర్కొంటున్నారు. ప్యాకెట్ వందో, రెండొందలో అయితే ఎలాగైనా తీసుకునే వాళ్లమని, కానీ అది రెండు యూరియా బస్తాల ఖరీదవుతుందని చెబుతున్నారు. ఒక ప్యాకెట్ రూ.580గా ఉంది. అందుకే రైతులు గుళికల ప్యాకెట్ తీసుకోవడానికి వెనుకంజ వేస్తున్నారు. సకాలంలో నగదు లేని రైతులు అప్పుగా ఎరువులు, పురుగు మందులు తీసుకునే వారు ప్యాకెట్‌ల బదులు రెండు వందలు ఎక్కువైనా యూరియా ఒక్కటే కొనుగోలు చేస్తున్నారు. ఒక్క బస్తా రూ.380 నుంచి రూ.430కి కొంటున్నట్లు పేర్కొన్నారు.

**విస్తృత ప్రచారం చేసినా – జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి**

నానో యూరియా అలవాటు చేసుకోవాలని, మున్ముందు బాటిల్స్‌లోనే సరఫరా అవుతుందని ఎంతోకాలంగా చెబుతున్నాం. చైతన్యం తీసుకువస్తున్నా రైతులు ముందుకు రాకపోవడంతో ప్రభుత్వమే మార్క్‌ఫెడ్ ద్వారా ఇలా పంపిణీ చేయిస్తోంది. వర్షాలు అధికంగా ఉన్నందున యూరియా మోతాదు తగ్గించాలని రైతులకు సూచిస్తున్నాం.

# అవిఘ్నమస్తు



హైదరాబాద్: రాజధానిలో వైభవంగా జరగనున్న వినాయక చవితి వేడుకలకు అధికార యంత్రాంగం ప్రణాళిక సిద్ధం చేసింది. జీహెచ్ఎంసీ, పోలీసు, విద్యుత్తు, జలమండలి, వైద్య ఆరోగ్యశాఖ, పర్యాటకశాఖ, హైడ్రా, కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ) వంటి పలు సంస్థలు పండగ కోసం భారీ ఏర్పాట్లు చేశాయి. శోభాయాత్ర జరగనున్న 303 కి.మీ రహదారులపై, నిమజ్జన కేంద్రాల వద్ద పారిశుద్ధ్య నిర్వహణకు జీహెచ్ఎంసీ బృందాలను నియమించింది. నిమజ్జనం కోసం పెద్దయెత్తున సిబ్బందిని, యంత్రాలను సిద్ధం చేస్తోంది. భక్తులు ప్రమాదవశాత్తు నీటిలో పడితే.. వారిని రక్షించేందుకు గజ ఈతగాళ్లు, పడవలు అందుబాటులో ఉంటాయి. మరిన్ని ఏర్పాట్లతో నిమజ్జన వేడుకలను సకాలంలో, విజయవంతంగా పూర్తి చేయాలని సర్కారు లక్ష్యంగా పెట్టుకుంది.

**సాగర్ చుట్టూ రెండు వరుసల కంచె..**

ఈనెల 27 నుంచి గణపతి నవరాత్రులు మొదలవుతాయి. 11వ రోజు ఎక్కువ విగ్రహాలు నిమజ్జనం అవుతాయి. ఖైరతాబాద్ బడా గణేశుని నిమజ్జనం సెప్టెంబరు 6న మధ్యాహ్నానికి పూర్తవుతుందని అధికారులు చెబుతున్నారు. అప్పట్నుంచి మరుసటి రోజు మధ్యాహ్నం వరకు హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం కొనసాగుతుందని అంచనా వేస్తున్నారు. తొక్కిసలాట జరగకుండా అన్ని రోడ్లకు బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నామని, సాగర్ చుట్టూ రెండు వరుసల కంచెను ఏర్పాటు చేస్తున్నట్లు జీహెచ్ఎంసీ చెబుతోంది. జలమండలి ఆధ్వర్యంలో తాగునీటి శిబిరాలు, వైద్య ఆరోగ్య శాఖ తరఫున 7 వైద్య శిబిరాలు, పోలీసు, జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో సహాయ కేంద్రాలు, 13 కంట్రోల్‌రూమ్‌లు సాగర్ చుట్టూ ఏర్పాటు కానున్నాయి. ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించేలా కార్యాచరణ రూపొందించామని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ.కర్ణన్ తెలిపారు.

**హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచేలా ఉత్సవాలు**

హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో గణేశ్ ఉత్సవాలను హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచేలా నిర్వహిస్తామని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఉత్సవాల ఏర్పాట్లపై జూబ్లీహిల్స్‌లో మంగళవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. మేయర్ విజయలక్ష్మి ఎమ్మెల్సీ దయానంద్, డీజీపీ డా.జితేందర్, బల్దియా కమిషనర్ కర్ణన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గణేశ్ నిమజ్జన ఉత్సవ కార్యాచరణ గైడ్‌ను వారు ఆవిష్కరించారు.

**నిమజ్జన ఏర్పాట్లు ఇలా..**

ప్రధాన నిమజ్జన కేంద్రాలు
20 (హుస్సేన్‌సాగర్, సరూర్‌నగర్, ఐడీఎల్, సఫిల్‌గూడ, సున్నంచెరువు, తదితరాలు)
అదనంగా
60 కృత్రిమ నిమజ్జన కోనేరులు
వేడుక కోసం: 141 స్టాటిక్ క్రేన్లు, 295 మొబైల్ క్రేన్లు
సహాయక చర్యలకు
హుస్సేన్‌సాగర్ వద్ద 9 బోట్లు, 16 డీఆర్ఎఫ్ బృందాలు, 200 మంది గజ ఈతగాళ్లు
వ్యర్థాల తరలింపునకు..
102 మినీ టిప్పర్లు, 125 జేసీబీలు
భక్తుల కోసం: 309 సంచార మరుగుదొడ్లు
శోభాయాత్ర రోడ్డు మార్గం 303.3 కి.మీ
పారిశుద్ధ్య విధుల్లో: 14,486 మంది కార్మికులు
ఉచిత విగ్రహాల పంపిణీ
3 లక్షలు (1లక్ష జీహెచ్ఎంసీ, 2లక్షలు పీసీబీ ఆధ్వర్యంలో). 52,270 లైట్లతో చెరువులు, కోనేరుల వద్ద విద్యుద్దీపాలంకరణ

# చెత్తకుప్పలపై చేతులెత్తేశారు



హైదరాబాద్: ఓ వైపు వానలు.. మరోవైపు జ్వరాలతో నగరవాసులు సతమతమవుతున్నారు. ఇప్పుడు గ్రేటర్‌కు మరో కష్టం తోడైంది. రెండ్రోజులుగా వ్యర్థాలను తొలగించే వాహనాలు జవహర్‌నగర్ డంపింగ్‌యార్డుకు పరిమితం అవడంతో.. చెత్తకుప్పలు పేరుకుపోయి. దుర్వాసన వెదజల్లుతోంది. కురుస్తోన్న వానలతో.. వ్యర్థాలు వరదలో కొట్టుకుపోయి రహదారులను దుర్భరంగా మార్చుతున్నాయి.

**బకాయిలు పేరుకుపోయి..**

జీహెచ్ఎంసీ పరిధిలో రోజూ 9వేల టన్నుల వరకు వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి. స్వచ్ఛ ఆటోలు ఇళ్ల నుంచి వ్యర్థాలను సేకరించి, నగరంలోని 100 ప్రాంతాల్లో ఉన్న వ్యర్థాల తరలింపు కేంద్రాలకు తరలిస్తాయి. అక్కడ పోగయ్యే చెత్తను రాంకీ సంస్థ జవహర్‌నగర్ డంపింగ్‌యార్డుకు తీసుకెళ్తుంది. చెత్తను డంపింగ్‌యార్డుకు తీసుకెళ్తున్నందుకు, అక్కడ చేపట్టే వ్యర్థాల నిర్వహణకుగాను జీహెచ్ఎంసీ నెలకోసారి రాంకీకి నిధులు చెల్లిస్తోంది. గతంలో నేరుగా బల్దియా ఇచ్చే నిధులు రాంకీ ఖాతాలో జమ అయ్యేవి. ఇప్పుడు బల్దియా ప్రభుత్వం ద్వారా చెల్లింపులు చేస్తోంది. ఈ క్రమంలో.. రాంకీకి ఏడాదిన్నరగా చెల్లింపులు జరగట్లేదు. దాని ప్రభావం చెత్త రవాణాపైనా పడింది. వాహనాల డ్రైవర్లు, క్లీనర్లకు రాంకీ సంస్థ సరిగా జీతాలు చెల్లించట్లేదు. ఈ కారణంతో రెండ్రోజులుగా దాదాపు 2,500 కార్మికులు సమ్మె చేస్తున్నారు. 60శాతానికిపైగా వాహనాలు డంపింగ్‌యార్డుకే పరిమితమయ్యాయి. వరుస వానలు, సీజనల్ వ్యాధులు, వినాయక చవితిని దృష్టిలో ఉంచుకుని జీహెచ్ఎంసీ అధికారులు వెంటనే స్పందించాలని, పారిశుద్ధ్య సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు.

# చెరువుల భద్రమేనా?



కరీంనగర్ : ఇది కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలోని గాగిరెడ్డిపల్లి చెరువు తూము వద్ద చేపట్టిన మరమ్మతు పనులు. ఇక్కడి రెండు తూముల పనులకు రూ.11 లక్షల నిధులొచ్చాయి. శిథిలావస్థలో ఉన్న వీటికి ఆలస్యంగా నిధులు కేటాయించారు. వాస్తవానికి ఎండాకాలం వరకే టెండర్లు పూర్తయి పనులు జరిపించాలి. కానీ వర్షాకాలం ముందర పనులు చేపట్టారు. దీంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో ఈ చెరువులో నీరు చేరితే ఎంతమేర పదిలమనేది ప్రశ్నార్థకమే! ఇటీవల నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి నిర్వహించిన దృశ్య సమీక్షలో నాలుగు జిల్లాల పరిధిలో చెరువులు పదిలమని నీటి పారుదలశాఖ ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. ముందస్తుగా అన్నింటిని పరిశీలిస్తున్నామని ఎక్కడా ఇబ్బందులు లేవని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల కురిసిన వానలకు 327 చిన్న చెరువుల్లోనే మోస్తరుగా నీళ్లు నిండాయని మిగతా వాటిల్లో పూర్తిగా వరద నీరు రాలేదనే విషయాన్ని వెల్లడించారు. చెరువుల పటిష్ఠతకు సంబంధించి గతేడాది అనుకున్న విధంగా నిధులు మంజూరవలేదు. రెండేళ్ల కిందట కురిసిన భారీ వర్షాలతో జిల్లాలోని చాలా చెరువులకు గండ్లు పడ్డాయి. అక్కడక్కడా గ్రామస్థులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టి నీటిని కాపాడుకున్నారు. అయితే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గతంలో పంపిన ప్రతిపాదనలకు నిధులు విడుదల కాలేదు. కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఆ ప్రతిపాదనల్లో కొన్నింటికి మాత్రమే అత్యవసర ప్రాతిపదికన అరకొరగా నిధులొచ్చాయి. నాలుగు జిల్లాల్లో మొత్తంగా 4,283 చెరువులు, కుంటలున్నాయి. వీటిల్లో మొత్తంగా 15.73 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యమున్న చిన్ననీటి వనరుల కింద 1,98,588 ఎకరాల ఆయకట్టు ఉంది. గతంలో రూ.741.72 కోట్లతో 1,833 చెరువులను మిషన్ కాకతీయలో భాగంగా పునరుద్ధరించారు. తరువాత మరమ్మతులు, ఆధునికీకరణ పనులు పట్టించుకున్నవారు లేరు. **అప్రమత్తంగా ఉంటేనే..** ఈసారి భారీ వర్షాలు పడితే చాలా చెరువులకు ముప్పు వాటిల్లే అవకాశముందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అధికారులు నీటి పారుదల శాఖ మంత్రి సమీక్షలో ఎక్కడా ఇబ్బందులు లేవని చెప్పడంతోపాటు పర్యవేక్షణ పెంచారు. అయితే దాదాపు 50 శాతం చెరువులకు గడిచిన ఆరేళ్లుగా ఆధునికీకరణ నిధులు రాకపోవడంతో తూములు, అలుగులు, అనుబంధ కాలువల్ని బాగు చేసే అవకాశం కలగలేదు. పూడిక కూడా ఎక్కువ తటాకాల్లో తీయకపోవడం వల్ల ఇబ్బందికర పరిస్థితి నెలకొంది. గతంలో ఎదురైన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు క్షేత్రస్థాయిలో ముందస్తు ఏర్పాట్లు చేసుకుంటేనే ఇబ్బందులు తలెత్తవు అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# ఆకారం చిన్నదే.. అపకారం పెద్దది

మిర్యాలగూడ :ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న కుటుంబాలన్నీ దోమల నియంత్రణకు లిక్విడ్‌లు, ప్రత్యేక అగరుబత్తీలు, బ్యాట్‌లు, తెరలు, పచ్చ కర్పూరం హీటర్లు, ఆకర్షణ లైట్లు వంటివి పలు పద్ధతులు వినియోగిస్తున్నాయి. వీటి కోసం ప్రతి నెలా సరాసరి రూ.300 చొప్పున ఖర్చు చేస్తున్నట్లు అంచనా. ఈ మేరకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రతి నెలా రూ.32.48 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఇంత చేస్తున్నా పూర్తిగా నియంత్రించ లేక.. వ్యాధుల బారిన పడుతూ.. ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. ఆసుపత్రుల్లోనూ దోమల కాలంలో రూ.కోట్లలో వ్యాపారం సాగుతున్నట్లు అంచనా.

దోమ చిన్నదే కానీ.. అది చేసే చెడు అంతాఇంతా కాదు. దోమలతో మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాలతోపాటు ప్రాణాలనే హరించే డెంగీ, గన్యా వ్యాధులు సైతం ప్రబలుతున్నాయి. దీంతో గ్రామపంచాయతీల నుంచి పురపాలికల వరకు దోమల నియంత్రణకు అనేక



చర్యలు చేపడుతున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 19 పురపాలికలతో పాటు.. 1,768 గ్రామాలు, 10.82 లక్షల కుటుంబాలు దోమల నివారణకు ప్రతి నెలా రూ.50 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నాయంటే నోరెళ్ల బెట్టాల్సిందే. గ్రామ పంచాయతీలు దోమల నియంత్రణకు మూడు నెలలపాటు భారీగానే ఖర్చు చేస్తున్నాయి. పక్క కాల్వలు శుభ్రం చేయడం, వాటిల్లో నూనె బంతులు వేయడం, రోడ్ల వెంట పిచ్చి మొక్కలు తొలగించడం, దోమల మందు పిచికారీ చేయడం వంటి చర్యలు చేపడతారు. ఈ పనులకు పెట్రోల్‌తో నడిచే యంత్రాలు వినియోగిస్తారు. పది రోజులకోసారి దోమల మందు పిచికారీ చేస్తే.. ఒక సారికి రూ.5వేల వరకు ఖర్చు అవుతోంది. దీంతోపాటు నూనె బంతులను నీరు నిల్వ ఉండే ప్రదేశాల్లో వేస్తారు. వీటన్నింటికీ గ్రామానికి సుమారు రూ.60వేల వరకు ఖర్చు చేస్తారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా దోమల కాలంలో కేవలం గ్రామాల్లోనే రూ.10.60 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నారు.

పురపాలికలూ వంద రోజుల ప్రణాళికతోపాటు ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమాలు చేపడతారు. దోమల మందు పిచికారికే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న 19 పురపాలికల్లోని 416 వార్డులకు గాను ప్రతి నెలా సుమారు రూ.4.16 లక్షల చొప్పున మూడు నెలలకు రూ.1.24కోట్లు ఖర్చు చేస్తున్నారు. వీటితోపాటు పిచ్చి మొక్కల తొలగింపు..నాలాల్లో వ్యర్థాల తొలగింపు కార్యక్రమాలకు మరో రూ.2కోట్ల పైగా ఖర్చు చేస్తారు.

# ఇటుక భారం.. ఇసుక బంగారం

ఆలేరు : ప్రభుత్వం పేదలకోసం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకాన్ని ప్రారంభించింది. గూడులేని పేదలకు చాలా ఉపయుక్తంగా ఉన్న ఈ పథకంలో జిల్లాలో పలువురు లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. కాగా నిర్మాణానికి అవసరమయ్యే ఇసుక, ఇటుక, సిమెంట్ ధరలు పెరగడంతో నిరాశకు లోనవుతున్నారు. గత నాలుగు నెలల కిందటితో పోల్చితే ఇటుక, రాయి, ఇసుక ధరలు పెరిగాయి. ఇతర సామగ్రి ధరలు సైతం పెరగడంతో లబ్ధిదారులపై ఆర్థిక భారం పడుతోంది. ఇందిరమ్మ ఇళ్లకు తక్కువ ధరకే ఇసుక సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు చెబుతున్నా.. వాస్తవ పరిస్థితుల్లో చాలా తేడా ఉంటోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**స్టీల్ మినహా..**

ప్రస్తుతం మార్కెట్లో స్టీల్(ఇనుము) మినహా ఇసుక, ఇటుక, రాయి, కంకర, మొరం మట్టి ధరలు పెరగడంతో పాటు పునాదులు తవ్వేందుకు సైతం కూలీల ధరలు పెరిగాయని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు నిర్మాణాలు ప్రారంభించేందుకు డబ్బులు లేక కొందరు, ఇంటి స్థలాల విషయంలో కుటుంబ సభ్యుల మధ్య వివాదాలతో కొందరు, నిర్మాణాలకు భూమిపూజ విషయంలో సెంటిమెంట్లతో కొందరు నిర్మాణాలను ప్రారంభించడం లేదు. నాలుగు నెలల క్రితం సాధారణ సిమెంటు బస్తా ధర రూ.260 ఉండగా ప్రస్తుతం రూ.310, ఇటుక ఒక్కటి రూ.5.50 పైసలు ఉండగా ప్రస్తుతం రూ.7, బేస్మెంట్ రాయి రూ.17 ఉండగా ఇప్పుడు రూ.21, ట్రాక్టర్ ఇసుక రూ.1800



ఉండగా ప్రస్తుతం డిమాండ్‌ను బట్టి రూ.2400 వరకు విక్రయిస్తున్నారని లబ్ధిదారులు చెబుతున్నారు. ప్రభుత్వం ఇంటి నిర్మాణ సామగ్రి ధరలను నియంత్రిస్తే మేలు జరుగుతుందని.. లేనిపక్షంలో ప్రభుత్వం ఇచ్చే రూ.5 లక్షలకు మరో రెండు, మూడు లక్షల రూపాయల అదనపు భారం తమపై పడనుందని పలువురు అంటున్నారు.

**ఇళ్ల ప్రగతి...**

జిల్లా పరిధిలో 17 మండలాలు, 6 పురపాలికలు ఉండగా రెండు విడతల్లో 9,398 ఇళ్లు మంజూరయ్యాయి. ఈనెల 18 నాటికి 7,633 ఇంటి నిర్మాణాలకు ముగ్గులు పోశారు. 1,765 నిర్మాణాలు ప్రారంభం కాలేదు. 4,255 ఇళ్ల పనులు బేస్మెంట్ వరకు వచ్చాయి. 463 ఇళ్లు రూఫ్‌లెవెల్, 162 రూఫ్‌కాస్ట్ స్థాయి వరకు వచ్చాయి. 7 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. ఆరు పురపాలికల్లో రెండు విడతల్లో 1,433 ఇళ్లు మంజూరయ్యాయి. ఈ నెల 18 నాటికి 1,098 ఇంటి నిర్మాణాలకు ముగ్గులు పోశారు. 335 ఇళ్ల నిర్మాణాలు మొదలు పెట్టలేదు. 686 ఇళ్ల పనులు బేసెంట్ వరకు వచ్చాయి. 42 ఇళ్లు రూఫ్ లెవెల్, 2 రూఫ్‌కాస్ట్ స్థాయివరకు వచ్చాయి.

## వ్యర్థాల లెక్కలుంటేనే నివాసయోగ్యం

హైదరాబాద్: భవన నిర్మాణ వ్యర్థాలకు (సీ అండ్ డీ) ఇక లెక్క చెప్పాల్సిందే. ఆకాశహర్మ్యాలు కట్టేసి.. అక్కడ ఉత్పత్తయ్యే నిర్మాణ వ్యర్థాలతో సమీపంలోని చెరువులు, లోతట్టు ప్రాంతాలను పూడ్చేస్తామంటే ఇకపై కుదరదు. నిర్మాణ అనుమతి జారీ నాటి నుంచి పూర్తయ్యే వరకు రోజువారీ ఉత్పత్తయ్యే వ్యర్థాలను జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలోని సీ అండ్ డీ కేంద్రాలకు తరలిస్తేనే సదరు భవనానికి నివాసయోగ్య పత్రం(ఓసీ) జారీ అవుతుంది. ఈ నిబంధనను తీసుకొచ్చేందుకు పురపాలకశాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. ప్రభుత్వం చేపట్టే నిర్మాణాలు, రోడ్లు, మరమ్మతు కాంట్రాక్టుల్లోనూ నిబంధనను చేర్చేందుకు అధికారులు చర్చలు జరుపుతున్నారు.

**నగరంలో నాలుగు కేంద్రాలు..**సీ అండ్ డీ వ్యర్థాలతో నగరానికి అనేక రకాలుగా నష్టం జరుగుతోంది. చెరువులు, నాలాల ఆక్రమణలతో పాటు మూసీ నది పూడ్చివేత జరుగుతోంది. కొందరు రోడ్ల పక్కన పారబోస్తున్నారు. మరికొందరు ఖాళీ స్థలాలను డంపింగ్ యార్డులుగా మార్చుతున్నారు. వరదల వంటి విపత్తులు, భూ ఆక్రమణలు, గాలి కాలుష్యానికి దారి తీస్తున్న వ్యర్థాలకు చక్కని పరిష్కారాన్ని చూపుతూ.. నగరానికి నాలుగు వైపులా సీ అండ్ డీ నిర్వహణ కేంద్రాలను జీహెచ్ఎంసీ ఏర్పాటు చేసింది. జీడిమెట్ల, నాగోల్ ఫతుల్లాగూడ, శంషాబాద్, తూముకుంటలో ఉన్నాయి. ఒక్కో కేంద్రంలో రోజుకు 500టన్నుల వ్యర్థాలను నిర్వహించవచ్చు. కాంక్రీటు, బండరాళ్లు, ఇతర వ్యర్థాలను యంత్రంలో వేసి.. ఇసుక, కంకర, మట్టి, ఇనుము,



తదితర వస్తువులను వేరు చేస్తాయి. వాటిని చిన్న నిర్మాణ పనుల్లో ఉపయోగించేందుకు పౌరులు కొనుగోలు చేస్తారు.

**నిబంధన ఉద్దేశం..**అండ్ డీ కేంద్రాలకు 90శాతం నిర్మాణ సంస్థలు వ్యర్థాలను తరలించట్లేదు. ప్రైవేటు కాంట్రాక్టర్లకు ఇస్తుండగా.. వాళ్లు ఖాళీ స్థలాల్లో, చెరువులు, నాలాల్లో పడేస్తున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలంటే నిర్మాణ అనుమతుల జారీలో కొత్త నిబంధనను చేర్చాల్సిందేనని పురపాలకశాఖ నిర్ణయానికొచ్చింది. గుర్తింపు పొందిన కేంద్రాలకు వ్యర్థాలను ఇచ్చినట్టు రసీదులు చూపితేనే.. భవనానికి ఓసీ ఇచ్చేట్టు నిబంధన రూపొందించారు. రాష్ట్ర వ్యాప్తంగా దీన్ని అమల్లోకి తేవాలా లేదా రాజధాని ప్రాంతానికి వర్తింపజేయాలా అని సమాలోచనలు చేస్తున్నారు.

## కొట్టుకుపోయి.. రాకపోకలు ఆగిపోయి..

తాండూరు : తాండూరు మండలంలో భారీ వర్షం కురిసింది. బెల్కటూరు వద్ద వంతెన నిర్మాణం కొనసాగుతుండగా పక్కనే నిర్మించిన తాత్కాలిక రహదారి వరదకు కొట్టుకుపోయింది. దీంతో కరణ్‌కోట, ఓగీపూర్, చంద్రవంచ, చిట్టిగణాపూర్, బెల్కటూర్‌కు రాకపోకలు నిలిచిపోయాయి. అదానీ, సీసీఐ సిమెంటు కర్మాగారాల లారీలు, టిప్పర్లు కి.మీ.ల పొడవునా ఆగిపోయాయి. వరద వద్ద పోలీసులు గస్తీ నిర్వహించి అటువైపు వెళ్లకుండా అవగాహన కల్పించారు. సాయంత్రం రాకపోకలను పునరుద్ధరించారు. కొత్లాపూర్‌లో ఇళ్లలోకి వరద చేరి స్థానికులు అసౌకర్యానికి గురయ్యారు.

**వంతెన కష్టాలు:** బొంరాస్‌పేట మండల కేంద్రం నుంచి ధారూరు మండలం నాగారం వరకు రూ.23 కోట్లతో రెండు వరుసల రహదారి నిర్మిస్తున్నారు. మదన్‌పల్లితండా సమీపంలో చిన్నవాగు ప్రాజెక్టు అలుగు వాగుపై రూ.4.8 కోట్లతో వంతెన నిర్మిస్తున్నారు. రాకపోకలకు వీలుగా పక్కన తాత్కాలికంగా మట్టి రోడ్డు నిర్మించారు. పైపులు వేయకుండా నిర్మించడంతో రాత్రి కురిసిన వర్షానికి తెగిపోయింది. మదన్‌పల్లి, మదన్‌పల్లితండాలకు చెందిన విద్యార్థులు మండల కేంద్రంలోని పాఠశాలకు రావాలంటే చుట్టూ తిరిగి వేరే మార్గంలో వస్తున్నారు. మహంతిపూర్ వద్ద రూ.4 కోట్లతో వంతెన నిర్మిస్తున్న కారణంగా, పక్కనే తాత్కాలిక రహదారిని నిర్మించారు. రాత్రి వరద రావడంతో రోడ్డు తెగిపోయింది. గ్రామస్థులు మండల కేంద్రానికి రావడానికి ఇబ్బందులు పడ్డారు. ఈ విషయమై పీఆర్ ఏఈ సురేందర్‌రెడ్డిని వివరణ కోరగా వరదలకు తాత్కాలిక రహదారులు తెగిపోయాయని మళ్లీ నిర్మిస్తామన్నారు.

## నగరం.. జలదిగ్బంధం

కరీంనగర్ : ఎటు చూసినా జలమే.. రోడ్లు చెరువులయ్యాయి. మొదలైన వాన గంటన్నరపాటు ఏకధాటిగా కురవడంతో కరీంనగర్ జిల్లా కేంద్రం అతలాకుతలమైంది. ప్రధాన రహదారులపై నీరు చేరడంతోపాటు పలు కాలనీలు నీట మునిగాయి. రాత్రి 7 గంటల తరువాత మరోసారి భారీ వర్షం కురవడంతో మళ్లీ రహదారులపై నీరు నిలిచింది.రాంనగర్, పద్మానగర్, గీతాభవన్ చౌరస్తా, మంచిర్యాల చౌరస్తా, శివ థియేటర్, విద్యానగర్, హాస్పిటల్స్ వీధి, కమాన్ ప్రాంతం, అలుగునూర్, అల్కపురి కాలనీల్లోని రహదారులు కనిపించని విధంగా నీళ్లు చేరాయి. నగరపాలక శానిటేషన్, డీఆర్ఎఫ్ అత్యవసర బృందాలు, పోలీసులు రంగంలోకి దిగి నీటిని మళ్లించారు.



కరీంనగర్ కలెక్టరేట్: భారీ వర్షాల నేపథ్యంలో కరీంనగర్ కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూంను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ పమేలా సత్పతి ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాల నేపథ్యంలో సహాయం కోసం 0878-2997247 టోల్‌ఫ్రీ నంబరుకు కాల్ చేయాలని సూచించారు. మున్సిపల్ కార్పొరేషన్ సహాయం కోసం 98499 06694కు ఫోన్ చేయాలని తెలిపారు. వర్షాలతో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించలేదని, పంట నష్టం వాటిల్లలేదని వివరించారు.

కంట్రోల్ రూం నంబర్లు 0878-2997247, 98499 06694

వర్షపాతం..(సెం.మీ) కలెక్టరేట్ 7.0 దుర్శేడ్ 6.1 జమ్మికుంట 7.8 కొత్తపల్లి 6.4 చింతకుంట 6.6 వీణవంక 6.8 సైదాపూర్ 6.8 మానకొండూర్ 7.5 ఆసిఫ్‌నగర్ 5.5

# జేబుకు చిల్లు.. సౌలత్‌లు నిల్






హైదరాబాద్ : వరుస ఛార్జీల పెంపుపై నగర ప్రయాణికులు గుర్రుగా ఉన్నారు. అటు ఆర్టీసీ బస్‌పాస్, టీ-24 (డే పాస్)తో పాటు మెట్రోరైల్ ఛార్జీలు పెరగడంతో అదనపు భారం పడుతోందంటూ సామాన్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సదుపాయాల కల్పనపై దృష్టి సారించకుండా ఇలా ఛార్జీలు పెంచడమేంటని ప్రశ్నిస్తున్నారు. 'లాస్ట్‌మైల్ కనెక్టివిటీ', ఆర్టీసీ బస్‌షెల్టర్ల నిర్మాణం, అదనపు బస్సుల కొనుగోళ్లు, కొత్తమార్గాల్లో బస్సులను ప్రవేశపెట్టడం, పీక్ అవర్స్‌లో రద్దీ లేకుండా చూడటం తదితర సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఛార్జీల పెంపు నగరంలోని సుమారు 7.5లక్షల మంది ప్రయాణికులపై ప్రభావం పడుతుండగా ప్రయాస తగ్గించే మార్గాలను అన్వేషించాలని ప్రయాణికుల సంఘాలు కోరుతున్నాయి.

**ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలకు పరిష్కారమేదీ..?:** గ్రేటర్‌లో 2800 బస్సుల్లో నిత్యం 20 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. ప్రస్తుతం 1370 బస్‌షెల్టర్లు ఉండగా.. మరో 400కుపైగా ప్రాంతాల్లో కొత్త షెల్టర్ల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఇందులో 120 షెల్టర్లు ఇప్పటికిప్పుడే నిర్మాణం చేపట్టాలి. అవి కేవలం ప్రతిపాదనలకే పరిమితమైపోయాయి. ప్రయాణికులతో నిమిత్తం లేకుండా కేవలం వాణిజ్య ప్రకటనలు వచ్చే చోట షెల్టర్లు నిర్మించడంపై విమర్శలు వస్తున్నాయి. ఉదయం, రాత్రి వేళల్లో పరిమితంగా బస్సులు నడపటంతో ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు. చర్లపల్లి రైల్వేస్టేషన్‌కు మరిన్ని బస్సులు నడపాలని, కొత్తమార్గాల్లో బస్సులు వేయాలంటూ ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

**లాస్ట్‌మైల్ కనెక్టివిటీ ఎప్పుడు..?**

గ్రేటర్ పరిధిలోని చాలా మెట్రోస్టేషన్లలో లాస్ట్‌మైల్ కనెక్టివిటీ సమస్య వేధిస్తోంది. ఎల్బీనగర్, మియాపూర్, మెట్టుగూడ, హైటెక్‌సిటీ, రాయదుర్గం, దుర్గంచెరువు స్టేషన్లకు మినహా ఇతర స్టేషన్ల నుంచి గమ్యస్థానాలకు చేరుకునే సదుపాయాలు లేవు. గతంలో ఆర్టీసీ షటిల్ బస్సులను నడిపినా కొన్నిస్టేషన్లకే అవి పరిమితమయ్యాయి. కొన్ని చోట్ల కార్యాలయాలకు చెందిన వాహనాలు నడుపుతుండగా ఇంకొన్ని చోట్ల ఎలక్ట్రిక్ వాహనాలను నడుపుతున్నారు. ఇలాంటి సేవలను మరింత విస్తృతం చేయాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

# పూజల పేరిట గృహిణులకు టోకరా



హైదరాబాద్ : నూరేళ్లకోసారి వచ్చే అమావాస్య ఇది.. ఈ సమయంలో ప్రత్యేక పూజలు చేస్తే ఇంట్లో శుభం కలుగుతుంది. ఆర్థిక ఇబ్బందులు దూరమవుతాయంటూ సామాజిక మాధ్యమాల్లో ప్రకటన చూసిన ఓ గృహిణి వాట్సప్ ద్వారా నిర్వాహకులను సంప్రదించింది. ఆమె నుంచి కుటుంబ వివరాలు సేకరించి, రిజిస్ట్రేషన్ తదితర పేర్లతో రూ.40వేలు వసూలు చేశారు. రోజులు గడుస్తున్నా స్పందన రాకపోవటంతో మోసపోయినట్లు ఆమె గ్రహించారు.

ఈ నాణెం మీ వద్ద ఉంటే అద్భుత శక్తులు సొంతం చేసుకోవచ్చు. యూట్యూబ్‌లో వీడియో చూసిన ప్రైవేటు ఉద్యోగి రూ.లక్ష చెల్లించాడు. విదేశాల నుంచి తెప్పించేందుకు అదనంగా రూ.25వేలు డిమాండ్ చేయటంతో ఇదంతా మాయగాళ్ల పనిగా గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. నగరంలో ఇటీవల ఈ తరహా మోసాలు పెరుగుతున్నాయి. అంతర్జాలం, సామాజిక మాధ్యమాల్లో ఆధ్యాత్మిక అంశాలు వెతికే వారు మోసగాళ్ల వలకు చిక్కుతున్నారు. కొన్నిసార్లు వాట్సప్ ద్వారా బురిడీ కొట్టిస్తున్నారు. దేశంలోని ప్రముఖ ఆలయాల్లో పూజలు, వ్రతాలు, ప్రసాదాల పేరిట సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. కుటుంబ సమస్యలను తెలుసుకొని వాటికి పరిష్కారం చూపుతామంటూ భరోసానిస్తున్నారు. నకిలీ వెబ్‌సైట్‌లను రూపొందించి కుచ్చుటోపీ పెడుతున్నారు. సామాజిక మాధ్యమాల్లో ఆకట్టుకునే ప్రకటనలతో అందినంత దోచుకుంటున్నారు. పెద్దమొత్తంలో సొమ్ము పోయినప్పుడు మాత్రమే బాధితులు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. రూ.2-3వేల లోపు చెల్లించిన వారు ఠాణా చుట్టూ తిరగాల్సి వస్తోందనే ఉద్దేశంతో మిన్నకుండిపోతున్నారు. ఈ తరహా మోసాల బారిన పడుతున్న వారిలో అధికశాతం గృహిణులే ఉంటున్నారు.

**ఫిర్యాదు చేస్తే మేలు..**

దేశంలోని ప్రముఖ ఆలయాల్లో నిర్వహించే పూజా కార్యక్రమాల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తామంటూ నమ్మకం కలిగిస్తున్నారు. పిల్లల వివాహాలు, విదేశీయానం, ఉన్నత చదువులకు ఎదురవుతున్న అడ్డంకులను అధిగమించేందుకు పరిష్కారం చూపుతామంటూ వల విసురుతున్నారు. అన్నదానం చేసేందుకు సహకరించమంటూ బుట్టలో పడేస్తున్నారు. ప్రార్థన మందిరాలు నిర్మించేందుకు విరాళాలు సేకరిస్తున్నామని నమ్మించి ఇచ్చినంత కాజేస్తున్నారు. మోసపోతే టోల్‌ఫ్రీ 1930కు ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచిస్తున్నారు.

# కసరత్తుకు కష్టాలు!



కరీంనగర్ : నగర, పురపాలికల్లోని ప్రజలందరికీ ఆరోగ్యం కల్పించాలనే ఉద్దేశంతో బహిరంగ ప్రదేశాలు, పార్కుల్లో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారు. ప్రజల నుంచి వీటికి మంచి ఆదరణ లభించింది. పిల్లలు, యువకులు, మహిళలు, వృద్ధులు నిత్యం వీటిని ఉపయోగించుకుంటున్నారు. ప్రతి చోట పదికిపైగా వివిధ రకాల వ్యాయామ పరికరాలు అందుబాటులో ఉంచారు. ప్రస్తుతం వీటి నిర్వహణపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో రూ.కోట్లు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ల వ్యాయామ పరికరాలు పాడైపోతూ మూలన పడుతున్నాయి.

**పట్టించుకునే వారెవరు?**

ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేసిన తర్వాత పుర, నగరపాలక అధికారులు వాటి నిర్వహణ విస్మరించారు. 2018లో ఏర్పాటు చేసినవి పూర్తిగా చెడిపోగా కనీస మరమ్మతులు చేయకుండా వదిలేశారు. 2021-22లో కొనుగోలు చేసిన పరికరాలకు రెండేళ్ల వరకు సదరు ఏజెన్సీ వారు నిర్వహణ చూసుకోవాల్సి ఉంటుంది. వారు పట్టించుకోకపోవడంతో పరికరాలు విరిగినా.. ప్రమాదకరంగా ఉన్నా మరమ్మతులు చేసే వారు కరవయ్యారు.

కొత్తగా ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేసిన చోట సిమెంట్ ఫ్లోరింగ్ కింద రబ్బర్ షీట్లు వేశారు. వాటిని గమ్‌తో అతికించడంతో కొన్నాళ్లకే అవి ఊడిపోయాయి. వర్షం పడితే పైకి తేలుతున్నాయి. వీటి వల్ల విమర్శలు రావడంతో అధికారులు మెత్తని టైల్స్ వేయడం ప్రారంభించారు.

**ప్రస్తుత పరిస్థితి ఇలా..**

కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో రూ.5.50 కోట్లతో మొత్తం 60 ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయగా అందులో అయిదు చోట్ల పాత పరికరాలు పని చేయడం లేదు.

హుజూరాబాద్ పట్టణంలో రూ.25 లక్షలతో బోర్నపల్లి, ఇప్పల నర్సింగాపూర్, జూనియర్ కళాశాల మైదానం, మోడల్ చెరువు దగ్గర, గణేశ్‌నగర్‌లో మొత్తం ఆరు చోట్ల వీటిని ఏర్పాటు చేశారు. ఇందులో రెండు పని చేయడం లేదు.

జమ్మికుంటలో నాలుగేళ్ల కిందట అయిదు ఏర్పాటు చేయగా కొన్ని చోట్ల పరికరాలు పని చేయడం లేదు. ఫ్లోరింగ్ మ్యాట్లు ఊడిపోవడంతో వాటిని తొలగించారు. గడ్డి పెరిగి ఇబ్బందికరంగా మారుతోంది.

సిరిసిల్లలో మొత్తం 17 ఓపెన్ జిమ్‌లు ఉన్నాయి. రూ.6 లక్షలతో ఒక్కోటి ఏర్పాటు చేశారు. కార్గిల్ లేక్, పద్మనగర్ పార్క్ వద్ద ఉన్న జిమ్ పరికరాలు మరమ్మతులు లేక మొరాయిస్తున్నాయి.

పరిశీలించిన పుర, నగరపాలికలు : 9
మొత్తం ఓపెన్ జిమ్‌లు : 112
కసరత్తుకు అనుకూలంగా లేనివి : 26

## నక్షత్ర శోధనకు నిర్లక్ష్య గ్రహణం

అమీర్‌పేట : ఎంతో ప్రాధాన్యం కలిగిన అమీర్‌పేటలోని నిజామియా అబ్జర్వేటరీ ప్రాంగణం అధ్వాన స్థితికి చేరింది. నక్షత్రాల అధ్యయనం, ఖగోళ రహస్యాలు, గ్రహగతుల తీరును తెలుసుకునేందుకు 1909లో ఏర్పాటు చేసిన ఈ అబ్జర్వేటరీని పరిరక్షిస్తామని గతంలో అధికారులు ప్రకటించినా కార్యరూపం దాల్చలేదు. ఇందుకు అప్పట్లో పరిశోధనల కోసం ప్రస్తుత సెంటర్ ఫర్ సోషల్ ఎకనామిక్ స్టడీస్(సెస్) ప్రాంగణంలో టెలిస్కోపుల కోసం నిర్మించిన రెండు డోమ్‌లే సజీవ సాక్ష్యం. వీటిని చారిత్రక సంపదగా గుర్తించి పరిరక్షించాల్సిన అధికారులు గాలికొదిలేశారు. ఈ అబ్జర్వేటరీని 1969లో అమీర్‌పేట నుంచి జపాల్ రంగాపూర్ గ్రామానికి తరలించారు. అనంతరం ఈ అబ్జర్వేటరీ మూతపడింది. దీనిని పునరుద్ధరించేందుకు ప్రతిపాదనలు చేసిన అధికారులు అమీర్‌పేటలోని నిజామియా అబ్జర్వేటరీ పరిరక్షణను విస్మరించారు.

**నిజాం హయాంలోనే..** 1907లో ఖగోళ రహస్యాలు, నక్షత్రాల అధ్యయ



నం కోసం నిజాం సర్కారు అమీర్‌పేట, బేగంపేట, పంజాగుట్టకు సమీపంలో సీఎం క్యాంపు కార్యాలయం వెనుక 20 ఎకరాల స్థలాన్ని సేకరించింది. నిజామియా అబ్జర్వేటరీ ద్వారా పరిశోధనలకు శ్రీకారం చుట్టారు. ఓయూ ఆధ్వర్యంలో నక్షత్ర పరిశోధనలు సాగాయి. ఇక్కడి రెండు భారీ టెలిస్కోపుల ద్వారా సుమారు 4 లక్షల వరకు నక్షత్రాలను అధ్యయనం చేశారు. తర్వాత అబ్జర్వేటరీ తరలిపోయినా అమీర్‌పేటలో డోమ్‌లు, పరిశోధనల కోసం నిర్మించిన భవనం నేటికీ చెక్కుచెదరలేదు. ఈ ప్రాంతాన్ని చారిత్రక సంపదగా గుర్తించారు.

**నిధులు కేటాయించినా..**

నిజామియా అబ్జర్వేటరీ క్యాంపస్‌గా పనిచేసిన ఈ ప్రాంతంలో సెస్ (సామాజిక, ఆర్థిక అధ్యయన కేంద్రం), జెనిటిక్ ఆసుపత్రులు ఏర్పడ్డాయి. అనంతరం నిజామియా అబ్జర్వేటరీ ప్రాంగణాన్ని పరిరక్షించేందుకు చర్యలు చేపట్టారు. చారిత్రక ప్రాధాన్యం కల ప్రాంతంగా హెచ్ఎండీఏ గుర్తించడంతో శిథిలావస్థకు చేరిన డోమ్‌లు, మరో భవనానికి సెస్ మరమ్మతులు చేయించారు. ఇందుకు రూ.30 లక్షలు కేటాయించారు. ఆరేళ్లు అవుతున్నా ఎలాంటి కార్యకలాపాలు జరగకపోవడంతో ప్రస్తుతం ఉన్న డోమ్‌లు శిథిలావస్థకు చేరాయి. ఎవరికీ ప్రవేశం కల్పించడం లేదు.

## పచ్చని పండగొస్తోంది..!

నల్గొండ : పర్యావరణ పరిరక్షణలో.. జీవవైవిధ్యాన్ని కాపాడటంలో చెట్లు ప్రధానపాత్ర పోషిస్తాయి. ఆరోగ్యకరమైన తాజా గాలిని మానవాళికి అందించడమే కాకుండా సమయానుకూలంగా తగినంత వర్షాన్ని కురిపిస్తాయి. దేశ భౌగోళిక విస్తీర్ణంలో కనీసం 33 శాతం మేర అడవులు ఉండితీరాలని భారతీయ జాతీయ అటవీ విధాన పత్రం (1988) నిర్దేశించింది. కానీ జిల్లాలో అటవీ విస్తీర్ణం 9.57 శాతం మాత్రమే ఉంది. దీన్ని మరింత విస్తరింపజేయాల్సిన బాధ్యత అందరిపైన ఉంది. మొక్కలు నాటడమనేది ఎవరి పనో కాదు.. మన విధి. ఎక్కడ పచ్చదనంతో ప్రకృతి హర్షిస్తుందో అక్కడ వర్షం వరిస్తుంది.

**అంతా సిద్ధం**

జిల్లాలో 11 విడత వన మహోత్సవానికి అధికార యంత్రాంగం సిద్ధమైంది. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో మొక్కలు నాటేందుకు అధికారులు క్షేత్ర స్థాయిలో ఏర్పాట్లు చేశారు. గుంతలు తీసి సిద్ధంగా ఉన్న గ్రామాల్లో వీటిని నాటుతున్నారు. తెలంగాణ సర్కార్ ఊరూరా నర్సరీలను ఏర్పాటు చేసింది. గ్రామాల్లో ప్రజలకు అవసరమైన రకాలను పంపిణీ చేసేందుకు గ్రామ నర్సరీల ఏర్పాటుకు పంచాయతీ రాజ్ పటిష్ఠంగా ఏర్పాట్లు చేసింది. ప్రతి గ్రామంలో గ్రీన్ ప్లాన్ చేసి దాని ప్రకారంగా మొక్కలను పెంచారు. ఇప్పటికే గ్రామస్థులకు అవసరమైన వాటిని ఎంపిక చేసి గ్రామ నర్సరీల్లో సిద్ధం చేశారు. గృహ అవసరాలకు, రైతులకు ఉపయోగపడేవి, ఇతర ప్రాంతాల్లో నాటే వాటితో పాటు ఇతర లాభదాయకమైన 40 రకాల మొక్కలను పెంచారు. ఈ ఏడాది జిల్లాలో 68.708 లక్షల మొక్కలను నాటాలని లక్ష్యంగా నిర్ణయించారు. జిల్లాలో గత పది విడతల్లో 3.24 కోట్ల మొక్కలను నాటారు.

**చట్టబద్ధమైన పని..**

తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం 2018 ప్రకారం మొక్కల పెంపకం అనేది చట్టబద్ధమైన పని. పంచాయతీలో నాటిన ప్రతి మొక్కను బతికించాల్సి ఉంది. కొత్త చట్టం ప్రకారం వీటి నిర్వహణ బాధ్యత పంచాయతీలదే. గ్రామ కార్యదర్శి, సర్పంచులు బాగోగులు చూసుకోవాలి. మూడేళ్ల వ్యవధిలో 85 శాతం మొక్కలు బతికితేనే కార్యదర్శి కొలువు. సర్పంచి పదవికి భరోసా ఉంటుంది. లేకపోతే కార్యదర్శి ఉద్యోగం, సర్పంచి పదవిని కోల్పోవాల్సి వస్తోంది. నాటిన మొక్కలను సంరక్షించేందుకు సంరక్షకులను నియమించే అవకాశం ఉంది. వీరికి ఉపాధి పథకం కింద చెల్లింపులు చేయవచ్చు.

## నిరుపయోగం.. శ్రద్ధపెడితే వినియోగం

నాగార్జునసాగర్ పైలాన్ వద్ద ఉన్న దృశ్య కేంద్రం శిథిలావస్థకు చేరి పర్యాటకులకు దూరమవుతోంది. సాగర్ ప్రపంచ పర్యాటక కేంద్రం కావడంతో నిత్యం దేశ విదేశాల నుంచి పర్యాటకులు ఇక్కడికి వస్తుంటారు. అలా వచ్చిన వారికి సాగర్ గురించి వివరించడానికి డ్యాం అథారిటీ ప్రధాన జలాశయాన్ని ఆనుకొని దృశ్య కేంద్రం పేరుతో మినీ మ్యూజియం ఏర్పాటు చేసింది. దీనిలో జలాశయం, క్రస్టు గేట్లకు సంబంధించిన నమూనాలు, డ్యాం నిర్మాణానికి సంబంధించిన ఫొటోలను ఏర్పాటు చేశారు. దీనిని సందర్శించిన వారిందరికీ జలాశయం గురించి పూర్తిస్థాయిలో అవగాహన వస్తుంది. అంతే కాకుండా ఇది ప్రధాన డ్యాంకు సమీపంలో ఉండడంతో గేట్ల ద్వారా విడుదలవుతున్న నీటి సుందర దృశ్యం ఎంతో కనువిందు చేస్తుంది. మొదట్లో పర్యాటకశాఖ ఇక్కడ గైడ్ ఏర్పాటు చేసి వచ్చిన పర్యాటకులకు దీని గురించి వివరించే వారు. జలాశయానికి తీవ్రవాదుల ముప్పు ఉన్నదని డ్యాంతో పాటు మట్టి కట్టల పైకి ఎవరినీ అనుమతించడం లేదు. దృశ్య కేంద్రం కూడా ప్రధాన డ్యాంకు ఆనుకొని ఉండటంతో దీనిని కూడా సెఫ్టీ జోన్‌లోకి తీసుకొని ఇక్కడికి ఎవరినీ అనుమతించడం లేదు. గతంలో ప్రభుత్వం సాగర్ ప్రాజెక్టు ఆధునికీకరణ పనుల్లో భాగంగా దీనికి కూడా అభివృద్ధి చేయాలని ప్రణాళికలు తయారు చేసింది. కానీ ఇప్పటి వరకు ఎలాంటి కార్యాచరణ రూపుదాల్చలేదు. దీనిపై ఎన్నెస్పీ ఎస్ఈ మల్లికార్జునరావువివరణ కోరగా.. దృశ్య కేంద్రం విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

# చేసిందే పని.. చూపిందే లెక్క..!

శ్రీకాకుళం : అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో నిబంధనలకు పాతరేస్తున్నారు. ఉన్నతాధికారుల అనుమతి లేకుండా.. టెండర్లు పిలవకుండా ఇష్టానుసారం నిర్మాణాలు చేపడుతున్నారు. లెక్కాపత్రం లేకుండా దాతల విరాళాలు, భక్తులిచ్చిన కానుకల సొమ్ము దుర్వినియోగమవుతోంది. అధికారులు ఎంత మంది మారినా ఆలయంలో అక్రమాలకు అడ్డుకట్ట పడట్లేదు. ప్రస్తుత ఈవో సైతం పాత పాలకుల్లాగే వ్యవహరిస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆదిత్యాలయంలో నిత్యాన్నదానం నిర్వహణకు రూ.6 లక్షలతో పనులు చేయిస్తున్నారు. వీటితో పాటు పలు మార్పులు, చేర్పులు, మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టారు. దేవాదాయ శాఖ నిబంధనల ప్రకారం ఆలయాల్లో ఏ పని చేయాలన్నా అధికారుల అనుమతి తీసుకోవాలి. టెండర్లు పిలవాలి. ఇంజినీర్ల పర్యవేక్షణలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులు చేపట్టాలి. ఆయా వివరాలు ఎం.బుక్‌లో నమోదు చేసి ఆ మేరకు బిల్లులు చెల్లించాలి. ఒకవేళ దాతలే స్వయంగా పనులు చేయిస్తే శాఖాపరమైన అనుమతులు వచ్చిన తర్వాత అఫిడవిట్ సమర్పించాలి. పనుల్లో ఏ లోపం తలెత్తినా అందుకు తానే బాధ్యత వహిస్తానని స్టాంపు కాగితంపై దాత సంతకం చేయాలి. ఆ అఫిడవిట్‌ను



అధికారులు పరిశీలించాక నిర్మాణం చేపట్టాలి. ఇవేమీ లేకుండానే పనులు చకచకా సాగిపోతున్నాయి.

**విచారణ చేపడితే మరిన్ని వెలుగులోకి..**

గతంలో ఇలాగే ముందు చూపు, మాస్టర్ ప్లాన్ లేకుండా నచ్చినట్లు నిధులు ఖర్చు చేసి అనేక నిర్మాణాలు చేపట్టారు. వాటిని ఈ ఏడాది రథసప్తమి వేడుకల సమయంలో భక్తుల సౌకర్యార్థం అధికారులు తొలగించడంతో రూ.కోట్లు బూడిదపాలయ్యాయి. మళ్లీ అదే పని జరుగుతోందని భక్తులు మండిపడుతున్నారు. ఆలయంలో జరుగుతున్న పనులు, చేస్తున్న ఖర్చులు, ఇతర పాలనా వ్యవహారాలపై అధికారులు విచారణ చేపడితే వాస్తవాలు వెలుగు చూసే అవకాశముందని కోరుతున్నారు.

**ఏం జరుగుతోందంటే..?**

దాతలిచ్చే డబ్బులకు రసీదులు ఇవ్వకపోవడం, ఆ మొత్తాన్ని ఆలయ దస్త్రాల్లోనూ నమోదు చేయకపోవడంతో ఖర్చులకు లెక్కాపత్రం లేకుండా పోతోంది. ఈ అవకాశాన్ని ఆసరాగా చేసుకుని విరాళమిచ్చిన దాతే పని చేయిస్తున్నారని చెబుతూ.. ఆలయానికి చెందిన వ్యక్తులే అంతా నడిపిస్తున్నారు.విరాళం డబ్బుతో పాటు ఆలయ నిధులు సైతం కలిపి ఓచర్ విధానంలో నగదు ఖర్చు చేస్తున్నారు. పనులకు నాసిరకం సామగ్రి తీసుకొచ్చి.. బిల్లుల్లో అవకతవకలకు పాల్పడి జేబులు నింపుకొంటున్నారు. చివరగా ఓ శిలాఫలకంపై దాతల పేర్లు రాయించి నోరెత్తకుండా వారిని సంతృప్తి పరుస్తున్నారు.

**స్థానిక వ్యక్తులతో చేయిస్తున్నాం..**


అభివృద్ధి పనులకు అనుమతులు కోరుతుంటే చాలా సమయం పడుతోంది. అందుకే మా శాఖ ఇంజినీర్లకు చెప్పట్లేదు. దాతల విజ్ఞప్తి మేరకు ఎలాంటి టెండర్లు లేకుండా స్థానిక వ్యక్తులతో పనులు చేయిస్తున్నాం. ఈవోగా రూ.లక్ష వరకు ఓచర్ల రూపంలో ఖర్చు చేసే అధికారం నాకు ఉంది. అందుకు అనుగుణంగా బిల్లులు తెప్పించుకుని చెల్లింపులు చేస్తున్నాం. కేఎన్‌వీడీవీ ప్రసాద్, ఈవో, ఆదిత్యాలయం

# అలా పేరొచ్చింది!!

అక్కిరెడ్డిపాలెం : సాధారణంగా కాలనీలకు స్వాతంత్ర్య సమరయోధులు, రాజకీయ నాయకులు, దేవతల పేర్లు పెట్టడం మనం చూస్తుంటాం. కానీ, ఇందుకు భిన్నంగా విశాఖలో భారత్ హెవీ ప్లేట్ అండ్ వెసెల్స్ లిమిటెడ్ (బి.హెచ్.పి.వి) కార్మికులు తాము నిర్మించుకున్న కాలనీలకు తమ సంస్థ ఎండీగా పని చేసిన వ్యక్తుల భార్యల పేర్లు పెట్టుకున్నారు. బి.హెచ్.పి.వి. ఉద్యోగులు 1971లో తొలిసారి తుంగ్లాం రెవెన్యూ పరిధిలో సుమారు 31 ఎకరాలు కొనుగోలు చేసి ఫేజ్-1 కింద ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఎన్నో వ్యయప్రయాసలకోర్చి 1981లో సుమారు 328 ఇళ్లను పూర్తిచేశారు. ఆ ఇళ్ల ప్రారంభ సమయంలో అప్పటి బీహెచ్‌పీవీ ఎండీగా మన్సుఖని ఉన్నారు. ఆయన అందించిన సహకారానికి గుర్తుగా ఆయన సతీమణి షీలా పేరుతో షీలానగర్‌గా నామకరణం చేశారు. ఫేజ్-2లో భాగంగా 1984లో విశాఖ చినముషిడివాడ పంచాయతీలో సుమారు 58 ఎకరాలు కొనుగోలు చేశారు. 1994లో 500 ఇళ్లు పూర్తిచేశారు. ఈ ఇళ్ల ప్రారంభ సమయంలో అప్పటి బి.హెచ్.పి.వి. ఎండీగా కంచర్ల రాఘవయ్య సేవలందించారు. అంతకుముందు సంప్రదాయాన్నే ఇక్కడ కూడా కొనసాగించి రాఘవయ్య సతీమణి సుజాత పేరుతో సుజాతనగర్ ఏర్పాటు చేశారు.

ప్రస్తుతం సుజాతనగర్ నగరంలో ప్రముఖ వాణిజ్య కేంద్రంగా ఎదుగుతోంది. ప్రస్తుతం ఫేజ్-3 కింద సాలాపువానిపాలెం వద్ద మరో 36 ఎకరాల్లో ఇళ్ల నిర్మాణానికి ఇటీవల భూమి పూజ జరిగింది. ఈ కాలనీకి ఏ పేరుపెడతారనేది ఆసక్తిగా మారింది.

# శ్మశాన వాటికనూ వదల్లేదు..



హిరమండలం : ఖాళీ జాగా కనిపిస్తే చాలు అక్రమార్కులు చెలరేగిపోతున్నా రనేందుకు ఈ చిత్రమే నిదర్శనం. హిరమండలం పరిధి కిట్టాలపాడు గ్రామంలో శ్మశాన వాటిక నిర్వహణకు దశాబ్దాల కిందట స్థానికులు రెండున్నర ఎకరాలు కేటాయించారు. రెవెన్యూ దస్త్రాల్లోనూ ఇది నమోదైంది. శ్మశాన వాటికకు చుట్టుపక్కల ఉన్న భూమిని గ్రామానికి చెందిన కొంతమంది ఆక్రమించి సాగు చేసుకుంటున్నారు. ప్రస్తుతం కనీసం 30 సెంట్లు స్థలం కూడా లేదు. ఇటీవల శ్మశానానికి వెళ్లేందుకు రహదారి నిర్మాణానికి ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో పనులు చేపట్టేందుకు అధికారులు హద్దులు నిర్ణయించారు. కానీ ఇవేమీ పట్టించుకోకుండా అక్రమార్కులు సాగు చేసుకుంటున్నారు. దీనిపై ఉప తహసీల్దారు ప్రసాదరావు మాట్లాడుతూ పరిశీలించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

# వరికి జలసిరి



అనకాపల్లి : ఖరీఫ్ చివరిలో కాలం కలిసొచ్చింది. కొద్దిరోజుల క్రితం వరకు చినుకు జాడలేక చిన్నబోయిన రైతులకు మూడు రోజుల క్రితం కురిసిన వర్షాలు ఊపిరినిచ్చాయి. ఎగువ ప్రాంతాల్లోనూ సమృద్ధిగా కురిసిన వర్షాలతో అన్ని ప్రధాన జలాశయాలు నిండుకుండలా మారాయి. దీంతో జిల్లావ్యాప్తంగా అన్నిచోట్లా అన్నదాతలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. వరి నారుమళ్లు పోసుకుని పొలాలను దున్ని నాట్లు వేస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో జిల్లావ్యాప్తంగా సుమారు 55 వేల హెక్టార్లలో వరి సాగవుతుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. జూన్, జులై నెలల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో సీజన్ నత్తనడకన సాగింది. వర్షాధార భూముల్లో నారు ఎండిపోయింది. దాంతో ఇంతవరకు కేవలం 9,642 హెక్టార్లలోనే నాట్లు పూర్తయ్యాయి. ఇంకా 45 వేల హెక్టార్లలో నాట్లు వేయాల్సి ఉంది. ప్రస్తుతం రోజుకు 3 వేల హెక్టార్లలో నాట్లు వేస్తున్నారు. చీడికాడ, అనకాపల్లి, ఎస్.రాయవరం, వి.మాడుగుల, బుచ్చెయ్యపేట, చోడవరం, కె.కోటపాడు, నాతవరం, రావికమతంలో పనులు జోరుగా సాగుతున్నాయి. ఈనెలాఖరుకు మరో 30 వేల హెక్టార్లలో నాట్లు పడవచ్చని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

**తేరుకుంటున్న పంటలు:** వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనాల ప్రకారం వర్షాల కారణంగా జిల్లాలో 1,250 ఎకరాల్లో వరి పంట నీటమునిగింది. అనకాపల్లి ఆవఖండం, వాడ్రాపల్లిలో వరి, చెరకు తోటలు నీట మునిగాయి. ప్రస్తుతం కాలువల్లో నీరు తగ్గుముఖం పట్టడంతో ముంపు నుంచి కొద్దికొద్దిగా తేరుకుంటున్నాయని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు.

**2,734 మిల్లీమీటర్ల వర్షపాతం:** జిల్లాలో గత మూడు రోజుల్లో 2,734 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ విభాగం శాస్త్రవేత్తలు తెలిపారు. అత్యధికంగా కె.కోటపాడు మండలంలో 180 మి.మీ. వర్షం కురిసింది. 16 మండలాల్లో 100 మి.మీ. కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది. మూడు రోజుల్లో జిల్లాలో సరాసరి 113.9 మి.మీ.గా ఉంది. **పూర్తిస్థాయిలో నాట్లు- బి.మోహనరావు, వ్యవసాయశాఖ జిల్లా అధికారి** వచ్చేనెల 15 వరకు నాట్లు వేసుకోవచ్చు. ఈలోగా మరోసారి భారీ వర్షాలు పడితే సాధారణ విస్తీర్ణం వరకు నాట్లు పడే అవకాశాలు ఉన్నాయి. ముంపునకు గురైతే నీరు తీశాక పొటాష్ ఎరువులు వేసుకుంటే పంట త్వరగా కోలుకుంటుంది. నారు ముదిరితే, ఎద పద్ధతిలో వేసుకుంటే మేలు. యూరియా నిల్వలు రెండువేల టన్నుల వరకు ఉన్నాయి. బహిరంగ మార్కెట్లో అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటాం.

# రేషన్ లెక్క.. ఇక పక్కా!



నర్సీపట్నం : అనకాపల్లి ప్రాంతంలో పౌరసరఫరాల అధికారి ఇటీవల ఓ చౌక దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ-పోస్‌లోని సరకుల నిల్వ వివరాలను పరిశీలించారు. సెల్‌ఫోన్‌లోని యాప్‌లో ఉన్న వివరాలతో పోలిస్తే తేడా వచ్చింది. వెంటనే డీలరుపై 6ఎ కేసు నమోదు చేశారు. ఈ-పోస్‌ను స్వాధీనం చేసుకొని సమీపంలోని మరో డీలర్‌కు చౌక దుకాణం బాధ్యతలను అప్పగించారు. కూటమి ప్రభుత్వం పౌరసరఫరాల వ్యవస్థ ప్రక్షాళన దిశగా తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలిస్తోంది. రేషన్ డీలర్ల అవకతవకలకు చెక్ పెట్టేందుకు 'సివిల్ సప్లై ఇన్‌స్పెక్షన్' పేరుతో ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. సరకుల పంపిణీలోని అక్రమాలను నిరోధించేందుకు ఈ యాప్ ఉపకరిస్తోంది. పౌర సరఫరాల్లోని అన్ని స్థాయిల అధికారుల నుంచి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వరకు ఈ యాప్ సాయంతో రేషన్ దుకాణాల్లోని సరకుల నిల్వలను ఏ సమయంలోనైనా పరిశీలించవచ్చు.

**తప్పులు దాచిపెట్టడం కుదరదు:** సరకుల పంపిణీలో అవకతవకలను కప్పిపుచ్చడం ఇకపై సాధ్యం కాదు. గతంలో మాదిరి మొక్కుబడి తనిఖీలకూ వీల్లేదు. జిల్లాలో సుమారు 5 లక్షల మంది కార్డుదారులు ఉన్నారు. వీరికి వెయ్యి మంది డీలర్ల ద్వారా లక్షల క్వింటాళ్ల బియ్యం ప్రతి నెలా పంపిణీ అవుతోంది. గతంలోని మాన్యువల్ విధానంలో తప్పుల సర్దుబాటుకు ఆస్కారం ఉండేది. ప్రస్తుతం అధికారులు డిపో తనిఖీకి వెళ్లిన వెంటనే ఈ-పోస్‌ను తీసుకుంటున్నారు. అందులోని వివరాలు, యాప్‌లో ఉన్న ఆన్‌లైన్ వివరాలతో సరిపోలుస్తున్నారు. తేడాలుంటే అక్కడికక్కడే చర్యలకు ఉపక్రమిస్తున్నారు. తనిఖీల సమయంలోనే కార్డుదారులతో మాట్లాడి వారి అభిప్రాయాలను యాప్‌లో నమోదు చేస్తున్నట్లు నర్సీపట్నం పౌరసరఫరాల ఉప తహసీల్దారు చందన రేఖ పేర్కొన్నారు. సరకుల సరఫరా, తూకం సక్రమంగా ఉన్నదీ, లేనిదీ, డీలరు ప్రవర్తనకు సంబంధించి పలు అంశాలపై కార్డుదారుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుంటున్నట్లు చెప్పారు.

# తవ్విందంతా తేల్చేద్దాం!



తిరుపతి : ప్రకృతి వనరులను దోపిడీ చేయడంలో వైకాపా నాయకులు పీహెచ్‌డీ చేశారు.. జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్‌జీటీ) ఆదేశాలను రీచ్‌లలోనే పాతేసి అక్రమంగా ఇసుక తవ్వకాలకు పాల్పడ్డారు. నిబంధనలు అతిక్రమించి రేవుల్లోకి రోడ్డు వేసి యంత్రాలతో తవ్వి కోట్లాది రూపాయలు వెనకేసుకున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో ఈ ఉల్లంఘనలపై ఏడాదిన్నర క్రితమే అధికారులు పరిశీలించినా పూర్తి వాస్తవాలు నివేదించలేదు. దీంతో మరోసారి ఏపీ స్పేస్ అప్లికేషన్స్ సెంటర్ (ఏపీ శాక్) నుంచి తీసుకున్న చిత్రాలను ప్రభుత్వం గనుల శాఖకు పంపింది. వీటి ఆధారంగా క్షేత్రస్థాయిలో మరోసారి పరిశీలించాలని ఆదేశించింది. ఇప్పటికైనా అక్రమ తవ్వకాలపై నిజాలను వెల్లడిస్తే భవిష్యత్తులో నాయకులెవరూ ఇంతలా బరితెగించరు.

జగన్ పాలనలో తొలుత ఏపీ ఖనిజాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఇసుక తవ్వకాలు, విక్రయాలు జరిగాయి. 2021 మే నుంచి ప్రైవేటు సంస్థలకు ఈ బాధ్యతలు అప్పగించారు. రీచ్‌లలో మీటరు లోతు వరకే తవ్వకాలు జరపాలని అప్పట్లో పేర్కొన్నారు. హెక్టారుకు 10 వేల క్యూబిక్ మీటర్లు మాత్రమే తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ నిబంధనలన్నీ గుత్తేదారు సంస్థలు ఉల్లంఘించాయి. ఈ వ్యవహారంలో అంతిమ లబ్ధిదారులు వైకాపా నేతలే.

**కొల్లగొట్టారిలా..**

చిత్తూరు జిల్లాలో ప్రధానంగా నీవా పరీవాహకంలోని గంగాధర నెల్లూరు, చిత్తూరు నియోజకవర్గాల్లో, కుశస్థలి నది ప్రవహించే నగరి, బాహుదా, చిన్న చిన్న వంకలు ప్రవహించే పుంగనూరులో అక్రమ తవ్వకాలు జరిగాయి. కొ్త్రకోన, నందనూరు, ముక్కళతూరు, ముత్తుకూరు, బీఎన్‌ఆర్‌పేట, అనంతాపురం, ఆనగల్లు, తదితర రీచ్‌ల్లో గ్రావెల్‌తో రోడ్డు వేసి మరీ ఇసుకను తీశారు. ప్రతి రేవులోనూ లక్ష-1.50 లక్షల టన్నుల ప్రకృతి సంపదను కొల్లగొట్టారు.

**అరణియార్‌ను గుల్ల చేసి**

తిరుపతి జిల్లా నాగలాపురం మండలంలోని అరణియార్‌లో దోపిడీపై అప్పట్లో వరుసగా 'ఈనాడు'లో కథనాలు వచ్చినా తవ్వకాలే చేయడంలేదని, ఫొటోలన్నీ పాతవని జగన్ సర్కార్ బుకాయించింది. అప్పట్లో ఈ అక్రమాలన్నీ వైకాపాలో 'పెద్దాయన'గా ముద్రపడ్డ వ్యక్తి నేతృత్వంలోనే జరిగాయి.

**తూతూమంత్రంగా పరిశీలించి..**

వైకాపా హయాంలోనే ఈ దోపిడీపై అధికారులు విచారించినా.. గనుల శాఖ సంచాలకుడు వెంకటరెడ్డి ఒత్తిడితో వాస్తవాలు నివేదించలేదు. తూతూమంత్రంగా పరిశీలించి అనుమతించిన రీచ్‌లలోనే తవ్వకాలు జరిగాయని పేర్కొన్నారు. తాజాగా 15 రోజుల కిందట గనుల శాఖ అధికారులకు ఆయా రీచ్‌లకు సంబంధించి ఏపీ శాక్ నుంచి ఛాయాచిత్రాలు వచ్చాయి. తవ్వకాలకు ముందు ఎలా ఉంది? ఆ తర్వాత ముఖచిత్రం ఎలా ఉంది? ఎన్ని లక్షల టన్నులు తవ్వి ఉండవచ్చు? అని వివరాలు పంపారు. గనులు, భూగర్భ జలాలు, జలవనరులు, రెవెన్యూ, తదితర శాఖల అధికారులు వీటన్నింటినీ మరోసారి క్షేత్రస్థాయిలో పరిశీలించి సరిపోల్చుకుంటారు. ఇప్పుడైనా నివేదికలో నిజాలు మాత్రమే రాస్తారా? లేదా? అన్నది చూడాలి.

# నిఘా కళ్లు.. ఛేదిస్తున్నాయ్ కేసులు

కర్నూలు : నేరాల నియంత్రణ, కేసుల దర్యాప్తులో సీసీ కెమెరాలు పోలీసులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఈ నేపథ్యంలో వీటి ఏర్పాటుపై పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టారు. ప్రజల్లో కూడా వీటి ఉపయోగాలపై అవగాహన పెరిగింది. రాష్ట్రంలో 2013లో ఏపీ ప్రజా భద్రతా చట్టం అమల్లోకి వచ్చింది. వంద మంది పోగయ్యే ప్రాంతంలో సీసీ కెమెరాలు ఉండాలన్నది ఈ చట్టం ఉద్దేశం. దీని అమలులో గత తెదేపా ప్రభుత్వం ముందడుగు వేసింది. సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. పోలీసు అధికారులు ఈ చట్టంపై విస్తృతంగా అవగాహన కల్పించి నిఘా కెమెరాలను ఏర్పాటు చేయించటం ప్రారంభించారు. చాలామంది వాణిజ్య కేంద్రాలు, అపార్ట్‌మెంట్లతో పాటు ఇళ్లలో కూడా ఏర్పాటు చేసుకుంటున్నారు.

**3.5 నెలల్లో 5 వేల కెమెరాలు**

కర్నూలు నగరంతో పాటు అన్ని పట్టణాల్లో స్థానిక సంస్థలు.. ప్రధాన



రహదారులు, ముఖ్య కూడళ్లలో అత్యాధునిక సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నాయి. ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ప్రత్యేక చొరవతో జూన్ 18వ తేదీ నాటికి మూడున్నర నెలల్లో 5 వేల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. జిల్లాలో కార్పొరేట్ సంస్థలు, ఎంపీ నిధులు, స్థానిక సంస్థల సహకారంతో మరో 5 వేల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించేందుకు పోలీసులు కృషి చేస్తున్నారు.

**దొరికిపోతున్న నేరగాళ్లు**

వివిధ కేసుల్లో నేరగాళ్లను గుర్తించడంలో సీసీ కెమెరాలు పోలీసు అధికారులకు ఎంతగానో ఉపకరిస్తున్నాయి. చిల్లర దొంగలు మొదలుకొని హంతకుల వరకు సీసీ కెమెరాల కంటికి చిక్కి కటకటాల పాలవుతున్నారు. ఇటీవల కాలంలో పలు ప్రధాన కేసుల్లో నేరగాళ్లను సీసీ కెమెరా సాయంతో పట్టుకున్నారు.

ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన గద్వాలకు చెందిన తేజేశ్వర్ హత్య కేసును ఛేదించడంలో కర్నూలు జిల్లా పరిధిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాలు కీలకంగా మారాయి.

గతంలో మ్యాట్రిక్ సంస్థ ఏర్పాటు చేసినవి : 722

కర్నూలు నగరం, ఆదోని పట్టణంలో ప్రత్యేకంగా ఏర్పాటైనవి : 221 సీసీ కెమెరాలు

పోలీసు స్టేషన్‌లలో అమర్చినవి : 405

ఫ్యాక్షన్, సున్నిత, సమస్యాత్మక గ్రామాల్లో : 227

జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఉన్నవి : 1,664

కొత్తగా ఏర్పాటు చేసినవి : 4985

# ట్రిపుల్ ఐటీ కళాశాల

కర్నూలు: కర్నూలు నగరంలో జగన్నాథగట్టుపై కొలువుదీరిన ట్రిపుల్ ఐటీ కళాశాల (డీఎం)లో సీట్లన్నీ భర్తీ అయ్యాయి. ఇక్కడ మొత్తం 332 సీట్లు ఉండగా ఈసారి ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 221 మంది ప్రవేశం పొందారు.. మిగిలిన 111 మంది ఇతర రాష్ట్రాలకు చెందిన వారు ఉన్నారు. అబ్బాయిలు 247 మంది, అమ్మాయిలు 85 మంది ఉన్నారు. జేఈఈ మెయిన్స్‌లో వచ్చిన ర్యాంకుల ఆధారంగా సీట్లు కేటాయిస్తారు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఉత్తీర్ణులైన 27 మంది విద్యార్థులూ ఇందులో చేరారు.

**డ్యూయల్ కోర్సులకు ఆదరణ**

కంప్యూటర్ సైన్స్‌లో 70, ఈసీఈ 60, మెకానికల్ ఇంజినీరింగ్ 60, ఎ.ఐ.లో 60 సీట్లు.. కంప్యూటర్ సైన్స్ డ్యూయల్ డిగ్రీ 20, ఈసీఈ డ్యూయల్ డిగ్రీ 20, మెకానికల్ డ్యూయల్ డిగ్రీ 20 చొప్పున సీట్లు ఉన్నాయి. వీటికి అదనంగా సూపర్ న్యూమరరీ కేటగిరీ కింద 22 మంది విద్యార్థులకు అవకాశం కల్పించారు.

కంప్యూటర్ సైన్స్‌లో 37,649, ఈసీఈలో 49,973 ర్యాంకు లోపు, మెకానికల్ 65,720, ఏఐలో 46,086 ర్యాంకు లోపు వచ్చినవారు



సీట్లు పొందగలిగారు. ఏఐలో 64 మంది, సీఎస్ 90, ఈసీఈ 88, మెకానికల్‌లో 90 మంది విద్యార్థులు చేరారు.

**నార్వేలో చదువుకొనే అవకాశం**

జగన్నాథగట్టుపై 151 ఎకరాల్లో రూ.254 కోట్లతో కళాశాల నిర్మించారు. ప్రతి కోర్సులో ఆయా రంగాలకు చెందిన పలు ఉపకరణాల డిజైన్, తయారీలకు సంబంధించిన నైపుణ్యాలపైనా విద్యార్థులకు శిక్షణ ఇస్తారు. కాలానుగుణంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పలు ఉపకరణాల తయారీపై అవగాహన కల్పించడం ఈ సంస్థ ప్రత్యేకత.

నార్వే దేశ విశ్వవిద్యాలయంతో ఒప్పందం కుదుర్చుకున్న నేపథ్యంలో ఎలాంటి అదనపు రుసుం లేకుండానే విద్యార్థులు నార్వేలో ఆరు నెలల నుంచి ఏడాదిపాటు చదువుకునే అవకాశం కల్పిస్తున్నారు.

బీటెక్ చదువుతూ ఎంబీఏ చేయొచ్చు

బీటెక్ చేసిన తర్వాత ఐఐఎంలో ఎంబీఏ చేసేందుకు పలువురు విద్యార్థులు ఆసక్తి చూపుతుంటారు. ఈ నేపథ్యంలో బీటెక్‌తోపాటు ఎంబీఏ చదువుకునేలా ప్రత్యేక వెసులుబాటు కల్పించారు. రెండేళ్ల ఎంబీఏ కోర్సులో ఏడాది కోర్సు ఇంజినీరింగ్ చదువుతూనే పూర్తి చేయొచ్చు. ఐఐఎం సీటు కోసం ప్రత్యేకంగా మరో పరీక్ష రాయాల్సిన అవసరం లేదు. ఇంజినీరింగ్‌తోపాటు ఒక సంవత్సరం ఎంబీఏ పూర్తి చేసిన తరువాత సర్టిఫికెట్ ఇస్తారు. ఎంబీఏ రెండో సంవత్సరం కోర్సును విద్యార్థులు తమకు నచ్చిన సమయంలో ఎప్పుడైనా పూర్తిచేసుకునే వెసులుబాటు కళాశాలలో ఉందని ప్రవేశాల విభాగం ఇన్‌ఛార్జి ఆచార్య కృష్ణనాయక్ తెలిపారు. సీట్లు పొందిన సీఎస్ విద్యార్థులు ఈనెల 21న, మెకానికల్, ఏఐ విద్యార్థులు 22న, ఈసీఈ విద్యార్థులు 23న తమ ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాల్సి ఉంది. సమగ్ర వివరాలను సంస్థ అంతర్జాల చిరునామా లో అందుబాటులో ఉంచామన్నారు.

# అంతర్గతదారులంటే.. అంత చులకనా!!

గురుద్వారా : ఒక్కసారిగా చూస్తే భూకంపం వచ్చిందా... భూమి రెండుగా చీలిపోయిందా అన్నట్లు ఉంటుందక్కడ. అడుగేస్తే రాళ్లు గుచ్చుకుపోతాయి. జాగ్రత్తగా రోడ్డుపక్కనే వెళ్దామంటే వాహనాల చక్రాల రాపిడికి గాల్లో లేచొచ్చి తూటాల్లా తగులుతాయి. పగలు దారిని చూసుకుంటూ ద్విచక్ర వాహనంపై నెమ్మదిగా వెళ్లినా..ఎక్కడో ఒక చోట అదుపు తప్పి పడిపోయేంత దారుణం. రాత్రి వేళల్లోనైతే ముచ్చెమటలు పడతాయి. చిన్నారులు, వృద్ధులు తప్పనిసరై ఇటుగా వస్తే గుండెలు చేత్తో పట్టుకోవాల్సిందే. ఇంత భయానక పరిస్థితికి కారణమైన దారి ఎక్కడో కాదు...విశాఖ నగరంలో ఉంది. సీతమ్మధార వుడా కాంప్లెక్స్ సమీపం నుంచి టీపీటీ కాలనీ ఆంజనేయ స్వామి ఆలయానికి వెళ్లే మార్గంలో భూగర్భ డ్రైనేజీ (యూజీడీ) పనుల నిమిత్తం రెండు నెలల కిందట తవ్వేశారు. తరువాత గోతులు పూడ్చేందుకు కంకర రాళ్లు వేసి చదును చేయకుండా చేతులు దులిపేసుకున్నారు. పూర్తిగా పనులు కూడా చేయకపోవడంతో నిత్యం వందలాది మంది వణికిపోతూ ముందుకు సాగుతున్నారు. ఇంతగా సమస్య వేధిస్తున్నా





స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ప్రధాన రహదారులను బాగు చేస్తున్న అధికారులు.. అంతర్గతమార్గాలు దారుణంగా మారినా విస్మరించడంపై విమర్శలొస్తున్నాయి.


**కాపాడాలని వచ్చే.. గోతిలో చిక్కే**

ఆపద సమయంలో కాపాడేందుకు వచ్చిన అంబులెన్సు గోతిలో కూరుకుపోయి ముందుకు కదల్లేకపోయింది. విశాఖ నగరంలోని సుజాతనగర్ సమీప వెంకటాద్రినగర్ రెండో వీధిలో ఉంటున్న ఓ వ్యక్తి ఆరోగ్యం విషమించడంతో మంగళవారం తెల్లవారుజామున కుటుంబసభ్యులు ఫోన్ చేయగా 108 వాహనం వచ్చింది. అయితే... ఇంటి సమీపంలో అధ్వానంగా ఉన్న మట్టి రోడ్డులోని గోతిలో అది కూరుకుపోయింది. ఎంత ప్రయత్నించినా బయటకు రాలేదు. దీంతో బాధితుడిని కుటుంబ సభ్యులు కారులో ఆసుపత్రికి తరలిం చారు. కొన్నేళ్లుగా గోతులమయంగా మారిన రోడ్డులో నిత్యం నరకం అనుభవిస్తున్నామని కాలనీ వాసులు వాపోయారు. అత్యవసర సమయాల్లో అంబులెన్సులు కూడా రాలేకపోతే ప్రజల ప్రాణాలకు భరోసా ఎక్కడుందని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గోతుల దారులను బాగు చేయాలని కోరుతున్నారు.

# భూములు కొనరు.. బాధలు కనరు..

భీమవరం : 'అప్పులు పుట్టక, సాగుకు అవసరమైన ఖర్చుల కోసం ఎక్కువ వడ్డీకి బయట నుంచి అప్పులు తెస్తున్నాం. భూమి అమ్మకాలు కొనుగోళ్లు లేక పిల్లల పెళ్లిళ్లు, చదువులకు ఇబ్బందులొ స్తున్నాయి. నిషేధిత జాబితాలో ఉండటంతో సగం ధర కూడా రావడం లేదు'. ఇవీ జిల్లాలో ఇనామ్ భూముల రైతుల ఆవేదన. జీవనోపాధికి కేటాయించిన భూములపై 2019లో అప్పటి తెదేపా ప్రభుత్వం ఆర్డినెన్స్ తెచ్చినా గత వైకాపా ప్రభుత్వం విస్మరించడంతో అవసరానికి ఆసరాగా లేకుండా పోయాయి. జిల్లాలో పెంటపాడు, ఉమామహేశ్వరం, కాళీపట్నంలలో సుమారు 8500 ఎకరాల ఇనామ్ భూములున్నాయి. వీటి రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో భూవిలువ మదింపు లేకపోవడంతో కుటుంబ అవసరాల కోసం ఉన్న భూములను మార్కెటు ధర కంటే తక్కువకు విక్రయిస్తున్నారు. మొగల్తూరు, పేరుపాలెం తదితర ప్రాంతాల్లో ఎకరం రూ.50 లక్షల నుంచి రూ.కోటి ధర పలుకుతుండగా పక్కనే ఉన్న ముత్యాలపల్లి, కాళీపట్నం భూములకు రిజిస్ట్రేషన్ లేకపోవ డంతో ఎకరం రూ.30 లక్షల నుంచి 35 లక్షలకు విక్రయించాల్సి వస్తోంది. అవసరాన్ని సాకుగా చూపించి ఒక్కోసారి అనుకున్న ధర కూడా చెల్లించడం లేదని, ఆడపిల్లలకు పసుపు కుంకుమలుగా ఇచ్చిన భూములకు రిజిస్ట్రేషన్లు జరగకపోవడంతో భార్యాభర్తల మధ్య తగాదాలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**వైకాపా నిర్లక్ష్యంతో..** రాజరిక, జమిందారీ వ్యవస్థ రద్దు కావడంతో 1956లో అప్పటి ప్రభుత్వం ఇనాం చట్టాన్ని తెచ్చి, అర్హులైన వారికి రైత్వారీ పట్టాలు మంజూరు చేసింది. తర్వాత 2013లో ప్రభుత్వం ఇనాం ల్యాండ్ రద్దు చట్టానికి సవరణ చేసింది. ప్రాస్పెక్టివ్‌కు బదులు రెట్రాస్పెక్టివ్ అని చట్టంలో పేర్కొనడంతో 1956 నుంచి 2013 వరకు జారీ చేసిన రైత్వారీ పట్టాల భూములు నిషిద్ధ జాబితాలోకి చేరాయి. సమస్యను పరిష్కరించడానికి



2019లో అప్పటి తెదేపా ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ఇనామ్స్(ఎబాలిషన్ అండ్ కన్వర్షన్ ఇన్‌టూ రైత్వారీ) అమెండ్‌మెంట ఆర్డినెన్స్-2019ని తెచ్చింది. దీని ప్రకారం 1957 నుంచి 2013 మధ్య ఇచ్చిన పట్టాలు ప్రాస్పెక్టివ్(చెల్లుబాటు) కావాలి. ఈ అంశం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందినది కావడంతో చట్ట సవరణకు కేంద్రం ఆమోదించింది. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో గత వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. ఫలితంగా వేల మంది వారికి సంక్రమించిన ఇనాం భూములను అవసరాలకు అమ్ముకోలేక ఇబ్బందులు పడుతున్నారు. విషయం ప్రభుత్వం దృష్టిలో ఉంది, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటుందని డీఆర్వో వెంకటేశ్వరరావు తెలిపారు. 'కాళీపట్నంలో 70 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నాం. పట్టాదారు పాస్‌బుక్, టైటిల్ డీడ్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. భూములున్నా పిల్లల చదువులకు, కుటుంబ అవసరాలకి అప్పులు చేయాల్సి వస్తోంది' అని రైతులు వాపోతున్నారు. అమ్మాయి పెళ్లి చేసేందుకు ఉన్న ఎకరం భూమిని అమ్మేందుకు ప్రయత్నించగా నిషిద్ధ జాబితాలో ఉండటంతో తక్కువకు అడిగారు. కుదవ పెడదామన్నా, బ్యాంకు రుణం కోసం ప్రయత్నించినా ఫలితం లేదు. అధిక వడ్డీకి అప్పు తెచ్చి అమ్మాయి వివాహం చేశాను' అని ఉమామహేశ్వరానికి చెందిన శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు.

# 100 రోజులు.. రూ.1952 కోట్లు



అనంతపురం : ఉమ్మడి అనంత జిల్లా హంద్రీనీవా సుజల స్రవంతి(హెచ్‌ఎన్ఎస్ఎస్) ప్రాజెక్టులో ఇదొక రికార్డు. వంద రోజుల్లో నిర్దేశిత లక్ష్యాన్ని ఛేధించడం విశేషం. రూ.19,52 కోట్ల అంచనా వ్యయంతో పనులు పూర్తి చేసిన చరిత్ర ఇది. కూటమి ప్రభుత్వం సాధించిన ఘన విజయంగా నమోదైంది. సీమ జిల్లాలకే తలమానికమైన హంద్రీనీవా ప్రధాన కాలువలో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. తొలి దశలోనే కాదు.. రెండో దశ ప్రధాన కాలువలోనూ కృష్ణా జలాల ప్రవాహం వేగంగా ముందుకు సాగుతోంది. పుంగనూరు ఉప కాలువకు (పీబీసీ) రెండు రోజుల క్రితమే నీటి విడుదల చేశారు. త్వరలోనే మడకశిర ఉప కాలువకు (ఎంబీసీ) నీరు ఇవ్వనున్నారు. ఇదే క్రమంలో అనంత, శ్రీసత్యసాయి జిల్లాల పరిధిలో ఎక్కడికక్కడి చెరువులను నింపే కీలక ప్రక్రియకు శ్రీకారం చుడుతున్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పనులు వేగంగా పూర్తి చేశామని.. సాఫీగా నీటి ప్రవాహం సాగుతోందని హెచ్‌ఎన్ఎస్ఎస్ ఎస్ఈ రాజా స్వరూప్‌కుమార్ పేర్కొన్నారు.

**సరిహద్దులో 2,170 క్యూసెక్కులు**

గత నెల 17న నంద్యాల జిల్లా మల్యాల పంప్‌హౌస్ నుంచి హంద్రీనీవాకు నీటి విడుదల మొదలైంది. ప్రస్తుతం అక్కడ 2,818 క్యూసెక్కుల మేర ఎత్తి పోస్తున్నారు. అనంత జిల్లా సరిహద్దుకు 2170 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది. తొలి దశ ప్రధాన కాలువ పరిధిలో ఉన్న జీడిపల్లి జలాశయానికి ఇప్పటి దాకా 4.537 టీఎంసీలు చేరాయి. ప్రస్తుతం 1,822 క్యూసెక్కుల ప్రవాహం చేరుతోంది. గడిచిన ఇరవై రోజుల్లో ఏకంగా 3.683 టీఎంసీలు పీఏబీఆర్‌కు ఇవ్వడం రికార్డు. ఈ జలాశయానికి ఇప్పటికీ 1,782 క్యూసెక్కులు పారుతున్నాయి. జీడిపల్లి జలాశయం నుంచి రెండో దశ ప్రధాన కాలువకు ఈనెల 17న నీటిని విడుదల చేసిన సంగతి తెలిసిందే. తాజాగా ఇక్కడి నుంచి 787 క్యూసెక్కుల మేర ప్రవహిస్తున్నాయి. అదే రోజు చెర్లోపల్లి నుంచి పీబీసీకి నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం 330 క్యూసెక్కులు వెళ్తున్నాయి.

# రూ.అరకోటి సామగ్రి ఆరుబయటే



హిందూపురం : శ్రీకంఠపురంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా కేంద్రం (ఐటీఐ)లో గదుల కొరతతో దాదాపు రూ.అరకోటి విలువైన సామగ్రి నిరుపయోగంగా ఉంది. ఈ ఫర్నీచర్ ఎండకు ఎండి, వానకు తడుస్తుండటంతో త్వరగా పాడైపోయే అవకాశాలు కనిపిస్తున్నాయి. 2008లో ప్రారంభమైన పారిశ్రామిక శిక్షణా కేంద్రం పట్టణంలోని శాంతినగర్‌లో అద్దె భవనంలో కొనసాగేది. అక్కడి నుంచి లేపాక్షి సమీపంలో వీజెడ్‌పీ ఉన్నత పాఠశాల వద్ద ఉన్న బీసీ బాలుర వసతి గృహంలోకి మార్చారు. మడకశిర, పెనుకొండ నుంచి కళాశాలకు వచ్చే విద్యార్థులకు దూరం కావటంతో గత సంవత్సరం డిసెంబరులో మళ్లీ పట్టణంలోని శ్రీకంఠపురంలో ఉన్న ఝాన్సీలక్ష్మీబాయి పాఠశాలలోకి తరలించారు.

**నాలుగు గదులే కేటాయింపు**

ఝాన్సీలక్ష్మీబాయి పాఠశాలలోని 4 గదులు ఐటీఐకి కేటాయించగా అవి కనీసం తరగతుల నిర్వహణకు సైతం సరిపోవటం లేదు. దీనివలన విద్యార్థులు కూర్చొనే గదుల్లో సగం గది వరకు ఫర్నీచర్ ఉంచారు. దీనివలన విద్యార్థులు తరగతి గదిలో కూర్చోవాలన్నా, పాఠాలు బోధించేందుకు అధ్యాపకులు ఇబ్బందులు పడుతున్నారు. అందువలన ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకొని ఐటీఐ కళాశాలకు విశాలభవనం సమకూర్చాల్సిన అవసరం ఉంది. లేదంటే ఈ ఫర్నీచర్ దెబ్బతినే అవకాశం ఉంది.

**ఎమ్మెల్యే బాలకృష్ణ దృష్టికి తీసుకెళ్లాం**

మురళీధర్, ఐటీఐ ప్రిన్సిపల్

ఐటీఐ కళాశాల నిర్వహణకు సరిపడే భవనం కావాలని ఎమ్మెల్యే బాలకృష్ణ దృష్టికి తీసుకెళ్లాం.. నిధులు మంజూరు చేయిస్తామని, అంతవరకు తరగతుల నిర్వహణకు షెడ్లు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు.

# తెలిసి ఆత్రం.. కలిసి కుతంత్రం!!



విశాఖపట్నం : ఓ లేఅవుట్ మధ్యలో ప్రభుత్వ పోరంబోకు స్థలంలో రోడ్డు ఉంది. ఆ రోడ్డుపైనా కొందరు నకిలీ ప్లాట్ల నెంబర్లు, నకిలీ రెవెన్యూ సర్వే నెంబరుతో పాగా వేశారు. అధికారుల అండదండలతో ఖాళీ స్థలాల పన్నులు (వీఎల్‌టీ) పొంది, ప్లాన్ అనుమతులు తీసుకుని నిర్మాణాలు సైతం చేపట్టారు. ఈ ప్రభుత్వ భూమి విలువ అక్షరాలా రూ.10 కోట్ల పైమాటే. ఈ తతంగమంతా సాగటానికి ప్రణాళిక విభాగంలోని ఓ కీలక అధికారి వ్యూహాలే కారణమని సమాచారం.

**అలా ప్లాట్లుగా:** జీవీఎంసీ 8వ వార్డులో హిందుస్థాన్ షిప్ యార్డు లేఅవుట్ ఫేజ్1, 2 కింద ప్లాట్లు అభివృద్ధి చేశారు. సర్వే నెంబరు 301లో ప్రభుత్వ రాస్తా(రోడ్డు) కింద 55 సెంట్లు లేఅవుట్‌లో ఉంది. ఈ రోడ్డు 650 అడుగుల పొడవు, 60 అడుగుల వెడల్పుతో ఉన్నట్లు రికార్డుల్లో ఉంది. అయితే.. దారిని ఒక్కొక్కటి 267 గజాల చొప్పున ఆరు ప్లాట్లుగా కొందరు మార్చారన్న ఆరోపణలున్నాయి. ఇందులో ఒక ప్లాటులో భవన నిర్మాణం జరిగిపోగా, మరో స్థలంలో నిర్మాణం తుది దశలో ఉంది. మిగిలిన నాలుగు ప్లాట్లు ఖాళీగా ఉన్నాయి.

**నకిలీ బాగోతం వెలుగులోకి:** ప్రభుత్వ దారికి ఒకవైపు ప్లాట్ నెంబరు 210, మరోవైపు 211 ప్లాట్ నెంబర్లు ఉండగా మధ్యలోని పోరంబోకు భూమికి 211ఏ పేరుతో నకిలీ ప్లాటు సృష్టించారు. 2024లో ఈ ప్లాట్‌కు వీఎల్టీ (ఖాళీ స్థలం పన్ను) కోసం జీవీఎంసీని ఆశ్రయించారు. అప్పటి జీవీఎంసీ సర్వేయర్ సైతం ఇది జిరాయితీ భూమిగా నివేదిక ఇచ్చారు. దీంతో రెవెన్యూ విభాగ అధికారులు ఖాళీ స్థలం పన్ను విధించారు. ఆ తర్వాత 211ఏ నకిలీ ప్లాటులో ప్లాన్ కోసం దరఖాస్తు చేశారు. అప్పటి ప్లానింగ్ సెక్రటరీ, ఇన్‌ఛార్జి అడ్మిన్‌గా ఉన్న ఓ అధికారి ఈ దస్త్రాలు ముందుకు కదిపారు. మధురవాడ జోన్-2 ఏసీపీగా తాజాగా బాధ్యతలు చేపట్టిన శాస్త్రి శబ్నాన్, డీసీపీలు నాడు ఆమోద ముద్ర వేశారు. ఈ భవన నిర్మాణం ప్రస్తుతం పూర్తి దశలో ఉండగా నకిలీ బాగోతం వెలుగులోకి వచ్చింది. **అందులో ప్రభుత్వ భూమిగానే:** నకిలీ సర్వే నెంబరు, ప్లాటు నెంబరు సృష్టించారన్న ఆరోపణల నేపథ్యంలో ఇటీవల మధురవాడ నుంచి బదిలీపై వెళ్లిన ఏసీపీ తిరుపతిరావు ఆ ప్లాటు సర్వే చేయాలని టౌన్ సర్వేయర్‌ను ఆదేశించారు. ఆ నివేదిక వచ్చింది. ఇందులో వివాదాస్పదమైన ప్లాటు నెంబరు 211ఏ.. అనుమతులిచ్చిన లేఅవుట్ సర్వే నెంబర్లలో లేదని, ప్రభుత్వ పోరంబోకు రాస్తా (దారి)గా సర్వే నెంబరు 301లో ఉందని నివేదిక ఇవ్వడంతో అక్రమాల బాగోతం నిజమేనని తేలింది. తాజాగా సర్వేయర్ ఇచ్చిన నివేదిక ఆధారంగా కొన్ని ప్లాట్లు ప్రభుత్వ భూమిలో ఉన్నాయన్నారు. ఈ రాస్తా స్థలాలను స్వాధీనం చేసుకుని, అక్రమ నిర్మాణాలు కూల్చేయాలని పలువురు కోరుతున్నారు.

# వదిలేశారు.. ముంచేశారు

ఉండి: డెల్టా ఆధునికీకరణకు శ్రీకారం చుట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం పదేళ్లు పాలించినా.. సగం పనులను కూడా పూర్తి చేయలేకపోయింది. అప్పటి పాలనను గుర్తు చేసింది వైకాపా ప్రభుత్వం. అభివృద్ధి మాట ఎలా ఉన్నా.. కాలువల నిర్వహణ (ఓఅండ్ఎం) పనులకూ నిధులివ్వ లేదు. ఆ కారణంగానే వర్షం వస్తే చాలు ఎక్కడ వరిచేలు ముంపుబారిన పడతాయో..? ఎక్కడ ఏ కాలువ గట్టు కొట్టుకుపోతుందోననే ఆందోళన అన్నదాతలను వెంటాడుతోంది. డెల్టాలో 29 మండలాల్లో 3.29 లక్షల ఎకరాల్లో వరి, మరో 2 లక్షల ఎకరాల్లో చేపలు, రొయ్యల చెరువులు న్నాయి. వరికి ఎకరానికి రూ.350, ఆక్వాకు రూ.500 చొప్పున



ఏడాదికి రూ.21.51 కోట్ల నీటితీరువా వసూళ్లు కావాలి. సాగు, మురుగు కాలువల నిర్వహణ పనులకు ఏడాదికి రూ.22-23 కోట్ల వరకు నిధులు కేటాయించాలి. భూరీసర్వే పేరుతో వైకాపా ప్రభుత్వం వీటి వసూళ్లను గత మూడేళ్లు నిలిపేసింది. 2023 వేసవిలో ఆ నిధుల కోసం ఆర్నెళ్లు జల వనరుల శాఖ బ్యాంకు ఖాతాల్లో వెతికినా చిల్లిగవ్వ లేదు. దీంతో ఆ ఏడాది కాలువల్లో పూడికతీత, గట్లు పటిష్టపరచడం, లాకులు, వియర్ల పునర్నిర్మాణం తదితర పనుల వైపు కన్నెత్తి చూడలేదు. కూటమి ప్రభుత్వం కాలువల ప్రక్షాళన నూరుశాతం చేయగలిగితేనే వ్యవసాయానికి మనుగడ.

# ఆపలేమా దోమ కాటు

బుట్టాయగూడెం : మలేరియా, డెంగీ జ్వరాల వ్యాప్తికి కారకాలైన దోమల కాటు నుంచి రక్షణ పొందేందుకు వినియోగించే దోమ తెరల కోసం మన్యం గ్రామాల్లో ఎదురు చూస్తున్నారు. 2017లో అప్పటి తెదేపా ప్రభుత్వం 2.50 లక్షల దోమ తెరలను పంపిణీ చేసింది. అప్పట్లో మన్యంలోని మండలాలతో పాటు సమీపాన ఉన్న కొయ్యలగూడెం, టి.నరసాపురం, గోపాలపురం మండలాల్లో వీటిని అందజేశారు. ఆ తరువాత నాలుగేళ్ల కిందట మరో 2.50 లక్షలు పంపిణీ చేశారు. ప్రభుత్వం పంపిణీ చేసే దోమ తెరలను ప్రత్యేకించి తయారు చేస్తారు. దారంలోనే రసాయనాలను కలిపి తెరలను రూపొందిస్తారు. దీంతో తెరల మీద వాలే దోమ నశిస్తుంది. మనిషికి ఎటువంటి హానీ కలగదు. థైవాన్ వంటి దేశాల్లో తయారైన వీటిని మన దేశానికి దిగుమతి చేసుకుంటున్నారు.

**పెరుగుతున్న కేసులు..** ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున దోమల వ్యాప్తి పెరుగుతోంది. అదే రీతిన మలేరియా కూడా విజృంభిస్తోంది. కేసుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. దోమ తెరలు పంపిణీ చేస్తే దోమల కాటు నుంచి తప్పించుకునేందుకు ఎంతో ఉపయోగపడతాయని పలువురు కోరుతున్నారు. గతంలో ఇచ్చిన దోమ తెర తమకు బాగా ఉపయోగపడిందని చింతలగూడేనికి చెందిన మాల్చి మల్లేశ్వరి తెలిపారు. దోమ తెరల కోసం ప్రతిపాదనలు పంపామని, రాగానే పంపిణీకి చర్యలు తీసుకుంటామని జిల్లా మలేరియా నివారణాధికారి పీఎస్ఎస్ ప్రసాద్ తెలిపారు.

**మన్యంలో మలేరియా సమస్యాత్మక గ్రామాలు:** 153 (వీటిలో బుట్టాయగూడెం, పోలవరం, జీలుగుమిల్లి మండలాల్లో 117, విలీన మండలాల్లో 36)ఈ ఏడాది ఇంతవరకు జిల్లాలో నమోదైన మలేరియా కేసులు: 638 (వీటిలో మైదాన ప్రాంతంలో కేవలం 12 కేసులు కాగా.. మిగిలినవన్నీ మన్యంలోనే నమోదయ్యాయి)

# సముద్ర తీరం... ప్రగతి హారం!

ఒంగోలు: మత్స్య ఉత్పత్తుల ఎగుమతిలో కీలకమైన ఫిషింగ్ హార్బరు నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే ఉన్నతాధికారుల బృందాలు కొత్తపట్నం మండలం కె.పల్లెపాలెం గ్రామాన్ని పరిశీలించాయి. దాదాపు ఈ గ్రామ పరిధిలోనే హార్బరు నిర్మించేందుకు సానుకూలత వ్యక్తం చేశాయి. దీని నిర్మాణం పూర్తయితే సముద్రతీర ప్రాంతంలో హార్బరుకు అనుబంధంగా మరిన్ని పరిశ్రమలు ఏర్పాటై యువతకు ఉపాధి దొరుకుతుంది.

జిల్లాలో అయిదు మండలాల పరిధిలో 50 కిలోమీటర్ల మేర సముద్ర తీరం విస్తరించి ఉంది. ప్రస్తుతం సముద్రంలో చేపల వేటకు అవస్థలు తప్పడం లేదు. వేటలో చేపలు చిక్కినా, చిక్కకున్న బోటు సముద్రం లోపలికి వెళ్లాలన్నా, బయటకు రావాలన్నా రోజుకు కనీసం రూ.600 వరకు వెచ్చించాల్సి వస్తోంది. తుపాన్లు, అల్పపీడనం పరిస్థితుల్లో భారీ అలలు ఉన్నప్పుడు బోటు మరమ్మతులకు గురికావడంతో ప్రమాదాలు తలెత్తు తున్నాయి. ఫిషింగ్ హార్బరు అందుబాటులోకి వస్తే బోట్లు నిలుపుకొనేందుకు జెట్టీ (ప్లాట్‌ఫాం) ఏర్పాటై ఇబ్బందులు తప్పుతాయి. వేటకు భారీ బోట్లు వినియోగించే అవకాశం రావడంతో పల్లెకారులకు మత్స్య సంపద పెరుగుతుంది.

జిల్లావే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన బోట్లు ఇక్కడ నిలుపుకొనే అవకాశం ఉంటుంది. దాదాపు వెయ్యి బోట్లు మేర నిలుపుకొనేవిధంగా జెట్టీ నిర్మించనున్నారు. బోటులో నుంచే సరకు నేరుగా లారీలకు ఎగుమతి చేసేందుకు వీలవుతుంది. హార్బరులోనే చేపల విక్రయాలకు అవకాశం ఉండడంతో వ్యాపారం వృద్ధి చెందుతుంది. హార్బరు నిర్మాణం చేపల వేటకు కొండంత అండగా నిలుస్తుందని జిల్లా మత్స్య కార కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు పేరయ్య చెబుతున్నారు.

ఫిషింగ్ హార్బరు ఏర్పాటైతే చేపల ఎగుమతులకు సంబంధించి వాటిని నిల్వ చేయడం, ప్యాకింగ్, రవాణా రంగాలు కీలకం. హార్బరుతో మత్స్య సంపద పెరిగి వాటికి అనుబంధంగా తీర ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటవుతాయి. చేపల ప్రాసెసింగ్ యూనిట్లు పెట్టడంతో పాటు ఎండు చేపల ఉత్పత్తి పెరుగుతుంది. వ్యాపార లావాదేవీలు పెరిగి ఉపాధి అవకాశాలు విస్తృతమవుతాయి. కె.పల్లెపాలెంలో అధ్యయనం చేసిన బృందాలు హార్బరు నిర్మాణంపై సానుకూలమైన నివేదిక ఇవ్వనున్నాయని మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య పేర్కొన్నారు. మత్స్యకారులకు హార్బరు ఏర్పాటు చేసి తీరతామన్నారు. హార్బరు నిర్మాణం కోసం కొత్తపట్నం మండలంలోని పలు గ్రామాలు పరిశీలించారు. కె.పల్లెపాలెం బాగుంటుందని మత్స్యకారులు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌కు సూచించడంతో ఆ ప్రాంతాన్ని ఎంపిక చేశారు. హార్బరు నిర్మాణానికి సాంకేతిక అడ్డంకులు తొలగిపోతే భూ సేకరణకు తాము సిద్ధంగా ఉన్నామని సంయుక్త కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూమిని ఇస్తామని, అవసరాల మేరకు ప్రైవేటుగా భూసేకరణ చేపడతామన్నారు.

చురకలు



# సిఫార్సులే కొలమానం.. నచ్చినోళ్లకు స్థలం

అమలాపురం : గ్రామాల్లో ఇళ్లు కాదు.. ఏకంగా ఊళ్లే నిర్మిస్తున్నామంటూ గత వైకాపా పాలకులు ఆర్భాటం చేశారు. పేదలకు స్థలాల ముసుగులో అక్రమాలకు పాల్పడ్డారు. గూడులేక అల్లాడుతున్న వేలాదిమందిని గాలికొదిలేసి అనర్హులకు కట్టబెట్టారు. దీంతో నేటికీ ప్రతి లేఔట్‌లోనూ ఖాళీ స్థలాలే దర్శనమిస్తున్నాయి. వాస్తవాలను నిగ్గు తేల్చేందుకు కూటమి ప్రభుత్వ ఆదేశాలతో అధికారులు తాజాగా సర్వే చేయగా అక్రమాలు వెలుగు చూస్తున్నాయి.గత పాలకులు తమకు నచ్చినవారి పేర్లను వాలంటీర్ల ద్వారా నమోదు చేయించి జగనన్న లేఔట్‌లలో స్థలాలు కేటాయించారని ఆదినుంచి విమర్శలు వస్తూనే ఉన్నాయి. అదే విషయం తాజా సర్వేలో తేటతెల్లమైంది. సొంత ఇళ్లు ఉన్నవారు, ఆదాయపు పన్ను చెల్లించేవారు, స్థానికేతరులు, దీర్ఘకాలికంగా వలసవెళ్లిన వారికి కూడా పట్టాలిచ్చారు. కొందరు అమ్మకాలకు పెట్టారు. ఒక్కొక్క పట్టా రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు చెబుతున్నారు. అల్లవరం మండలం బోడసకుర్రులో ఇప్పటికే సగంపైగా చేతులు మారినట్లు సమాచారం. గోడి గ్రామంలో సొంత ఇళ్లు ఉన్న కొందరికి నేతల సిఫార్సులతో అక్కడి లేఅవుట్‌లో స్థలాలిచ్చారు. ఇళ్లు నిర్మించకుండా ప్రస్తుతం విక్రయించే పనిలో ఉన్నారు.



**తూతూమంత్రంగానే..**

జగనన్న లేఔట్‌లలో పట్టాల పంపిణీపై రాష్ట్ర ప్రభుత్వం పునఃపరిశీలన చేయాలని ఆదేశాలు జారీచేసింది. అయితే క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారులు పూర్తిస్థాయి నిబద్ధతతో సర్వే చేయలేదనే విమర్శలు వస్తున్నాయి. కొందరు వైకాపా నాయకులతో కుమ్మక్కై జాగ్రత్త పడ్డారనే ఆరోపణలున్నాయి. తాజాగా తయారు చేసిన అనర్హుల జాబితాలో ప్లాట్లు అమ్మకాలు చేసినవారి వివరాలు లేకపోవడం ఇందుకు నిదర్శనం.

**జిల్లాలో ఇలా..**

జిల్లావ్యాప్తంగా 22 మండలాల పరిధిలో మొత్తం మొదటి విడతలో 766 లేఔట్‌లు ఏర్పాటుచేశారు. దానిలో 67,418 మంది లబ్ధిదారులు రెండు సెంట్ల చొప్పున ఇంటిస్థలం కేటాయించి పట్టాలను పంపిణీ చేశారు. తాజా సర్వేలో వీరిలో 1,062 మందిని అనర్హులుగా గుర్తించినట్లు అధికారులు తెలిపారు.

**ప్రభుత్వానికి నివేదిస్తాం– రాజకుమారి, డీఆర్వో**

లబ్ధిదారుల జాబితాపై పునఃపరిశీలన చేశాం. ఈ వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తాం. ప్రభుత్వం విడుదల చేసే మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకుంటాం.

# పైన గుమ్మడికాయలు.. కింద గోవులు

కిర్లంపూడి: మూగజీవాలను గుట్టుచప్పుడు కాకుండా కబేళాకు తరలించేందుకు వాహనచోదకులు అనేక కుయుక్తులు పన్నుతున్నారు. రవాణా ఆటోలో అడుగున పది ఆవులను ఉంచి మధ్యలో చెక్కను అమర్చి వాటిపై గుమ్మడికాయల మూటలువేసుకుని జాతీయ రహదారిపై విజయవాడకు తరలిస్తున్న వాహనాన్ని తనిఖీలో భాగంగా కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం కృష్ణవరం జాతీయరహదారిపై టోల్‌ప్లాజా వద్ద పోలీసులు పట్టుకున్నారు. జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, కిర్లంపూడి ఎస్సై జి.సతీష్‌కు వచ్చిన సమాచారం మేరకు బుధవారం టోల్‌ప్లాజా వద్ద వాహన తనిఖీలు నిర్వహించగా కూరగుమ్మడికాయల మూటలు వేసుకుని వెళ్తున్న ఆటోను ఆపి



పరిశీలించారు. మూటల కింద ఆటోలో కబేళాకు తరలిస్తున్న పది ఆవులు, దూడలను పోలీసులు గుర్తించారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం నామవరం గ్రామానికి చెందిన కురందాసు బాస్కరరావు, కిర్లాడ అప్పారావు నర్సీపట్నం ప్రాంతం నుంచి విజయవాడ కబేళాకు తరలించేందుకు బేరం కుదుర్చుకున్నట్లు కిర్లంపూడి ఎస్సై జి.సతీష్ తెలిపారు. ఆవులను వీరినుంచి విడిపించి గోకవరంలోని గోశాలకు తరలించారు. వాహనచోదకులు ఇద్దరిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు స్వాధీనం చేసుకున్నామన్నారు.

# మగ్గానికి మద్దతు.. నేతన్నకు వరం..!

సీతానగరం : చేనేత రంగాన్ని బలోపేతం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాయి. ముద్ర పథకం ద్వారా రుణాలు మంజూరుచేసి చేనేత కార్మికులను ఆదుకుంటున్నాయి. పెరుగుతున్న ధరలు, తగ్గుతున్న ఆదరణను దృష్టిలో ఉంచుకుని చేయూతను అందిస్తున్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 1,420 మందికి రూ.7.10 కోట్ల రుణాలు మంజూరు చేయాలని లక్ష్యంగా పెట్టుకుని.. ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టారు. ఉమ్మడి జిల్లాలో 54 చేనేత సహకార సంఘాల్లో దాదాపు 9,750 మంది సభ్యులు ఉన్నారు. సిల్క్, జాందానీ, పట్టు తదితర చేనేత కార్మికులు వస్త్రాలు నేస్తున్నారు. ఉప్పాడ కొత్తపల్లి చీరలకు అంతర్జాతీయ, పెద్దాపురం పట్టుకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించాయి. ఆయా ఉత్పత్తులను ప్రోత్సహించడంతో పాటు నేతన్నలకు భరోసా కల్పిస్తున్నారు.

**ఎంత ఇస్తారంటే..**

ఓవైపు యార్న్ ధర పెరగడం, సాంకేతిక మార్పులు, తక్కువ ధరకు మిల్లు ఉత్పత్తులు మార్కెట్‌లోకి రావడంతో చేనేత వస్త్రాల అమ్మకాలు తగ్గిపోతున్నాయి. ఈ విషయాన్ని దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు రుణ సాయాన్ని పెంచారు. ఒక్కో కార్మికుడు ముద్ర పథకం ద్వారా రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు రుణం తీసుకోవచ్చు. ఈ మొత్తంలో ప్రభుత్వం 20 శాతం రాయితీ ఇస్తోంది. మూడేళ్ల కాలానికి ఆరు శాతం వడ్డీ చెల్లించాలి. సొంత మగ్గం ఉండి.. చేనేత కార్మికుడిగా గుర్తింపుపొందినవారికి రాయితీపై రుణం మంజూరు చేస్తారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 1,420 మందికి రుణాలు అందించాలని నిర్ణయించి ఇప్పటివరకు 210 మందికి రూ.1.05 కోట్లు మంజూరు చేశామని చేనేత జౌళి శాఖ కాకినాడ ఏడీ కె.పెద్దిరాజు తెలిపారు. అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని వివరించారు.

# లక్ష్యం బాగున్నా.. స్పందన లేదాయె!




గుత్తి : గుత్తిలో నివాస స్థలాలకు విపరీతమైన డిమాండ్ ఉంది. దీంతో వైకాపా ప్రభుత్వం మూడేళ్ల కిందట లచ్చానిపల్లిరోడ్డులో జగనన్న కాలనీలో మధ్యతరగతి ప్రజలకు సొంతింటి కల సాకారం చేసేందుకు లేఅవుట్‌ను వేసింది. పట్టణానికి సుమారు 2 కి.మీ దూరంలో 6 ఎకరాల్లో ప్లాట్లు సిద్ధం చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సుమారు 800 మందికి ఇళ్లపట్టాలిచ్చారు. తరువాత అధికారంలోకి వచ్చిన వైకాపా సర్కారు 600 పట్టాలను పేదలకు మంజూరు చేసింది. ప్రస్తుతం అక్కడ నివాస గృహాలు వెలిసి జగనన్న కాలనీగా ఏర్పాటైంది.

**ప్రైవేట్‌పై ఆసక్తి...**

మధ్యతరగతి ప్రజలు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎంఐజీ లేఅవుట్‌లో ప్లాట్లు కొనుగోలుకు ముందుకు రావడం లేదు. గుత్తిలో సెంటు రూ.2–3 లక్షలు దాకా ధర ఉంది. అయినా ప్రజలు ప్రైవేట్ లేఅవుట్లలో ప్లాట్ల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రభుత్వ లేఅవుట్‌ను ఏమాత్రం పట్టించుకోవడం లేదు. లేఅవుట్ వద్ద డంపింగ్ యార్డు ఉంది. పట్టణంలోని చెత్తను తెచ్చి పడేస్తున్నారు. డండింగ్‌యార్డుతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

కాలనీలో యార్డు లేకుండా తరలించాలని ప్రజలు కోరుతున్నారు. యార్డు ఉండటంతోనే ప్రభుత్వ లేఅవుట్‌లో ప్లాట్లు కొనుగోలుకు మధ్యతరగతి ప్రజలు ముందుకు రాలేకపోతున్నట్లు గ్రహించిన అహూడా అధికారులు యార్డు ఎత్తివేయాలని పురపాలిక అధికారులను ఆదేశించారు. యార్డు ఎత్తివేతకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే రూ.34 లక్షలకు టెండర్లు వేశారు. అక్కడే మురుగుశుద్ధి ప్లాంట్ నిర్మాణంలో ఉంది.

**మౌలిక సదుపాయాలు కల్పిస్తాం**

**– రేవంత్, డీఈఈ, అహుడా, అనంతపురం**

గుత్తిలోని ఎంఐజీ లేఅవుట్‌ను అభివృద్ధి చేస్తాం. ఇప్పటికే డంపింగ్ యార్డును మరో ప్రాంతానికి తరలించే ప్రక్రియ జరుగుతోంది. మౌలిక సదుపాయాలు కల్పించి ప్లాట్ల కొనుగోలు విషయమై ప్రజలకు అవగాహన కల్పిస్తాం.

**రూ.2.95 కోట్లు ఆర్జించాలని..**

కాలనీ రోజురోజుకు అభివృద్ధి చెందుతున్నా మార్జినల్ ఇన్‌కమ్ గ్రూపు(ఎంఐజీ)లేఅవుట్ మాత్రం అలంకారప్రాయంగా ఉంది. లేఅవుట్‌లో అహుడా అధికారులు 123 ప్లాట్లు వేశారు. ఒక్కో ప్లాట్‌ను రూ.2.40 లక్షలకు విక్రయించాలనుకున్నారు. మొత్తం రూ.2.95 కోట్ల ఆదాయాన్ని ప్లాట్ల నుంచి ఆర్జించాలని ప్రభుత్వం లక్ష్యంగా ఎంచుకుంది. ఇప్పటి వరకు ఒక్క ప్లాట్‌ను కూడా విక్రయించలేదు. లేఅవుట్‌లోని ప్లాట్లు మూలనపడ్డాయి.

# ప్రయాణికుల ప్రాంగణం.. ఆక్రమణలే అధికం



పుట్టపర్తి : హిందూపురం నడిబొడ్డున ఉన్న పరిగి ప్రయాణికుల ప్రాంగణం ఆక్రమణలకు అడ్డాగా మారింది. పట్టణంలో రెండు ప్రయాణ ప్రాంగణాలు ఉన్నాయి. ఇందులో పరిగి బస్టాండు నిత్యం కిటకిటలాడుతుంటుంది. కర్ణాటక సరిహద్దున ఉండటంతో నిత్యం రెండు రాష్ట్రాలకు చెందిన 20 వేల మందికిపైగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఒకప్పుడు పరిగి బస్టాండు ఏడెకరాలు ఉండేది. కూరగాయలు, పండ్ల మార్కెట్, ఆలయాలు, బడి.. ఇలా ఒక్కోదానికి కొంత స్థలం కేటాయించారు. ప్రస్తుతం సుమారు 60 సెంట్లకు చేరుకుంది. ఈ ప్రాంగణంలోనే 40 వాణిజ్య దుకాణాలు నిర్మించారు. దుకాణాల ముందు చిరువ్యాపారులకు స్థలమిచ్చి (తోపుడు బండ్లకు) అద్దె వసూలు చేస్తున్నారు. దీంతో మరింత ఆక్రమణలకు గురికావడంతో ప్రయాణికులు రాకపోకలు సాగించడానికి పడరాని పాట్లు పడుతున్నారు. చిరువ్యాపారుల ఏడాదిపాటు రోజూ సుంకం వసూలు చేసుకునేందుకు టెండరు పిలిచారు. ఓ వ్యక్తి రూ.22.30 లక్షలు చెల్లించి టెండరు దక్కించుకున్నాడు. వారి నుంచి ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. వైకాపా ప్రభుత్వం 2023 చివర్లో హోల్‌సేల్ కూరగాయల వ్యాపారుల పేరుతో 18 మందికి అద్దె ప్రాతిపదికపై తాత్కాలిక దుకాణాల ఏర్పాటు కు అధికారులు అనుమతించారు. పురపాలక సంఘం ఆమోదానికి గాను కొంతమంది కౌన్సిలర్లకు రూ.80 వేల నుంచి రూ.3 లక్షల వరకు ముట్టినట్లు ఆరోపణలున్నాయి. మొత్తం 18 మందికి తాత్కాలిక అనుమతి ఇవ్వగా వీరితో మరో ఆరుగురు కలిసి మొత్తం 24 దుకాణా లు ప్రయాణ ప్రాంగణంలో నిర్మించుకోవడం గమనార్హం. ఇందుకోసం అధికారులు, కొందరు కౌన్సిలర్లకు ఎవరికి ఎంత ఇచ్చారో పుస్తకంలో రాసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. కూటమి ప్రభుత్వం వచ్చాక సదరు దుకాణాలను ఖాళీ చేయాలని అధికారులు చెప్పడంతో వారు కోర్టుకు వెళ్లారు.

**తక్షణమే చర్యలు తీసుకుంటాం**

**– మల్లికార్జున, హిందూపురం మున్సిపల్ కమిషనర్**

పరిగి బస్టాండులో ఆక్రమణలు, ప్రయాణికులు ఇబ్బందులు తొలగించేందుకు తక్షణం చర్యలు తీసుకుంటాం. చిరువ్యాపారుల బండ్లను ఎక్కడపడితే అక్కడ పెట్టుకోకుండా చర్యలు తీసుకుంటాం. సిబ్బందితో చర్చించి ఆక్రమణలను తొలగిస్తాం.

# అక్రమాలకు ఊరుకో 'కొండ' గుర్తు



విశాఖపట్నం : వైకాపా పాలనలో జిల్లాలోని పలు కొండలను కొల్లగొట్టారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత కూడా అదే తీరు కొనసాగుతోంది. పేదలకు ఇళ్ల నిర్మాణం పేరుతో గ్రావెల్ తరలించేస్తున్నారు. భారీ యంత్రాలతో పగలు, రాత్రి తవ్వేస్తున్నారు. లే–అవుట్లకు ఈ గ్రావెల్‌ను తరలించి కొందరు నాయకులు జేబులు నింపేసుకుంటున్నారు. భీమిలి నియోజకవర్గం ఆనందపురం మండల పరిధిలో కొన్ని కొండల గుర్తులు చెదిరిపోతున్నాయి. అంతలా గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నాయి.ఇది గిడిజాలలోని 'ఒక సెంటు' ప్లాట్ల కాలనీ సమీపంలోనిది. రైతులకు కేటాయించిన లే–అవుట్‌లో రోడ్లకు గ్రావెల్ పేరుతో ప్రైవేటుకు భారీగా తరలించేస్తున్నారు. జేసీబీతో నిత్యం తవ్వకాలు సాగుతున్నాయి. ఇప్పటికే సుమారు 5 ఎకరాల మేర కొండను మింగేశారు. ఈ కొండ చందక రెవెన్యూ గ్రామ పరిధిలోని పందలపాక సమీపంలోనిది. ప్రతి రోజూ 50కిపైగా లారీలతో గ్రావెల్ తరలిస్తున్నారు. 3 యూనిట్ల టిప్పర్ అయితే దూరాన్ని బట్టి రూ. 4–5వేలకు, ఏడు యూనిట్ల లారీలైతే రూ.10వేలకు అమ్మేస్తున్నారు. ఇది తర్లువాడ రెవెన్యూ పరిధిలోని ప్రకృతివానిపాలెం లే–అవుట్ సమీప కొండ. ప్రతిరోజూ గ్రావెల్ తవ్వి బయటకు తరలిస్తున్నారు. గ్రావెల్‌తో సమీపంలో చదును చేసిన స్థలాల్లో అనధికారికంగా ఇళ్ల నిర్మాణాలు సైతం చేస్తున్నారు. ఇప్పటికే ఈ కొండలో రెండు ఎకరాలపైగా మట్టిని కొల్లగొట్టారు.

**అడ్డే లేదుగా...:** పగలు, రాత్రి తేడా లేకుండా గ్రావెల్ తరలిస్తున్నా అధికారులు కళ్లుమూసుకుంటున్నారు. రెవెన్యూ, పోలీసు అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. పందలపాక సమీపంలోని కొండ నుంచి మట్టి తరలిస్తున్నట్లు గతంలో ఫిర్యాదులు రావడంతో కొన్ని లారీలను పట్టుకున్నారు. అయితే ఇప్పటికీ చర్యల్లేవు. ఇదే అదునుగా కొండను నిత్యం తవ్వి దర్జాగా ఎర్రమట్టి తరలిస్తున్నారు. వైకాపా హయాంలో చెలరేగిన మాఫియాలో కొందరు ఎర్రమట్టి తరలింపులో చక్రం తిప్పుతూ ఇప్పటికీ హవా సాగిస్తున్నారు. విజిలెన్స్, మైనింగ్ శాఖలు ఈ తవ్వకాలపై దృష్టిపెడితే తప్ప సహజ సిద్ధమైన కొండలను కాపాడుకోలేమని స్థానికులు చెబుతున్నారు.

# కన్నీట మాయాపట్నం..

కొత్తపల్లి : ప్రశాంతంగా ఉండే కడలి కన్నెర్ర చేసింది. కెరటాలు ఉవ్వెత్తున ఎగసిపడడంతో భయభ్రాంతులకు గురైన ప్రజలు ఇళ్లలోకి పరుగులు తీశారు. ఏం జరిగిందో తెలుసుకునేలోపే గ్రామాన్ని సముద్రపు నీరు ముంచెత్తింది. తీరాన్ని ఆనుకుని ఉన్న గృహాలు నేలమట్టమయ్యాయి. పదుల సంఖ్యలో దెబ్బతిన్నాయి. ఉదయం ఏడు గంటల సమయంలో యు.కొత్తపల్లి మండలం మాయాపట్నంలో పరిస్థితి ఇది. ఇక్కడ ఎటుచూసినా మోకాలిలోతు నీరే. పంచాయతీ, రెవెన్యూ అధికారులు హుటాహుటిన చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. నాలుగు గంటల అనంతరం సముద్రం శాంతించింది. ఉప్పాడ, సూరాడపేట, జగ్గరాజుపేట, అమీనాబాద్ ప్రాంతాలు సైతం కోతకు గురయ్యాయి.

**విధ్వంసం సృష్టించి..**

ఏడాదికి రెండు నుంచి మూడుసార్లు సముద్రం విధ్వంసం సృష్టించి గ్రామాలను కలిపేసుకుంటోందని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సముద్రకోత నివారణపై ఇప్పటికే దృష్టి సారించారు. ఎన్నికల ముందు పలుమార్లు పర్యటించి కోత ప్రభావం, పరిస్థితి, నివారణ చర్యలపై తెలుసుకున్నారు. అధికారంలోకి



వచ్చాక మళ్లీ పర్యటించారు. ఇటీవల వాకలపూడి నుంచి అమీనాబాదు వరకు కోత నివారణ నిమిత్తం రక్షణగోడ నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని వెల్లడించారు. ఇది పూర్తయితేనే ముప్పు తప్పుతుంది.

**చిన్న గుడిసెలో 8 మంది ఉంటున్నాం– చొక్కా గోవిందమ్మ**

తుపాను, విపత్తుల సమయంలో మా ఇళ్లు పోయింది. ఒకే గది ఉన్న చిన్న గుడిసెలో 8 మంది ఉంటున్నాం. గత ప్రభుత్వంలో ఇళ్ల స్థలం కోసం దరఖాస్తు చేసుకుంటే మాకు రాదన్నారు. ఇప్పుడు ఈ గుడిసె కూడా మునిగిపోయింది. ఎక్కడ ఉండాలో తెలియడంలేదు.

**ఇంటి పన్ను ఉందని స్థలం ఇవ్వలేదు– చిట్టెమ్మ**

సముద్రంలో ఇళ్లు పోయినా మా పేరు మీద పన్నులు, విద్యుత్తు మీటర్లు ఉన్నాయని గత ప్రభుత్వంలో స్థలాలు ఇవ్వలేదు. చిన్నపాటి పూరింట్లో బతుకుతున్నాం. ఇప్పుడు అదీ కూడా మునిగిపోయింది. న్యాయం చేయాలి.

**గ్రామస్థులకు సహాయం చేయండి**

ఉప్పాడ తీరంలో అలల ఉద్ధృతి పెరగడంతో మాయాపట్నం గ్రామం జలమయమైన విషయం ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి వచ్చింది. వెంటనే ఆయన కాకినాడ జిల్లా కలెక్టర్, ఇతర అధికారులతో సమీక్షించారు. ప్రజలకు సహాయ చర్యలు చేపట్టాలని, పాలు మంచినీళు వంటివి అందించాలని ఆదేశించారు. వైద్య సిబ్బందిని, ఔషధాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. భారీ వర్షసూచన ఉండటం వల్ల యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అక్కడ రక్షణ గోడ జియో ట్యూబ్ తదితర అంశాలపై ఆరా తీశారు.

**ఏడాది కాలంలో ఇలా..**

మండలం: యు.కొత్తపల్లి
ప్రభావిత గ్రామాలు : ఆరు
కోతకు గురైన ప్రాంతం : 50 మీటర్లు పైబడి
నేలకూలిన ఇళ్లు: 15
దెబ్బతిని ప్రమాదకరంగా మారిన ఇళ్లు: 30
ధ్వంసమైన రోడ్లు : 8

# ఇక.. చక్రాలు అరిగితే ఇక్కడే సరిచేస్తారు..!

రాజమహేంద్రవరం: రాజమహేంద్రవరంలోని దక్షిణ మధ్య రైల్వే మెము కార్‌షెడ్‌లో రైళ్ల నిర్వహణ సామర్థ్యం పెంచే దిశగా రైల్వేశాఖ అడుగులేస్తోంది. ఇప్పటి వరకు రైళ్ల కోచ్‌లకు మరమ్మతులు, సర్వీసింగ్ వరకు ఇక్కడే చేసేవారు. కానీ అరిగిన రైళ్ల చక్రాలను సరిచేసే యంత్రాలు అందుబాటులో లేవు. ఆ చక్రాలను విజయవాడ, తిరుపతిలకు పంపించి, సరి చేయించేవారు. ప్రస్తుతం అలాంటి చక్రాలను కూడా ఇక్కడే సరిచేసే యంత్రాలను సమకూర్చడానికి (ఫిట్ వీల్ లేత్) రూ.9 కోట్లు మంజూరు చేశారు.దీనికి సంబంధించిన పనులు చురుగ్గా సాగుతున్నాయి. మెము (మెయిన్ లైన్ ఎలక్ట్రికల్ మల్టిపుల్ యూనిట్) కార్‌షెడ్‌లో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి పనులకు గతంలో రూ.6.81 కోట్లు మంజూరు చేశారు.



తాజాగా రూ.9 కోట్లతో అరిగిన రైలు చక్రాలును రీప్రొఫైలింగ్ చేయడానికి వీలుగా ఏర్పాట్లు చేస్తున్నారు. ః రైళ్ల నిర్వహణకు 1999లో రాజమహేంద్రవరం ప్రధాన రైల్వేస్టేషన్ సమీపంలో మెము కార్‌షెడ్‌లో ప్రారంభించారు. ప్రతిరోజూ మూడు, నాలుగు రైళ్లకు మరమ్మతులు, వాటర్ సర్వీసింగ్ ఇక్కడ చేస్తున్నారు. 108 సర్వీసులుగా నడిచే 28 రైళ్లకు సంబంధించి 257 బోగీ(కోచ్)లకు పూర్తిస్థాయిలో నిర్వహణ జరుగుతోంది. ప్రస్తుతం ఉన్న రెండు ఫిట్‌లు (బోగీల మరమ్మతులకు వీలుగా ఉండే ప్రత్యేక ట్రాక్‌లు) ఉన్నాయి. వీటి సామర్థ్యం పెంచడం ద్వారా మరిన్ని రైళ్ల నిర్వహణ కూడా ఇక్కడే చేపట్టాలని రైల్వే అధికారులు నిర్ణయించారు.

# రెండోసారి హాజరు తప్పనిసరి



కొత్తవలస: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో జాతీయ చరవాణి పర్యవేక్షణ వ్యవస్థ (ఎన్ఎంఎంఎస్)లో రెండోసారి తప్పనిసరిగా హాజరు నమోదు చేయాలని కేంద్ర గ్రామీణాభి వృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అందులో భాగంగా ఇప్పటికే కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ తరఫున ఓ బృందం జిల్లాలో పర్యటించింది. ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా రెండోసారి హాజరు వేయకపోవడంతో మరుసటి రోజు యాప్ తొలగించి.. తిరిగి డౌన్లోడ్ చేయాల్సివస్తోందని గుర్తించారు. ఈ నేపథ్యంలో ఉత్తర్వులు జారీచేశారు.

**ఇవీ నిబంధనలు..**

ఎన్ఎంఎంఎస్ యాప్‌లో మొదటిసారి హాజరు చిత్రం నమోదు చేసిన 4 గంటల తర్వాత రెండోసారి తప్పనిసరిగా చేయాలి.

అప్‌లోడ్ సమస్య ఎదురైతే చిత్రాలను సేవ్ చేసి.. అదే రోజు రాత్రి 12 గంటల లోపు అప్లోడ్ చేయాలి.

మాన్యువల్ మస్టర్ అప్రూవల్‌కు సరైన కారణం ఎంపిక చేయాలి.

రెండోసారి హాజరు పంపని క్షేత్ర సహాయకుడు, సీనియర్ మేట్‌లపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారు. ఎట్టి పరిస్థితుల్లోనూ యాప్ తొలగించి, తిరిగి ఇన్‌స్టాల్ చేయకూడదు. పనికి హాజరైన కూలీల ఫొటోలు ఒక విడత మాత్రమే నమోదు చేస్తే.. మరుసటి రోజు నమోదుకు ఇకపై అవకాశం ఉండదు. అవకతవకలకు అవకాశం లేకుండా ఏఐ సాయంతో పటిష్ఠ పరిచినట్లు చెబుతున్నారు.

**అలసత్వం తగదు..**

క్షేత్ర సహాయకులు తీసే చిత్రాలను పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షించి ఎంపీడీవోకు నివేదిక ఇవ్వాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ స్పష్టం చేసింది. మండల పరిధిలోని గ్రామాల నుంచి వచ్చిన వాటిలో 20 శాతం వివరాలను జిల్లా అధికారులకు పంపించాలి. ఈ ప్రక్రియలో అలసత్వం వహించే కార్యదర్శి, మండల, జిల్లా అధికారులపై చర్యలు తీసుకుంటారు.

**జిల్లాలో ఇదీ పరిస్థితి..**

జాబ్‌కార్డులు : 3.86లక్షలు

వేతనదారులు : 6.88 లక్షలు

మనుగడలో ఉన్నవి : 3.46 లక్షలు

పనికి హాజరవుతున్న శ్రామికులు: 5.72 లక్షలు

విధిగా రెండుసార్లు ఫొటో తీయాలి: పద్మజ, ఏపీడీ, విజయనగరం, ఎస్.కోట క్లస్టర్ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి రోజు పనిప్రదేశంలో హాజరైన వేతనదారులకు విధిగా రెండు విడతలుగా ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. లేకుంటే మరుసటి రోజు ఉపాధి కల్పించే అవకాశం ఉండదు.

# కళ్లెదుటే మురుగు.. కలగానే మెరుగు..!



శ్రీకాకుళం : పేరుకే అవి పట్టణాలు.. చెప్పుకోవడానికి మాత్రమే అది నగరం.. ఓసారి వీధుల్లో నడిస్తే తెలుస్తుంది. అడుగడుగునా కాలువల్లో పూడిక.. రోడ్లపై మురుగు దర్శనమిస్తాయి. ఏటా స్థానిక సంస్థలు రూ.కోట్లు వెచ్చిస్తున్నా వర్షాకాలంలో ప్రజలకు కష్టాలు తప్పట్లేదు. శ్రీకాకుళం నగరపాలక సంస్థ, ఆమదాలవలస, పలాస–కాశీబుగ్గ, ఇచ్ఛాపురం పురపాలక సంఘాల్లో కాలువల నిర్వహ ణ సక్రమంగా లేక లోతట్టు ప్రాంతాలు ముంపుబారిన పడుతున్నాయి. మురుగు రోడ్లపైకి చేరి వీధులు దుర్గంధభరితంగా మారుతున్నాయి. జిల్లా కేంద్రంలో రూ.వెయ్యి కోట్లతో కాలువల వ్యవస్థను గాడిలో పెట్టేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పిన పాలకుల మాటలు ఆచరణకు నోచుకోవట్లేదు. ఫలితంగా పాలకొండ రహదారి, అరసవల్లి మిల్లుకూడలి, ఇల్లీసుపురం, రైతుబజార్, పాత బస్టాండ్ పరిసరాలు, గుజరాతీపేట తదితర ప్రాంతాల్లో వర్షం పడితే నీరు రోడ్లపైనే తిష్ఠ వేస్తోంది. భారీ వర్షాలు, తుపాన్ల సమయంలో లోతట్టు ప్రాంతాలు ముంపుబారిన పడుతున్నాయి. నగరాభివృద్ధి దృష్ట్యా సుమారు 200 కి.మీ. మేర అదనంగా కాలువలు నిర్మించాల్సి ఉన్నా పట్టించుకోవట్లేదు. మురుగునీటి వ్యవస్థ సక్రమంగా లేక కాశీబుగ్గ ప్రాంతంలో వర్షం పడితే నరకం కనిపిస్తోంది. ప్రధానంగా మేదర వీధి నుంచి సంతోషి మాత కోవెల వరకు కాలువ లేకపోవడంతో మురుగు రోడ్డెక్కుతోంది. సంతోషిమాత కోవెల వద్ద కాలువలో చెత్త అడ్డుపడితే పక్కనే పూజారి వీధి వాసులు మురుగుతో ఇబ్బంది పడుతున్నారు. జంట పట్టణాల్లోని నీరు ఎటూ వెళ్లలేక శివారు ప్రాంతాల్లోని ఖాళీ స్థలాల్లోనే ఉ ండిపోతోంది. ఇచ్ఛాపురం పట్టణంలోనూ పరిస్థితి అస్తవ్యస్తంగానే ఉ ంది. పురుషోత్తపురం, బెల్లుపడ, కొండపోలమ్మ కాలనీలు, రత్తకన్న, ఎన్టీఆర్ నగర్‌లో నివాసాల మధ్యనే మురుగు నిల్వ ఉంటోంది. ఇంకా పలు వీధుల్లో 30 కిలోమీటర్ల వరకు కాలువల నిర్మాణం చేపట్టాల్సి ఉంది.

ఆమదాలవలస పురపాలిక ఏర్పడి 30 ఏళ్లు పైబడినా కాలువల పరిస్థితి అధ్వానంగానే ఉంది. ఆక్రమణలు పెరిగిపోవడంతో చాలా చోట్ల కాలువల్లో పూడిక తీసేందుకు వీల్లేకుండా పోతోంది. కొద్దిపాటి వర్షానికే పూజారిపేట, కంద్రపేట, శ్రీకాకుళం రహదారి, ఆమదాలవలస గేటు, తదితర రోడ్లపైకి నీరు చేరుతోంది. భారీ వర్షాల సమయంలో లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లు నీటమునుగుతున్నాయి.

**ఇదీ పరిస్థితి..**

వర్షపు నీరు, మురుగు శివారు ప్రాంతాల్లోని కాలువలు, చెరువులు, నదుల్లోకి చేరేందుకు వీలుగా ప్రధాన కాలువల వ్యవస్థ సక్రమంగా లేదు. చాలా చోట్ల పూడికతో నిండిపోతున్నాయి.

మరోవైపు కాలువలపై ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. శిథిలావస్థకు చేరుకున్నవాటిని పునరుద్ధరించేందుకు యంత్రాంగం శ్రద్ధ చూపట్లేదు. పురపాలక సంఘాలు కాలువల నిర్వహణను విస్మరిస్తున్నాయి. నిత్యం పారిశుద్ధ్య కార్మికులు వ్యర్థాల సేకరణతో పాటు కాలువల్లో పూడిక కూడా తీయాలి. పర్యవేక్షణ లేకపోవడంతో వారు కేవలం చెత్త సేకరణకే పరిమితమవుతున్నారు.

కాలువల్లో మట్టి, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి నీటి ప్రవాహ సామర్థ్యం తగ్గిపోతోంది.

**కమిషనర్లు ఏమంటున్నారంటే..?**

'కాలువల నిర్వహణపై దృష్టి సారిస్తున్నాం. కొత్త వాటి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. లోతట్టు ప్రాంతాల్లో ముంపు సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం. కాలువల్లో ఆక్రమణలు తొలగిస్తాం' అని ఆయా పుర, నగరపాలిక కమిషనర్లు చెబుతున్నారు.

# బడి మెట్లెక్కని.. బాలలు

కేవీబీపురం : ఈ విద్యాసంవత్సరం ప్రారంభమై 43 రోజులు గడుస్తున్నా ఇప్పటికీ బడిముఖం చూడని విద్యార్థులు 179 మంది పైగా ఉంటున్నారు. కేవీబీపురం మండలంలో పాఠశాలల విలీన ప్రక్రియలో పారదర్శకత లోపించడంతో మూడు నుంచి ఆరు కిలోమీటర్ల దూరంలోని పాఠశాలలకు తమ పిల్లలను పంపలేమని తల్లిదండ్రులు ఇంటివద్దనే నిలిపివేశారు. ఇందులో భాగంగానే బంగారమ్మకండ్రిగ 54, వగత్తూరు 34, పాతపాళ్లెం 38, ఏపీపురం 16, గురుకులకండ్రిగ 13, వగత్తూరు ఎస్టీ, ఎస్ఎల్‌పురం ఎస్టీ, కాత్రపల్లి ఎస్టీ కాలనీలల్లో 24 మంది పిల్లలు ఇంటికే పరిమితమయ్యారు. సత్యవేడు నియోజకవర్గంలోని నారాయణవనం, బీఎన్‌కండ్రిగ మండలాల్లోనూ వీరి సంఖ్య అధికంగా ఉంది.

**అంట్లు తోముకోమంటున్నారు..**

మా ఊళ్లో బడి మూసేసి నాలుగు కి.మీ. దూరంలోని మరో బడికి పోవాలని సార్ చెప్పారు. అమ్మానాన్న కూలి పనులకు వెళ్తున్నారు. అక్కడికి వెళ్లలేవని ఇంటి పని, అంట్లు తోముకోమంటున్నారు. దీంతో వేసవి సెలవులు ముగిసినా ఇంటివద్దనే ఉండిపోయా. పావని, నాలుగో తరగతి, ఏపీపురం



**తల్లిదండ్రులు రెండురోజులు రారు..**

అమ్మానాన్న పనులకు వెళ్తే రెండుమూడు రోజులైనా ఇంటికి రారు. ఊర్లో ఉన్న బడికిపోతూ అవ్వ, తమ్ముడితో కలిసి ఇంటివద్ద ఉండేదాన్ని. పక్క ఊళ్లో బడి చాలా దూరంగా ఉంది. అక్కడికి పోవాలంటే బస్సులు ఉండవు. అందుకే ఇంటికాడనే ఉంటున్నా. కుమారి, నాలుగో తరగతి, బంగారమ్మకండ్రిగ

# పక్కా పరిశీలనతోనే 'ఫలం'

చిత్తూరు, తిరుపతి: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నెలాఖరుకు మామిడి సీజన్ పూర్తికానుంది. దాదాపు రెండు నెలలుగా సాగుతున్న కొనుగోళ్ల ప్రక్రియ మరో వారం రోజుల్లో ముగియనుంది. తర్వాత ఉ ద్యానశాఖ సిబ్బంది పూర్తిస్థాయిలో రైతుల జాబితాను క్షేత్రస్థాయిలో పరిశీలించి.. అధికారులకు పంపనున్నారు. అనంతరం ప్రభుత్వం ప్రకటించినట్లు టన్నుకు రూ.4వేల మొత్తాన్ని వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయనుంది. ఈ విషయంలో అధికార యం త్రాంగం పారదర్శ కంగా వ్యవహరించినప్పుడే సర్కారు సాయానికి సార్థకత చేకూరుతుంది. ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా దాదాపు 48,000 మంది మామిడి రైతులున్నారు. గతంలో ఎకరాకు రెండు నుంచి మూడు టన్నులు వస్తే.. ప్రస్తుతం ఐదారు టన్నుల దిగుబడి వచ్చింది. మరోవైపు గుజ్జు పరిశ్రమలు 45 వరకే ఉండటం వీటి సామర్థ్యం రోజుకు 10,000 టన్నులే కావడంతో దిగుబడులతో వాహనాలు ఫ్యాక్టరీల ఎదుట వరుసకట్టాయి. రాష్ట్ర ప్రభుత్వం టన్నుకు రూ.8వేలు చెల్లించాలని ఆదేశించినా లెక్కచేయలేదు. చివర్లో సరకు అవసరం కాబట్టి కొంతవరకు ఆ ధరకు కొనుగోలు చేశాయి.

**తమిళనాడు నుంచి తెప్పించి**

తమిళనాడులో ఈ ఏడాది టన్ను తోతాపురి రూ.4–5 వేలు మాత్రమే



పలికింది. మన రాష్ట్రంలో ప్రభుత్వం ప్రకటించిన రూ.4వేలు తోడు పరిశ్రమలు రూ.5–6 వేలు చొప్పున చెల్లించాయి. దీంతో గుడిపాల మండలంలోని పరిశ్రమలకు కొందరు తమిళనాడు నుంచి ట్రాక్టర్లలో తెప్పించి అమ్మారు. అప్పట్లో హడావుడిలో ఉద్యానశాఖ సిబ్బంది వీరి వివరాలు నమోదు చేశారు. వీరికి నిజంగా భూమి ఉందా? ఉన్నా మామిడే వేశారా? దిగుబడి ఎంత ఉండవచ్చు? వంటి వివరాలు ఆరాతీయాల్సి ఉంది. లేదంటే అనర్హులకు ప్రభుత్వ సాయం అందు తుంది. 10– 15 శాతం మంది రైతులకు మామిడి ఉన్నా ఈ–పంటలో నమోదు చేసుకోలేదు. ఇలాంటి అన్నదాతలకు అన్యాయం చేయకూడదు.

**4.17 లక్షల టన్నుల కొనుగోలు**

ఇప్పటివరకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 4.17 లక్షల టన్నుల మామిడిని పరిశ్రమలు, ర్యాంపులు, మండీ వ్యాపారులు కొన్నారు. అందులో 3.27 లక్షల టన్నుల దిగుబడి ఒక్క చిత్తూరు జిల్లా నుంచే వచ్చింది. తొలుత రాష్ట్ర ప్రభుత్వమే టన్నుకు రూ.4వేల చొప్పున చెల్లిస్తుందని ప్రకటించినా తాజాగా మార్కెట్ జోక్య పథకం (ఎంఐఎస్) కింద కేంద్రం కొంత భరించేందుకు సిద్ధమైంది. మొత్తంగా 1,62,500 టన్నులకే కొనుగోలును పరిమితం చేయగా దిగుబడులు పెరిగినందున ఈ మొత్తాన్ని పెంచాలని రాష్ట్రం కోరనుంది.

**రాజకీయాలకు అతీతంగా చేస్తేనే..**

మరోవైపు పరిశ్రమల వద్ద ట్రాక్టర్లు బారులు తీరిన సందర్భంలో రాజకీయ పలుకుబడితో కొందరు టోకెన్లు పొందారు. ముందుగా తమ దిగుబడులను లోపలకు తరలించారు. ఇలాంటి పరిస్థితి పునరావృ తం కాకూడదు. ఉద్యానశాఖ అధికారులు, సిబ్బంది.. ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా వ్యవహరించాలి. మామిడిని అమ్మిన ప్రతిఒక్కరికీ సాయం చేయాలనే ఉద్దేశంతో సర్కారు ఉంది. అటువంటప్పుడు స్థానిక నేతల ప్రమేయాన్ని నిరోధించి ఎలాంటి పక్షపాతం లేకుండా అధికా రులు అర్హుల వివరాలు నమోదు చేయాల్సి ఉంది.

# అన్నదాతల.. నిరీక్షణకు తెర

చిత్తూరు : కూటమి ప్రభుత్వంలో వ్యవసాయ సర్వీసుల జారీ, నియం త్రికల బిగింపు ఊపందుకుంది. వైకాపా హయాంలో అప్పటి మంత్రి అండతో కొందరు ఉన్నతాధికారులు అడ్డగోలు నిర్ణయాలతో పెద్దసంఖ్య లో వ్యవసాయ సర్వీసులు పెండింగ్‌లో ఉండిపోయి అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆశాఖ ఉన్నతాధికారులు స్పందించా రు. సమస్య పరిష్కారంపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సుమారు 3,240 సర్వీసులు పెండింగ్‌లో ఉండేవి. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఈ 30 రోజుల్లోనే 510 సర్వీసులు జారీ చేశారు. ఇందులో పలమనేరు డివిజన్‌లోనే అధికంగా ఉన్నాయి. జారీతోపాటు సత్వరమే నియంత్రికలు, అనుబంధ పరికరాలు అమర్చే దిశగా ఏఈఈలకు సేవలందిస్తున్నారు. నెలవారబడి పొలాల్లో దర్శనమి స్తున్న నియంత్రికలు అమర్చేలా చర్యలు చేపట్టారు. అలాగే అవినీతి అధికారుల ఆగడాలకు అడ్డుకట్ట వేశారు. అలసత్వం ప్రదర్శిస్తున్న ఇద్దరు ఏఈఈలకు మెమోలు జారీ చేశారు. మార్పుకోకపోతే వేటు తప్పదని హెచ్చరించారు.



**లెక్క తేలుస్తున్నారు..!**

గత వైకాపా పాలనలో పలమనేరు డివిజన్‌లో జరిగిన అవినీతి అక్రమాలకు అంతేలేదు. కొందరు అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది చిన్న పరికరం నుంచి నియంత్రికల వరకు లెక్కాపత్రం లేకుండా విక్రయి ంచి రూ.లక్షలు దోచేశారు. కొన్ని మండలాలకు సామగ్రి తీసుకెళ్లడమే తప్ప అమర్చింది లేదు. అవి ఎక్కడున్నాయో తెలియదు. ఉ న్నతాధికారుల ఆదేశాలతో ప్రత్యేక అధికారులు నియంత్రికలు, అనుబంధ పరికరాల లెక్క తేలుస్తున్నారు.

**సమస్యలుంటే ఫిర్యాదు చేయండి**

వ్యవసాయ సర్వీసుల జారీ శరవేగంగా సాగుతోంది. నియంత్రికలు, అనుబంధ పరికరాల సమస్య ఎక్కడా లేదు. అవసరం మేరకు అందుబాటులో ఉన్నాయి. మార్గదర్శకాల ప్రకారం సర్వీసుల జారీ ప్రక్రియ పూర్తి చేస్తున్నాం. ఎక్కడైనా జాప్యమవుతుంటే రైతులు మా దృష్టికి తెస్తే పరిష్కరిస్తాం. టోల్‌ఫ్రీ 1912కి చేయొచ్చు. ఇస్మాయిల్ అహ్మద్, విద్యుత్తు ఎస్ఈ

# ఆదిలోనే.. 'వర్రీ'

సూళ్లూరుపేట : గిట్టుబాటు ధరల్లేక ధాన్యం రైతులు మరోసారి దగాపడుతున్నారు. వారంరోజుల కిందటి వరకు ఎంటీయూ 1010 వరి రకం బస్తా (75కిలోలు) రూ.1450 చొప్పున వ్యాపారులు కొనుగోలు చేశారు. నాటికి వంద తెగ్గోశారు. కేఎన్ఎం 1638 రకం బస్తా ధర రూ.1470 వరకు పలుకుతోంది. ఈ ధరలు మరింత తగ్గే అవకాశం ఉందని వ్యవసాయాధికారులతో పాటు రైతులు చెబుతు న్నారు. ఈ ఏడాదిలో జిల్లాలో ఏప్రిల్ తర్వాత వర్షాలు పడటంతోపాటు తెలుగుగంగ నీరు విడుదల చేయడంతో అన్నదాతలు ముందస్తు ఖరీఫ్ కింద (ఎడగారు) వరి పెద్దఎత్తున సాగుచేశారు. ప్రస్తుతం కోతలు మొదలయ్యాయి. తిరుపతి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, నాయుడుపేట, గూడూరు, సత్యవేడు ప్రాంతాల్లో సాగు అధికంగా ఉండగా ఎకరాకు దిగుబడి 32 నుంచి 38 బస్తాల వరకు వస్తోంది. పంట నూర్పిళ్లు చేసి రోడ్లపైన ఇతర ప్రాంతాల్లో ఆరబెడుతున్నారు. మరోవైపు వర్షాలు వస్తుండటంతో నిల్వ చేయలేక ప్రస్తుత ధరలకు అమ్ముకోలేక అవస్థలు పడుతున్నారు. కనీసం పెట్టుబడి చేతికందని పరిస్థితి.



ఈ ధాన్యాన్ని ఎఫ్‌సీఐ కొనుగోలు చేయాల్సి ఉందని, బుధవారం పౌరసరఫరాల మంత్రి పేషీ నుంచి వివరాలు అడగడంతో మండలాల వారీగా పంపినట్లు పౌర సరఫరాల సంస్థ డీఎం బాలకృష్ణ తెలిపారు.

**ఎగుమతులు లేవన్న సాకుతో..**

రైస్ మిల్లర్లు ఎంటీయూ 1010 రకం కొనుగోలుకు వెనకడుగు వేస్తున్నారు. అదేమంటే ఎగుమతులు లేవని చెబుతున్నారు. పీడీఎస్ బియ్యాన్ని కిలో రూ.32 చొప్పున ఎగుమతిదారులు కొనుగోలు చేస్తున్నా వీటిని రూ.29లకు తీసుకునేందుకు కూడా ముందుకు రావడం లేదు. గతంలోనూ ఈ రకం ధాన్యానికి గిట్టుబాటు ధరలేక అన్నదాతలు అవస్థలు పడ్డారు. ప్రభుత్వం స్పందించి కొనుగోలు చేయడంతో ఇబ్బందులు తప్పాయి.

**జిల్లాలో వరి రకం, సాగు హెక్టార్లలో..**

ఎంటీయూ1010 : 23,623

కేఎన్ఎం1638 : 4,186

ఏడీటీ43 : 1,770

# కొంగొత్తగా జంగిల్ బెల్స్!

అనంతగిరి: ప్రముఖ పర్యాటక విడిది ప్రాంతం 'టైడా జంగిల్‌బెల్స్' కొత్త రూపును సంతరించుకోనుంది. ఎకో టూరిజం ప్రాజెక్టు కింద దీన్ని సుమారు 20 ఏళ్ల క్రితం ఏర్పాటు చేశారు. ఇక్కడ ఉడెన్, ఎరకాన్, ఇగ్లూ, బ్రిడ్జ్ వంటి 20 రకాల కాటేజ్‌లను నిర్మించారు. వీటిలో చాలావరకు ఉడెన్, ఎరకాన్ కాటేజ్‌లు పాడైపో యాయి. ఇగ్లూ కాటేజ్‌లు మరమ్మతులకు గురికాగా.. మరమ్మతులు చేపట్టారు. ఉడెన్, ఎరకాన్ కాటేజ్‌లు అలాగే ఉండిపోవడంతో పర్యాటకులు కాస్త ఇబ్బందులు పడేవారు. గత ప్రభుత్వం వీటి నిర్మాణంపై పెద్దగా దృష్టి సారించలేదు. కూటమి ప్రభుత్వం వీటికి



కొత్త రూపు తీసుకొచ్చేందుకు దృష్టి సారించింది. పాడైన ఎరకాన్, ఉ డెన్ వంటి 12 కాటేజ్‌లను తొలగించి వాటి స్థానంలో నూతనంగా టెంట్ కాటేజ్‌ల నిర్మాణానికి చర్యలు చేపట్టింది. జంగిల్‌బెల్స్ పర్యాటకు లకు దట్టమైన అడవిలో వింత అనుభూతి ఇస్తుండగా.. తాజా మార్పులతో మరింతగా ఆకర్షించేందుకు ముస్తాబు అవుతోంది. ప్రస్తుతం ఈ పనులు జోరుగా సాగుతున్నాయి. వీలైనంత త్వరగా వీటి నిర్మాణం పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఇన్‌ఛార్జి మేనేజర్ గౌరీశంకర్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా వర్చువల్‌గా వీటిని ప్రారంభించనున్నట్లు చెప్పారు.

# ఉన్నత విద్యకు.. ఆర్థిక అండ

తిరుపతి : ఉన్నతవిద్యను అభ్యసించాలని ఉన్నా ఆర్థిక స్థోమత లేని విద్యార్థులకు 'పీఎం విద్యాలక్ష్మి' పథకం చేయూతనిస్తోంది. పథకం పరిధిలో మొత్తం 86 రకాల విద్యారుణాలు మంజూరు చేస్తున్నారు. దేశంలో పేరున్న 860 విద్యాసంస్థల్లో ప్రవేశం పొందినవారికి ఎలాంటి సెక్యూరిటీ, గ్యారంటీలు అవసరం లేదు. ప్రతిభావంతులైన విద్యార్థుల చదువు సజావుగా సాగేందుకు కేంద్ర ప్రభుత్వం, రిజర్వ్ బ్యాంకు సహకరిస్తున్నాయి. అన్ని బ్యాంకులు విధిగా విద్యారుణాలు మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వం, రిజర్వ్ బ్యాంకు లక్ష్యాలు నిర్దేశిస్తున్నాయి. జిల్లాలో మొత్తం 35 బ్యాంకులు ఉండగా వాటి పరిధిలోని 402 శాఖల ద్వారా గత ఆర్థిక సంవత్సరంలో రూ.66.60 కోట్ల లక్ష్యాన్ని అధిగమించి అదనంగా రూ.2.19 కోట్లు మంజూరు చేశాయి. ప్రస్తుత విద్యాసంవత్సరం ప్రారంభమవుతున్న తరుణంలో 2025– 26 ఆర్థిక సంవత్సరానికి వీలైనంత ఎక్కువమందికి రుణాలు మంజూరు చేయాలనే ఉద్దేశంతో రూ.145.22 కోట్లు లక్ష్యంగా పెట్టుకున్నారు. **రుణం ఇలా పొందొచ్చు**

తొలుత పీఎం విద్యాలక్ష్మి పోర్టల్‌లో నమోదవ్వాలి. తర్వాత దరఖాస్తు పూరించి చివరగా రుణం పొందాలనుకునే బ్యాంకును ఎంచుకోవాలి. ఒకేసారి గరిష్ఠంగా మూడు వేర్వేరు బ్యాంకుల్ని ఎంపిక చేసుకోచ్చు. ఆ ప్రక్రియ పూర్తయితే రుణానికి సంబంధించిన వివరాలు చరవాణి, ఈ–మెయిల్‌కు ఎప్పటికప్పుడు వస్తుంటాయి. అందుకు అనుగుణంగా ముందుకు సాగాల్సి ఉంటుంది. **అన్ని ప్రభుత్వరంగ బ్యాంకుల్లో...** రూ.4 లక్షల వరకు ఎలాంటి పూచీకత్తు లేకుండా అన్ని ప్రభుత్వరంగ బ్యాంకుల్లో రుణం పొందవచ్చు. రూ.7.5 లక్షల వరకు 5 శాతం మార్జిన్ చెల్లించాల్సి ఉంటుంది. ర్యాంకింగ్ ఉన్న వర్సిటీలు, విద్యాసంస్థలకు అనుగుణంగా రుణాలు పొందవచ్చు. విదేశాల్లో చదువుకునేవారు తప్పనిసరిగా సెక్యూరిటీ చూపించాలి. గుంటూరు రవికుమార్, ఎల్‌డీఎం


చురకలు



# అందాల శర్మ మిర్రర్ సెల్ఫీ

సేవ్ ది టైగర్స్ సిరీస్‌తో తెలుగు ప్రేక్షకులకు చేరువ అయిన ముద్దుగుమ్మ దేవియాని శర్మ. అంతకు ముందు కూడా చాలా సినిమాల్లో కనిపించిన దేవియాని శర్మ పెద్దగా గుర్తింపు దక్కించుకోలేదు. కనీసం నోటెడ్ కూడా కాలేదు. ఎప్పుడైతే ఆ వెబ్ సిరీస్‌లో కనిపించిందో అప్పటి నుంచి మంచి గుర్తింపు దక్కించుకుంది. సోషల్ మీడియాలో ఈమె ఫాలోయింగ్ పెరిగింది. సినిమా ఆఫర్లు వరుసగా రావడం లేదు, కానీ ఖచ్చితంగా మంచి ఫ్యూచర్ ఉన్న నటి అంటూ చాలా మంది కామెంట్స్ చేస్తున్నారు. ఆకట్టుకునే అందంతో పాటు మంచి ఫిజిక్ ఈ అమ్మడి సొంతం అవ్వడం వల్ల సోషల్ మీడియాలో ఈమె ఏ ఫోటోలు షేర్ చేసినా అందరి దృష్టిని ఆకర్షించడం మనం చూస్తూనే ఉన్నాం. తాజాగా మరోసారి ఈ ఫోటోలతో దేవియాని శర్మ తన అందంతో ఆకట్టుకుంది.

**స్కిన్ షో తో దేవియాని శర్మ...** సోషల్ మీడియాలో సెలబ్రిటీలు రెగ్యులర్‌గా ఫోటోలు షేర్ చేస్తూ ఉంటారు. అయితే చాలా తక్కువ మంది ఫోటోలు మాత్రమే చూడగానే వావ్ అనిపించేంత అందంగా ఉంటాయి, కొన్ని ఫోటోలు చూడగానే అంతకు మించి అన్నట్లుగా అనిపిస్తాయి. దేవియాని శర్మ ఎప్పుడు ఫోటోలు షేర్ చేసినా నెటిజన్స్ వావ్ అంటూ తెగ కామెంట్స్ చేస్తారు. ఆకట్టుకునే అందంతో పాటు మంచి ఫిజిక్ ఈ అమ్మడి సొంతం కావడం వల్ల ఎలాంటి ఔట్ ఫిట్



ధరించిన భలే సెట్ అవుతుందని చాలా మంది అంటూ ఉంటారు. సాధారణంగానే హీరోయిన్స్ స్కిన్ షో చేస్తూ ఉంటారు. ఇక ఈమె స్కిన్ షో ఫోటోలు సైతం రెగ్యులర్‌గా సోషల్ మీడియాలో షేర్ అవుతూ ఉంటాయి. కొందరు స్కిన్ షో చేస్తే చూడ్డానికి ఎబ్బెట్టుగా ఉంటుంది. కానీ దేవియాని శర్మ మాత్రం చూడముచ్చటగా ఉంటుంది.

**మిర్రర్ సెల్ఫీతో అందం...** తాజా మిర్రర్ సెల్ఫీలో బ్లాక్ పాయింట్ వేసుకుని, బ్లాక్ టాప్‌లో నడుము అందం చూపిస్తూ దేవియాని శర్మ చూపరులను ఆకట్టుకుంది. దేవియాని శర్మ ఇంతం అందంగా ఉన్నా ఆఫర్లు దక్కక పోవడం విచారకరం అంటూ కొందరు ఇన్‌స్టాలో పాపం అంటూ కామెంట్స్ చేస్తున్నారు. నటిగా దేవియాని శర్మ ముందు ముందు మరిన్ని సినిమాలు చేయాలని కోరుకుంటున్నారు. తప్పకుండా ఈమె ఈ అందంతో మరిన్ని ఆఫర్లు దక్కించుకునే అవకాశాలు ఉన్నాయి. స్టార్ హీరోయిన్స్‌కి ఏమాత్రం తగ్గకుండా దేవియాని శర్మ అందంగా ఉందని, ఆమె సోషల్ మీడియాలో ఇదే రేంజ్‌లో అందంగా ఉన్న ఫోటోలను షేర్ చేయడం ద్వారా ఖచ్చితంగా ముందు ముందు అయినా ఆఫర్లు దక్కించుకుంటుంది అంటూ చాలా మంది అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

**సేవ్ ది టైగర్స్ ముద్దుగుమ్మ షో..** సేవ్ ది టైగర్స్ వెబ్ సిరీస్ లో మొత్తం ముగ్గురు ముద్దుగుమ్మలు ఉంటాయి. అయినా కూడా ఈమెకు ప్రత్యేకంగా గుర్తింపు లభించింది. ఆ వెబ్ సిరీస్‌లో పెద్దగా స్కిన్ షో చేయలేదు, అయినా కూడా ఆమె పాత్ర గురించి ప్రముఖంగా మాట్లాడుకున్నారు. అంతే కాకుండా దేవియాని శర్మ నటన గురించి ఆ వెబ్ సిరీస్ స్ట్రీమింగ్ సమయంలో ప్రముఖంగా చర్చ జరిగింది. అందంతో పాటు యాక్టింగ్ ప్రతిభ కూడా ఉన్న దేవియాని శర్మ తప్పకుండా ముందు ముందు ఇండస్ట్రీలో నిలదొక్కుకుంటుంది అనే విశ్వాసం వ్యక్తం అవుతోంది. కేవలం తెలుగు సినిమాల్లో మాత్రమే కాకుండా ఈమె ఇతర భాషల సినిమా ఇండస్ట్రీలోనూ ఆఫర్ల కోసం ప్రయత్నాలు చేయడం మంచిదని, అక్కడ అయినా ఈమెకు లక్ కలిసి వస్తుందేమో అనే అభిప్రాయంను కొందరు కామెంట్స్ రూపంలో షేర్ చేస్తున్నారు.

# డైరెక్టర్ గా షాక్ ఇచ్చిన చిరుత పిల్ల!

ఓడలు బళ్లు అవుతాయి. బళ్లు ఓడలవుతాయంటారు. తాజాగా ఈ మాట మరోసారి నిజం చేసేలా ఉంది ముంబై బ్యూటీ నేహాశర్మ. ఈ బ్యూటీ టాలీవుడ్ కి చిరుత సినిమాతో ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. తొలి సినిమాతోనే గ్రాండ్ హిట్ అందుకుంది. కానీ ఆసక్సెస్ ని కంటున్యూ చేస్తూ తెలుగులో అవకాశాలు అందుకోవడంలో విఫలమైంది. రెండు..మూడు తెలుగు సినిమాలతోనే బాలీవుడ్ కి పరిమితమైంది.

**హాట్ బ్యూటీ కొత్త అవతారం:** కెరీర్ ఆరంభంలోనే హిందీ అవకాశాలతో బిజీ అయింది. కానీ నటిగా మాత్రం రావాల్సినంత గుర్తింపు రాలేదు. ఖాళీగా లేకుండా దశాబ్దం పాటు ప్రయాణాన్ని కొనసాగించింది గానీ ఇండస్ట్రీలో నటిగా తన మార్క్ మాత్రం వేయలేకపోయింది. సినిమా ల్లో నటికంటే? సోషల్ మీడియాలో చిట్టిపొట్టి దుస్తుల్లోనే ఎక్కువగా ఫేమస్ అయింది. ఇన్ స్టా వేదికగా అమ్మడు చేసే అందాల రచ్చ అంతా ఇంతా కాదు.

**నిర్మాతగా స్టార్ హీరో:** తాజాగా ఈ బ్యూటీ దర్శకురాలిగా కొత్త ప్రయాణానికి రెడీ అవుతోంది. అదీ ఆషామాషీ చిత్రం కాదు. ఏకంగా



ఓ భారీ యాక్షన్ చిత్రానికే సంకల్పించింది. ఇందులో సిద్దాంత్ చతుర్వేది, మోహిత్ కీలక పాత్రలు పో షిస్తున్నారు. 1985 నేపథ్యంలో సాగే పిరియాడిక్ చిత్రమిది. ఈ చిత్రాన్ని నిర్మిస్తుంది చిన్న చితాకా హీరో కాదు. నేహాశర్మ ట్యాలెంట్ ను నమ్మి ఏకంగా బాలీవుడ్ స్టార్ అజయ్ దేవగణ్ కోట్ల రూపాయలు ఖర్చు చేయడానికి రెడీ అవుతున్నారు.

**ఇదో సంచలనం:** ఆయన సొంత నిర్మాణ సంస్థలోనే ఈ చిత్రం నిర్మాణం కానుంది. దీంతో నేహా శర్మ పేరు మరోసారి నెట్టింట హాట్ టాపిక్ గా మారింది. అమ్మడిలో క్రియేటివ్ యాంగిల్ కూడా ఉందా? అని చర్చించుకుంటున్నారు. ఏ పుట్టలో ఏ పాముందో ఎవరికి ఎరుక? అన్నట్లు ఎవరి ట్యాలెంట్ ఎంత? అన్నది ముందే అంచనా వేయ లేం. నటిగా ఫేం సాధించలేని బ్యూటీ దర్శకురాలిగా సక్సెస్ అయితే? ఆమె జాతకమే మారిపోతుంది. అసలే బాలీవుడ్ లో లేడీ డైరెక్టర్లు చాలా తక్కువ. క్రియేటివ్ రంగంలో మహిళలు కూడా రాణించాలని మేథా వర్గం కోరుకుంటోన్న నేపథ్యంలో? నేహా శర్మ కెప్టెన్ కుర్చీ ఎక్కడం ఇప్పుడో సంచలనం.




# మెగా విశ్వంభర: 70లో నెవ్వర్ బిఫోర్ స్టైల్



టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి వయసు పెరుగుతున్నా క్రేజ్ అస్సలు తగ్గడం లేదు. ఇకపోతే ఆయన కొత్త సినిమాలు ఒక్కోటి అప్‌డేట్ ఇస్తున్న కొద్దీ హైప్ రెట్టింపు అవుతుంది. ప్రస్తుతం మెగాస్టార్ వరుస ప్రాజెక్టులలో బిజీగా ఉన్నారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఓ ఎంటర్‌టైనర్, బాబీతో మరో మాస్ ప్రాజెక్ట్, అలాగే విశ్వంభర అనే సోషియో ఫాంటసీ అడ్వెంచర్ ఇప్పటికే లైన్‌లో ఉన్నాయి. ఈ సినిమాలు అన్ని విభిన్న జానర్స్‌లో ఉండటంతో ఫ్యాన్స్‌కి ఫుల్ ట్రీట్ దక్కనుంది. 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ మల్లిడి దర్శకత్వంలో వస్తున్న విశ్వంభర, ఇప్పటికే టాలీవుడ్‌లోనే కాకుండా ఇండియన్ సినిమా స్థాయిలోనూ పెద్ద అంచనాలు క్రియేట్ చేసింది. యూవీ క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్ ఫ్యాంటసీ, విజువల్ ఎఫెక్ట్స్‌తో అద్భుతమైన అనుభూతిని అందిస్తుందని మేకర్స్ చెబుతున్నారు. కీరవాణి సంగీతం, భారీ తారాగణం ఈ సినిమాపై అంచనాలను మరింత పెంచాయి. చిరంజీవి 70వ బర్త్‌డే సందర్భంగా మేకర్స్ ఓ కొత్త పోస్టర్ రిలీజ్ చేశారు. అందులో చిరంజీవి తన స్టైల్‌కు సిగ్నేచర్ లాంటి డ్యాన్స్ పోజ్‌తో కనిపించడం ఫ్యాన్స్‌ను తెగ ఆకట్టుకుంది. ఫుల్ ఎనర్జీతో, చార్మింగ్‌గా ఉన్న ఈ లుక్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇప్పటికే రిలీజ్ చేసిన గ్లింప్స్‌తో పాటు ఈ పోస్టర్ కూడా సినిమాపై అంచనాలను మరింత రెట్టింపు చేసింది. ఇక ఫ్యాన్స్ ట్రెండింగ్ హ్యాష్‌ట్యాగ్స్‌తో విశ్వంభర పోస్టర్‌ను విస్తృతంగా షేర్ చేస్తున్నారు. ఇది మాత్రం మెగా మాస్ బియాండ్ యూనివర్స్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు. చిరంజీవి వయసుతో సంబంధం లేకుండా ఇంత స్టైల్‌గా, యంగ్ లుక్‌లో కనిపించడం నెటిజన్లను ఆశ్చర్యపరుస్తోంది. విశ్వంభర సినిమా రిలీజ్ కోసం మేకర్స్ ఇప్పటికే క్లారిటీ ఇచ్చారు. వచ్చే ఏడాది సమ్మర్ 2026లో ఈ ప్రాజెక్ట్ గ్రాండ్‌గా థియేటర్స్‌కి రానుంది. అప్పటివరకు గ్లింప్స్, పోస్టర్స్, టీజర్స్‌తో ఫ్యాన్స్‌ని ఎంటర్‌టైన్ చేయాలని ప్లాన్ చేస్తున్నారు. భారీ బడ్జెట్‌తో, వరల్డ్ క్లాస్ టెక్నికల్ స్టాండర్డ్స్‌తో వస్తోన్న ఈ సినిమా టాలీవుడ్ స్థాయిని మళ్లీ ప్రపంచానికి చాటనుంది.

# ఆర్యన్ ఖాన్ ఏదో గట్టిగానే ట్రై చేస్తున్నాడు!




భారతదేశంలోని ఒక పెద్ద సూపర్‌స్టార్ వారసుడు మరో స్టార్ అవుతాడని ప్రజలంతా ఎదురు చూస్తారు. కానీ అందుకు భిన్నంగా, తాను కెమెరా వెనక దర్శకుడిగా సెటిలవుతానంటే అది నిజంగా షాకిచ్చే పెద్ద విషయం. కానీ అలాంటి ఒక సాహసోపేతమైన నిర్ణయాన్ని ప్రకటించాడు కింగ్ ఖాన్ షారూఖ్ కుమారుడు ఆర్యన్ ఖాన్. అతడు దర్శకత్వం వహించిన తొలి వెబ్ సిరీస్ ది బాలిలిలిడ్స్ ఆఫ్ బాలీవుడ్ ఈ బుధవారం నాడు ట్రైలర్ విడుదల తరుణంలో సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇది ఒక బోల్డ్ వెబ్ సిరీస్ .. కానీ దానికి సంబంధించి కచ్చితమైన సమాచారం ఏదీ బయటకు లీక్ చేయలేదు. బాలీవుడ్ ప్రపంచంలోని చాలా గమ్మత్తయిన విషయాలను ఈ సిరీస్ లో రివీల్ చేస్తూనే, ఒక అందమైన ప్రేమకథను కూడా చూపిస్తున్నామని తొలి నుంచి కొన్ని విషయాల్ని రివీల్ చేసాడు ఆర్యన్. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, ప్రోమోకి మంచి స్పందన వచ్చింది. ఇంతకుముందు షారుఖ్ స్వయంగా ఈ సిరీస్‌ను ప్రమోట్ చేస్తూ ప్రోమో గురించి మాట్లాడారు. టీజర్‌లో రొమాన్స్, యాక్షన్, డ్రామా ఆకట్టుకుంటున్నాయి. విజువల్ రిచ్ గా ఈ వెబ్ సిరీస్ తెరకెక్కింది. సెప్టెంబర్ 18న ఈ సిరీస్ విడుదల కానుండగా, ట్రైలర్ వీక్షించాక ఆర్యన్ పనితనాన్ని పొగిడేస్తూ కరణ్ జోహార్ చాలా ఎగ్జయిట్ అయ్యాడు. ఆర్యన్ లవ్ యు.. ఇది అన్ని రికార్డులను బ్రేక్ చేస్తుంది! అంటూ ఒకటే ఉత్సాహం కనబరిచాడు. అలాగే మన లక్ష్య లీడ్ పాత్రలో కిల్ చేస్తున్నాడు అని కూడా ప్రశంసించాడు. ముఖ్యంగా కింగ్ ఖాన్ తన వారసుడిని ప్రమోట్ చేస్తున్న తీరు చూస్తుంటే వెబ్ సిరీస్ పై ఉత్కంఠ అంతకంతకు పెరుగుతోంది. షారూఖ్ వారసుడిగా ఆర్యన్ పై చాలా ఒత్తిడి ఉంది. అందరి దృష్టి ఇప్పుడు అతడి మొదటి ప్రయత్నంపైనే.. అతడు తన తొలి వెబ్ సిరీస్ లో ఏం చూపించబోతున్నాడు? దర్శకుడిగా నిరూపించాడా లేదా? అనే ఉత్కంఠ నడుమ తాజాగా ట్రైలర్ విడుదలైంది. ట్రైలర్ ఆద్యంతం విజువల్ గా మెరిపించింది. బాలీవుడ్ స్వప్న ప్రపంచం అందరికీ చిక్కనిది.. అనే డైలాగ్ తో ట్రైలర్ ని ప్రారంభించారు. కథానాయకుడు లక్ష్యను యాక్షన్ స్టార్ గా ఆవిష్కరించారు. అతడు బాలీవుడ్ లో అవకాశాల కోసం ప్రయత్నించే యువకుడిగా కనిపించనున్నాడు. అలాగే ఇందులో అతిథులుగా సల్మాన్ ఖాన్, రణ్ వీర్ పాత్రలను కూడా పరిచయం చేసారు.

ఇండస్ట్రీ గ్లామ్ అండ్ గ్లింప్స్ ని హైలైట్ చేసిన ఈ ట్రైలర్ లో అజయ్ తల్వార్ గా బాబి డియోల్ పాత్రను ఇతరుల కంటే చాలా స్పెషల్ గా ఆవిష్కరించారని చెప్పాలి. అతడి లుక్, ఎంట్రీ ప్రతిదీ అందరి దృష్టిని ఆకర్షించాయి. సినీ పరిశ్రమ నేపథ్యంలో కాన్సెప్ట్ కాబట్టి ఇందులో పెద్దగా చెప్పుకోవడానికి ఏమీ కనిపించలేదు. కానీ ఆర్యన్ ఏదో కొత్తగా ప్రయత్నిస్తున్నాడని మాత్రం అర్థం చేసుకోవచ్చు. నెట్ ఫ్లిక్స్ లో ఈ సిరీస్ సెప్టెంబర్ 18 నుంచి అందుబాటులోకి రానుంది.

# నడుము వయ్యారాలతో ఆశలు రేకెత్తిస్తున్న సిమ్రాన్ చౌదరి!

ప్రస్తుత కాలంలో చాలామంది హీరోయిన్లు సోషల్ మీడియాను వేదికగా చేసుకొని ఫాలోవర్స్ ను పెంచుకునే పనిలో పడ్డారు. అందులో భాగంగానే నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ వరుస గ్లామర్ ఫోటోలతో ఫాలోవర్స్ కి ఊపిరాడకుండా చేస్తున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా యంగ్ హీరోయిన్లే కాదు సీనియర్ హీరోయిన్లు అలాగే స్టార్ హీరోయిన్లు కూడా ఇలా వయ్యారాలు వలకబోస్తూ భారీ పాపులారిటీ సొంతం చేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే తన అందంతో అభిమానులను మరొకసారి ఆకట్టుకోవడానికి సిద్ధం అయ్యింది సిమ్రాన్ చౌదరి.

**గ్లామర్ తో హీట్ పెంచిన సిమ్రాన్ చౌదరి..** ఇంస్టాగ్రామ్ వేదికగా కొన్ని ఫోటోలు షేర్ చేసుకున్న ఈ ముద్దుగుమ్మ.. అందులో తన అందాలతో అభిమానులకు ఆశలు రేకెత్తిస్తోంది అని చెప్పవచ్చు. తాజాగా బ్లాక్ కలర్ చీర కట్టుకున్న ఈమె తన మేని ఛాయను ఎలివేట్ చేస్తూ అందాలతో ఉక్కిరిబిక్కిరి చేసింది. పైగా ఒక చేత్తో చీర కొంగును పైకి ఎత్తి.. నడుము వయ్యారాలని చూపిస్తూ..నాభి అందాలను హైలెట్ చేస్తూ గిలిగింతలు పెడుతోంది. ప్రస్తుతం సిమ్రాన్ చౌదరి షేర్ చేసిన ఈ బ్లాక్ సారీ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి.



ఇవి చూసిన ఫాలోవర్స్ భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

**12 ఏళ్ళ వయసులోనే ఇండస్ట్రీలోకి ఎంట్రీ..** సిమ్రాన్ చౌదరి విషయానికి వస్తే.. 1996లో హైదరాబాదులో జన్మించిన ఈ చిన్నది.. హైదరాబాదులోని డిఆర్ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్లో పదవ తరగతి పూర్తి చేసింది. ఆ తర్వాత సెంట్ ఫ్రావిన్స్ ఉమెన్స్ డిగ్రీ కాలేజీలో డిగ్రీ పూర్తి చేసిన ఈమె.. నటన పైన ఇష్టంతో ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది. వాస్తవానికి 12 ఏళ్ల వయసులోనే కమర్షియల్ యాడ్స్ లో నటించడం మొదలుపెట్టింది.

**మిస్ ఫెమినా ఇండియాగా కిరీటం..** ఆ తర్వాత మోడలింగ్ రంగంలోకి అడుగు పెట్టింది.. ఇక 2012లో మిస్ ఆంధ్ర ప్రదేశ్ గా టైటిల్ ని అందుకున్న ఈ ముద్దుగుమ్మ 2017లో మిస్ ఫెమినా ఇండియా తెలంగాణ అవార్డు సైతం సొంతం చేసుకుంది.

**సిమ్రాన్ చౌదరి సినీ రంగ ప్రవేశం..** మోడలింగ్ చేస్తున్న సమయంలోనే 2014లో వచ్చిన 'హమ్ తుమ్' అనే సినిమా ద్వారా సినీ ఇండస్ట్రీ రంగ ప్రవేశం చేసింది సిమ్రాన్ చౌదరి. ఆ తర్వాత ఈ నగరానికి ఏమైంది, చెక్, బొంభాట్, పాగల్, సెహరి , అథర్వ, ఆ ఒక్కటి అడక్కు , లవ్ మీ వంటి చిత్రాలలో నటించింది. 2024 తర్వాత మళ్లీ ఈ ఏడాది ఒక్క సినిమాలో కూడా అవకాశం అందుకోలేదు ఈ చిన్నది. కనీసం ఇప్పుడైనా దర్శకుల నిర్మాతల కంట్లో పడి అవకాశాలు అందుకుంటుందేమో అని అభిమానులు కూడా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. తన అందంతో అందరినీ ఆకట్టుకుంటున్న ఈ ముద్దుగుమ్మ.. సినిమాలలో మళ్లీ అవకాశాలు అందుకోవాలని అభిమానులు కామెంట్లు చేస్తున్నారు.

# త్రిష, నయన్ ఇక్కడ ఫైట్ షురూ..?

కోలీవుడ్ స్టార్ హీరోయిన్స్ త్రిష, నయనతార ఇద్దరు కూడా అక్కడ ఇప్పటికీ మంచి ఫాం కొనసాగిస్తున్నారు. నయనతార అయితే లేడీ సూపర్ స్టార్ గా అదరగొట్టేస్తుంది. ఐతే మధ్యలో త్రిష కూడా నయన్ కి పోటీగా వస్తుంది. ఈమధ్య త్రిష తమిళ్ లో వరుస స్టార్ ఛాన్స్ లతో అదరగొట్టేస్తుంది. త్రిష, నయనతార కోలీవుడ్ ఫైట్ కొనసాగుతుంది. ఐతే ఈ ఫైట్ కేవలం తమిళ్ లో మాత్రమే కాదు తెలుగు సినిమాలకు వచ్చింది.

**విశ్వంభర సినిమాలో త్రిష..** మెగా 156 సినిమాగా వస్తున్న విశ్వంభర సినిమాలో చిరంజీవికి జతగా నటిస్తుంది త్రిష. దాదాపు 13, 14 ఏళ్ల తర్వాత త్రిష తెలుగు సినిమా చేస్తుంది. విశ్వంభర ఆమెకు తెలుగులో మళ్లీ ఫాం కొనసాగించేలా చేస్తుందని నమ్ముతుంది. ఐతే త్రిష వచ్చిందో లేదో మెగా 157 సినిమాకు నయనతార మళ్లీ టాలీవుడ్ రీ ఎంట్రీ ఇస్తుంది. అంతకుముందు తమిళ్ తో పాటు తెలుగులో కూడా వరుస సినిమాలు చేసిన నయనతార ఎందుకో అమ్మడు సడెన్



గా తెలుగు సినిమాలు ఆపేసింది. ఐతే ఇప్పుడు మళ్లీ మెగాస్టార్ చిరంజీవి, అనిల్ రావిపూడి కాంబో సినిమాలో ఆమె నటిస్తుంది. మెగా 157 సినిమాగా వస్తున్న ఈ మూవీ 2026 సంక్రాంతికి వస్తుంది. ఐతే చిరంజీవి వరుస రెండు సినిమాల్లో త్రిష, నయనతార నటిస్తున్నారు. ఈ సినిమాలు వాళ్లిద్దరికి మళ్లీ తెలుగులో ఫాం లోకి తీసుకు వచ్చేలా ఉన్నాయి. ఐతే సినిమాల పరంగా తమిళ్ లో త్రిష, నయనతార పోటీ పడుతున్నారు. ఇద్దరు కూడా ఒక సినిమాకు ఆమె మరో సినిమాకు ఈమె అనేలా పరిస్థితి ఉంది.

**తమిళ్ లో కాదు తెలుగులో ఇద్దరు మధ్య పోటీ..** త్రిష, నయనతార మధ్య ఈ ఫైట్ ఇంట్రెస్టింగ్ గా మారింది. తమిళ్ లో కాదు తెలుగులో ఇద్దరు మధ్య జరుగుతున్న ఈ పోటీ ఆసక్తికరంగా మారింది. ప్రత్యేకంగా ప్లాన్ చేయకపోయిన సరే త్రిష, నయనతార ఇద్దరు కూడా సడేన్ గా తెలుగు సినిమాలు టార్గెట్ చేసుకున్నారు.

తెలుగులో హీరోయిన్స్ కు మంచి డిమాండ్ ఉంటుంది. తప్పకుండా మళ్లీ త్రిష, నయనతార తిరిగి ఫాంలోకి వస్తే మాత్రం వరుస సినిమాల్లో నటించే ఛాన్స్ ఉంటుంది. త్రిష ఐతే ఇప్పటికీ గ్లామరస్ గా అదరగొట్టేస్తుంది. ఆమెతో లవ్ స్టోరీ తీసినా తీయొచ్చు అనేలా ఉంది. నయనతార ఇంకా తన పవర్ ఫుల్ సినిమాలతో అదరగొట్టాలని చూస్తుంది. ఈ ఇద్దరు మళ్లీ తెలుగు సినిమాల్లో నటించడంతో వాళ్ల తెలుగు ఫ్యాన్స్ కి సూపర్ హ్యాపీ అనిపిస్తుంది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536